

శతారుణ గీతాంజలి
రూ॥ 180/-
పేజీలు: 180
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్), హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(ఆబిడ్స్),హిమాయత్‌నగర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్
హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం


ప్రతి అక్షరం ప్రజల కోసం

సంపుటి 09, సంచిక: 194 | ఆదివారం | 14-06-2026 | ఖమ్మం | Published from: **Khammam, Hyderabad, Karimnagar, Mahabubnagar** | పేజీలు: 12+8 | వెల రూ. 5.00

PRAJAPAKSHAM ★★★


## దొంగే దొంగ అన్నట్లు
# బిజెపి, బిఆర్ఎస్ నాటకాలు

- సింగరేణికి రూ.వేల కోట్ల నష్టం చేసింది బిఆర్ఎస్సే
- కోల్ బ్లాకుల వేలంలో పాల్గొనకుండా సింగరేణిని నిర్వీర్యం చేశారు
- గద్దల్ని, డేగల్ని, దళారుల్ని సింగరేణిలో అడుగుపెట్టనివ్వం
- సింగరేణిలో 335 కారుణ్య నియామకాలు : ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క



ప్రజాపక్షం / మంచిర్యాల

సింగరేణి సంస్థను బతికించుకుంటామని కార్మికులను రక్షించుకుంటామని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. శనివారం నాడు మంచిర్యాలలో 335 మందికి కారుణ్య నియామక పత్రాలు అం దించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిజెపి, బిఆర్ఎస్ పార్టీలపైనా నిప్పులు చెరిగారు. రెండు పార్టీలు బయటకి కొట్లాడుతున్నట్టు నటిస్తూ లోలోపల ఇద్దరూ ఒకటిగా మారిపోయి ప్రజలను మోసం చేస్తున్నారని. ఆయన తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. సింగరేణి సంస్థలోని డిపెండెంట్ ఎంప్లాయిస్ సమస్యలపై స్పందిస్తూ, ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్న కారుణ్య నియామకాల ప్రక్రియను వేగవంతం చేశామని భట్టి విక్రమార్క తెలిపారు. ఎంతో మంది కారుణ్య నియామకాల కోసం ఎదురుచూస్తున్నారు. వారి దరఖాస్తుల ను త్వరలోనే పరిశీలించి, అర్హులైన తరువాయి 8లో

**సింగరేణిలో బొగ్గు మాయంపై విచారణ జరపాలి ! సిఎం రేవంత్‌రెడ్డికి కిషన్‌రెడ్డి లేఖ**

# రోడ్డా... చెరువా?



- గ్రేటర్ హైదరాబాద్‌లో భారీ వర్షం
- శంషాబాద్ ప్రధాన రహదారిని ముంచెత్తిన నీరు
- వాహన రాకపోకలకు తీవ్ర అంతరాయం
- విమానాశ్రయంపైనా ప్రభావం
- మేడ్చల్ మల్కాజ్‌గిరి టెలికాం కాలనీలో విద్యుత్ తీగ తెగిపడి తండ్రీకూతుళ్లు మృతి
- వారం రోజులు ఉరుములు, మెరుపులతో భారీ వర్షాలు

**క్యూర్‌లో అధికార యంత్రాంగం అలర్ట్‌గా ఉండాలి : సిఎం**

ప్రజాపక్షం/హైదరాబాద్

హైదరాబాద్ నగరంలో శనివారం భారీ వర్షం కురిసింది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. నగరంలోని పలు ప్రాంతాల్లో కుండపోత వర్షం కురవడంతో రహదారులు జలమయమై ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఇదే సమయంలో మేడ్చల్ జిల్లా మల్కాజ్‌గిరి పరిధిలోని టెలికాం కాలనీలో విద్యుత్ తీగ తెగిపడటంతో తండ్రీకూతుళ్లు మృతిచెందిన విషాద ఘటన చోటుచేసుకుంది. హైదరాబాద్‌తో పాటు రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో సైతం వాతావరణం మేఘావృతమైంది. వర్షా ప్రభావిత వాతావరణ పరిస్థితులు శంషాబాద్ విమానాశ్రయంపైనా పడ్డాయి. పలు విమానాల రాకపోకలకు అంతరాయం కలిగింది. వాతావరణం అనుకులించకపోవడంతో విమానాలను దారిమళ్లించారు. ఢిల్లీ నుంచి హైదరాబాద్‌కు రావాల్సిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రయాణిస్తున్న విమానాన్ని కూడా బెంగళూరుకు తరలించారు. శనివారం మధ్యాహ్నం తరువాయి 8లో



**రెండు రోజుల్లో**

# మూడు క్షిపణి పరీక్షలు సక్సెస్

బహుళ స్థాయి బాలిస్టిక్ క్షిపణి రక్షణ వ్యవస్థను ప్రదర్శించిన డిఆర్‌డిఒ

**న్యూఢిల్లీ :** భారత రక్షణ పరిశోధన అభివృద్ధి సంస్థ (డిఆర్‌డిఒ) సరికొత్త రికార్డు సృష్టించింది. దేశ రక్షణ సామర్థ్యాన్ని మరింత బలోపేతం చేస్తూ రెండు రోజుల్లో వరుసగా మూడు కీలక క్షిపణి పరీక్షలను విజయవంతంగా నిర్వహించింది. ఈ పరీక్షలు జూన్ 10, 11 తేదీల్లో మల్టీ లేయర్ బాలిస్టిక్ క్షిపణి రక్షణ వ్యవస్థను ప్రయోగించింది. ఖండాతర బాలిస్టిక్ క్షిపణులను అడ్డుకునే సామర్థ్యం తరువాయి 8లో

**‘ఇండియా’ కూటమి సాగిస్తున్న**

# రాజకీయ, సైద్ధాంతిక పోరుకు మద్దతు

**సిపిఐ(ఎం) ప్రధాన కార్యదర్శి ఎం.ఎ. బేబీ**



**త్రిస్సూర్ :** బిజెపి, ఆర్ఎస్ఎస్‌కు వ్యతిరేకంగా ‘ఇండియా’ కూటమి సాగిస్తున్న విస్తృత రాజకీయ, సైద్ధాంతిక పోరాటానికి తమ పార్టీ కట్టుబడి ఉందని సిపిఐ(ఎం) ప్రధాన కార్యదర్శి ఎం.ఎ. బేబీ స్పష్టం చేశారు. జాతీయ రాజకీయాల్లో సిపిఐ(ఎం) భాగస్వామిగా ఉండేలా ఏదైనా ‘మూడవ కూటమి’ (థర్డ్ ఫ్రంట్) ఏర్పడే అవకాశం ఉందా అన్న ప్రశ్నకు స్పందిస్తూ, తమ పార్టీ గత మహాసభల్లో (పార్టీ కాంగ్రెస్) ఆమోదించిన తీర్మానంలో రాజకీయ వైఖరిని స్పష్టంగా వివరించామని బేబీ చెప్పారు. ఫాసిస్ట్ సంస్థ అయిన ఆర్ఎస్ఎస్ నియంత్రణలో ఉన్న బిజెపిని ఓడించడమే అత్యంత ప్రధానమైన కర్తవ్యమని ఆ తీర్మానం పేర్కొంటోందని ఆయన అన్నారు. ‘ఆ లక్ష్యాన్ని సాధించడానికి రాజకీయ పార్టీలు, సామాజిక శక్తుల మధ్య సాధ్యమైనంత విస్తృతమైన ఐక్యతను నిర్మించాలి. ఆ కోణంలో చూస్తే, కాంగ్రెస్ వంటి పార్టీలతో మాకు అనేక రాజకీయ విభేదాలు ఉన్నప్పటికీ, తరువాయి 8లో

## ఫోన్ ట్యాపింగ్ కేసు.. మంత్రి తుమ్మల
# వాంగ్మూలం నమోదు

**ఆయన నివాసంలో పలు వివరాలు సేకరించిన సిట్ అధికారులు**



ప్రజాపక్షం/హైదరాబాద్


తెలంగాణలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసు దర్యాప్తులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసును విచారిస్తున్న ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) శనివారం రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు నివాసానికి వెళ్లి ఆయన వాంగ్మూలాన్ని అధికారికంగా నమోదు చేసింది. 2023 అసెంబ్లీ తరువాయి 12లో

## అమెరికా – ఇరాన్ మధ్య
# 24 గంటల్లో ఒప్పందం !

**ఎలక్ట్రానిక్ పద్ధతిలో సంతకాల ప్రక్రియ : పాక్ ప్రధాని షరీఫ్**



**ఇస్లామాబాద్:** అమెరికా–ఇరాన్ మధ్య 24 గంటల్లో యుద్ధ విరమణపై తుది విడత ఒప్పందం ఖరారు అవుతుందని పాకిస్థాన్ ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్ చెప్పారు. ఒప్పందం కుదిరిన వెంటనే తాము ఆన్‌లైన్‌లో ఎలక్ట్రానిక్ పద్ధతిలో సంతకాలు చేసేందుకు ఏర్పాట్లు చేస్తామని చెప్పారు. సంతకాలు జరిగిన తర్వాత తదుపరి సాంకేతికస్థాయిలో చర్చలు ప్రారంభం అవుతాయన్నారు. గడచిన ఏప్రిల్ నుండి ఇప్పటి వరకూ చర్చలు ఒప్పందానికి ఇంత దగ్గరగా రాలేదని అన్నారు. ముందు రోజు శుక్రవారం ట్రంప్ తొలి ప్రకటన చేస్తూ యూరప్‌లో ఈ సంతకాలు జరుగుతాయని, ఉపాధ్యక్షుడు జె.డి.వాన్స్ ఈ కార్యక్రమానికి హాజరవుతారని చెప్పారు. పశ్చిమాసియాలో నెలల తరబడి కొనసాగుతున్న యుద్ధాన్ని ముగించేందుకు వీలుగా అమెరికా–ఇరాన్ ఒక ఒప్పందానికి వచ్చాయని చెప్పారు. యుద్ధ ముగింపునకు సంబంధించి ఒప్పందంలో ఉపయోగించే పదజాలంపై ఒక అంగీకారానికి వచ్చినట్లు చెప్పారు. శాంతి ఒప్పందానికి ద్రోహం చేయాలని కోరుకునే వారు చాలా తీవ్రమైన దుష్ప్రచారం చేస్తున్నారన్న విషయం తమకు తెలుసునన్నారు. వీటినన్నింటినీ పక్కకునెట్టి తరువాయి 12లో







## ఎలా ఆలోచించాలో నేర్పాలి



యువతకు కేవలం ఏం ఆలోచించాలి అని చెప్పడం కాదు.. ఎలా ఆలోచించాలో చెప్పాలని తాజా అధ్యయన నివేదికలు స్పష్టం చేస్తున్నా యి. ఆలోచనా సామర్థ్యాన్ని పెంపొందించడం విద్య ప్రధాన లక్ష్యం కావాలి. సాధారణంగా మన విద్యా వ్యవస్థ లో విద్యార్థులకు సిద్ధమైన జ్ఞానం, సమాధానాలు, నియమాలు నేర్పిస్తారు. అయితే ఈ విధానం విద్యార్థులను అనుకరణలోనే ఉంచుతుందేతప్ప, స్వతంత్ర ఆలోచనను పెంపొందించదు. కానీ, నిజమైన విద్య అంటే ఆలోచనా ప్రక్రియను అవగాహన చేసుకోవడం. మన ఆలోచన అనేది కేవలం మాటల రూపంలో జరిగే ప్రక్రియ వరకే పరిమితం కాదు. అది భావాలు, జ్ఞాపకాలు, అనుభవాలు, ఊహాశక్తి, తర్కం, భావోద్వేగా ల సమ్మేళనం. ఈ అన్ని అంశాలు పరస్పరం ప్రభావితం చేసుకుంటూ మన నిర్ణయాలను, దృక్కోణాన్ని నిర్మిస్తాయి. ఇక్కడ ఒక ముఖ్యమైన అంశం భావోద్వేగాల పాత్ర. ఆలోచనలు, భావోద్వేగాలు విడదీయరాని సంబంధం కలిగి ఉంటాయి. మన భావోద్వేగాలు అస్థిరంగా ఉన్నప్పుడు, మన ఆలోచన కూడా తారుమారవుతుంది. అదే సమయంలో భావోద్వేగాలు సమతుల్యంగా ఉంటే, ఆలోచన స్పష్టతను, సృజనాత్మకతను పొందుతుంది. అందువల్ల విద్యలో భావోద్వేగాలను నిరోధించడం కాకుండా, వాటిని గుర్తించడం, అర్థం చేసుకోవడం, నియంత్రించడం నేర్పడం అత్యవసరం. ఈ విధమైన విద్య ద్వారా విద్యార్థులు తమ ఆలోచనల స్వభావాన్ని గుర్తించగలుగుతారు. ఏవి తక్షణ ప్రతిస్పందనలు, ఏవి లోతైన పరిశీల న ఫలితాలు అన్నది అర్థం చేసుకుంటారు.

## ఎలుగుబంటి సాహసయాత్ర



అలాస్కా ఉత్తర దిశలో ఉన్న బ్యూఫోర్ట్ సముద్రంలో ఒక ఆడ ధ్రువ ఎలుగుబంటి సాహయయాత్ర చరిత్ర సృష్టించింది. అది వరుసగా తొమ్మిది రోజులు ఈదుతూ సుమారు 426 మైళ్లు (687 కిలోమీటర్లు) ప్రయాణించింది. 2011లో జరిగిన ఈ ఘటన శాస్త్రీయంగా నమోదైన వాస్తవంగా రికార్డు పుస్తకాల్లోకి ఎక్కింది. మనుషుల్లో మాత్రమేగాక, జంతువులు, ఇతర జీవుల్లోనూ తల్లిప్రేమ ఎంత గొప్పదో నిరూపించే ఈ ప్రయాణాన్ని అమెరికా భూగర్భ సర్వే (యఎస్‌జిఎస్) శాస్త్రవేత్తలు జిపిఎస్ కాలర్ల సహాయంతో గమనించారు. పిల్లతోపాటు తల్లి ఎలుగుబంటి అత్యంత కఠినమైన వాతావరణాన్ని తట్టుకొని, ప్రమాదకరమైన ప్రయాణాన్ని పూర్తిచేసుకొని, సురక్షితంగా గమ్యానికి చేరుకుంది. ఈ ప్రయాణం తల్లి ఎలుగుబంటికి కూడా చాలా భారంగా మారింది. ఆమె తన శరీర బరువులో సుమారు 22 శాతం కోల్పోయింది. ఈ ఘటనకు ఆర్కిటిక్ ప్రాంతంలో సముద్ర మంచు వేగంగా కరిగిపోవడం ప్రధాన కారణం. సాధారణంగా ధ్రువ ఎలుగు బంట్లు ఈ మంచుపై నడుచుకుంటూ వేటకు వెళ్తాయి. కానీ వేసవికాలంలో మంచు తగ్గిపోవడం వల్ల, అవి ఆహారం కోసం చాలా దూరం ఈదాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది.

## గొప్ప ఉపాయం!



సిగరెట్ తాగడం, మద్యం సేవించడం వంటి అలాట్లు చేసుకోవడం సులభం. కానీ, వదులుకోవడం చాలా కష్టం. పొగ తాగడాన్ని మానుకోవడానికి, ఒకొక్కరూ ఒక్కో రీతిలో ప్రయత్నిస్తుంటారు. అయి తే, టర్కీకి చెందిన ఇబ్రహీం యూసెల్ అనే వ్యక్తి తన ఎంచుకున్న విధానం మాత్రం ఎంతో విచిత్రంగానూ, అందరినీ ఆకట్టుకునే విధంగానూ ఉంది. ఎన్నోసార్లు ప్రయత్నించినప్పటికీ విఫలమవడంతో, అతను తన తలకు ఒక లోహపు గేజ్‌లా ఉండే హెల్మెట్ తయారు చేసుకుని ధరించాడు. ఈ హెల్మెట్ వల్ల అతను సిగరెట్ తాగడం భౌతికంగా అసాధ్యమైంది. ఈ విచిత్రమైన కానీ కఠినమైన నిర్ణయం ప్రపంచవ్యాప్తంగా వైరల్ అయింది. ఒక వ్యక్తి తన అలవాటు నియంత్రించడానికి ఇంత తీవ్ర చర్యకు దిగాల్సి రావడం, నికోటిన్ మీద ఆధారపడటం ఎంత లోతుగా ఉంటుందో సూచిస్తుంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుహెచ్‌ఒ) ప్రకారం, ప్రపంచవ్యాప్తంగా ప్రతి సంవత్సరం సుమారు 8 మిలియన్ల మంది పొగాకు కారణంగా మరణిస్తున్నారు. ఇందులో నేరుగా ధూమపానం చేసే వారితో పాటు, పరోక్షంగా పొగను పీల్చే వారూ ఉన్నారు. ఆశ్చర్యకరంగా, రెండవ రకం పొగ వల్ల మాత్రమే సంవత్సరానికి దాదాపు 1.2 మిలియన్ల మంది ప్రాణాలు కోల్పోతున్నారు. ధూమపానం వ్యక్తిగత అలవాటుగా తీసుకోకూడదని, అది సమాజ ఆరోగ్యంపై కూడా ప్రభావం చూపుతుందని ఈ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. యూసెల్ చేసిన ప్రయత్నం కొంచెం విచిత్రంగా కనిపించినప్పటికీ, అలవాట్లను మార్చడానికి కేవలం సంకల్పం సరిపోదు. కొన్నిసార్లు నిర్మాణాత్మక నియంత్రణలు అవసరం అవుతాయి.

– బిఎస్ఎస్ మైత్రేయి

## అరుదైన రక్తవర్గం 'క్రిబ్'

భారత వైద్య పరిశోధనా రంగం ఒక అద్భుతమైన ఆవిష్కరణతో ప్రపంచం దృష్టిని ఆకర్షించింది. కర్ణాటకకు చెందిన ఒక మహిళలో ఇంతవరకు గుర్తించబడని అత్యంత అరుదైన 'క్రిబ్' అనే కొత్త రక్త వర్గాన్ని వైద్య నిపుణులు కనుగొన్నారు. ఈ కీలక ఆవిష్కరణ ప్రపంచవ్యాప్తంగా అరుదైన రక్త వర్గాల అధ్యయనానికి కొత్త దిశానిర్దేశం చేయనుంది. సాధారణ పరీక్షల నిమిత్తం ఆసుపత్రికి వచ్చిన 36 ఏళ్ల మహిళ రక్తాన్ని విశ్లేషించగా.. అందులో ప్రత్యేక యాంటీజెన్‌లు ఉండటాన్ని వైద్యులు గుర్తించారు. లోతైన పరిశోధనల అనంతరం ఇది 'క్రిబ్'గా నిర్ధారించారు. క్రిబ్ రక్త వర్గాన్ని కలిగి ఉన్న వ్యక్తులు ప్రపంచంలో కేవలం 10 మంది మాత్రమే ఉన్నారని అంచనా వేస్తుండగా.. అందులో ఒకరు భారత్‌లోనే ఉండడం గమనార్హంగా నిలుస్తోంది. సదరు మహిళ రక్తాన్ని లోతైన పరిశోధనలు నిమిత్తం బ్రిటన్‌లోని బ్రిస్టల్‌లో ఉన్న ఇంటర్నేషనల్ బ్లడ్ గ్రూప్ రిఫరెన్స్ ల్యాబొరేటరీకి పంపించారు. ఈ ల్యాబ్ 10 నెలల పాటు ఆమె రక్తంపై అధ్యయనం చేసింది. క్రోమర్ సిస్టమ్‌లో ఓ కొత్త యాంటీ జెన్ పదార్థం ఉన్నట్లు గుర్తించింది. ఈక్రమంలోనే క్రోమర్, బెంగళూరు పదాలను కలుపుతూ.. ఈ రక్తానికి క్రిబ్‌గా నామకరణం చేశారు. ఈ కొత్త రక్తవర్గం ఆవిష్కరణ రక్తం యొక్క జన్యుశాస్త్రం, వివిధ రక్తవర్గాల మధ్య సంబంధాలపై మరింత లోతైన అధ్యయనాలకు దారి తీస్తోందని పేర్కొన్నారు. ఈ ఆవిష్కరణకు ముందు ప్రపంచంలో అత్యంత అరుదైన రక్త వర్గాలలో 'బొంబాయి బ్లడ్ గ్రూప్' ఒకటిగా పరిగణించబడేది. ఈ ఆవిష్కరణ భారత వైద్య పరిశోధనల సామర్థ్యాన్ని మరోసారి చాటింది. బెంగళూరులోని ఆసుపత్రి వైద్య బృందం, రక్త శాస్త్రవేత్తల కృషి ఫలితంగానే ఈ విజయం సాధ్యమైంది.

**(జూన్ 14 ప్రపంచ రక్తదాతల దినోత్సవం)**

సుధాకర్.ఏ.వి, 9000674747

## 'బొద్దింకలు' విప్లవకారులా?

కాక్రోచ్ (బొద్దింక) జనతాపార్టీ (సిజెపి) అతివేగంగా వృద్ధి చెందుతున్న ఉద్యమం. అయితే అది ప్రచారం చేసుకుంటున్నట్లు నిజంగా అది యువజన ఉద్యమమా లేక కేవలం సోషల్ మీడియా లక్షణమా, ఇప్పటికీ ప్రశ్నగానే ఉంది. మనం గనుక దాన్ని న్యాయబద్ధమైన యువత ఉద్యమంగా పరిగణిస్తే దాన్ని కచ్చితంగా కొన్ని ప్రశ్నలు అడగటం, దాని భావజాలాన్ని విశ్లేషించటం అవసరం. దాని ప్రమోటర్స్‌లో అత్యధికులు ఈ విషయాన్ని విస్మరిస్తున్నారు. ఈ యువత ఉద్యమం ఎక్కడ వెనుకబడుతున్నదో కొన్ని అంశాలు పరిశీలించుదాం.

ఒక ఉద్యమం నిజాయితీ గూర్చి ముందుగా, ముఖ్యంగా తెలుసుకోవలసింది దాని భావజాలం లేదా సిద్ధాంతం. సిజెపి ఇప్పటివరకు దాని భావజాలమేమిటో వివరించలేదు. ఈ సంస్థ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కేకు లోగడ ఆమ్ ఆద్మీ పార్టీతో సంబంధాలున్నాయి. ఆ రోజుల్లో ఆప్ కూడా చిత్రంగా ప్రసిద్ధిపొందింది. ఆనాడు అదీ యువజనోద్యమమే. అది కూడా ఈనాటివరకు దాని భావజాలమేమిటో వెల్లడించలేదు. అయితే అవినీతికి వ్యతిరేకంగా పోరాడే ఆప్ అవినీతిలో మునగటాన్ని పంజాబ్ అసెంబ్లీలో ప్రతి ఒక్కరు చూశారు. ఆప్ తన ప్రచారంలో ఎల్లప్పుడూ 'విప్లవం' అనే మాట ఉపయోగిస్తుంది. అయితే దాన్ని అది అర్థం చేసుకోలేదు. ''సెక్యులర్, సోషలిస్టు, డెమొక్రటిక్, లేజీ (సోమరితనం)'' సిజెపి ధ్యేయంగా ప్రతిచోట ప్రచారంలో పెట్టబడుతున్నది. దాని అధికారిక సైట్, సోషల్ మీడియా హాండిల్స్, ఆ సంస్థ ప్రణాళికలో ఈ మాటలు ఒక్కసారి కూడా రాయబడలేదు. భావజాల సంక్షోభం విస్మరించవీలులేనిది. అతిపెద్ద రాజకీయ పార్టీ తన ఫాసిస్టు భావజాలానికి నిబద్ధమై ఉన్నప్పుడు, స్పష్టమైన భావజాలం లేని సంస్థ దానికి ప్రత్యామ్నాయం కాజాలదు.

సిజెపి భారత యువతకు ప్రాతినిధ్యం వహిస్తోందని అనుకోవటం భ్రమ. వాస్తవం ఏమంటే అది పట్టణ యువతకు ప్రాతినిధ్యం వహిస్తోంది. మిగతా యువతతో, ఇతర సాధారణ ప్రజలతో దానికి సంబంధం లేదు. దాని అధికారిక సైట్‌లో సభ్యత్వం పొందటానికి అర్హత విభాగంలో అది ఏమి చెప్పిందంటే, 'నిరుద్యోగులు, సోమరిపోతులు, నిరంతరం ఆన్‌లైన్‌లో ఉండేవారు, వృత్తిపరంగా వాగాడంబరులు' అర్హులని చెప్పింది. పట్టణ మధ్యతరగతులకు మాత్రమే ఈ సౌకర్యం ఉంటుంది. ఈ సంస్థకు ఎవరు ప్రాతినిధ్యం వహిస్తున్నారో లేక ఎవరికి ఈ సంస్థ ప్రాతినిధ్యం వహిస్తున్నదో ఇది తెలియజేస్తున్నది. ఇటీవల బిజెపి లో చేరిన ఆప్ మాజీ ఎంపి రాఘవ చెద్దాను తీసుకుందాం. ఆయన ఎప్పుడూ తనను యువజన నాయకునిగా చెప్పుకునేవాడు, ఆయనకు అత్యంత యువ ఎంపి టైటిల్ ఉంది. ఆయన కూడా మధ్యతరగతులకే ప్రాతినిధ్యం వహించారు, ఆ తరగతే ఆయనకు ప్రజాదరణ తెచ్చిపెట్టింది. సిజెపికి ఏ భావజాలంతోనూ సంబంధం లేదంటే అతిపెద్ద వర్గపోరాట సమస్యల్లో దానికి ఆసక్తిలేదని తెలుస్తున్నది. రాజకీయాలను వర్గ పోరాటం నుంచి వేరుచేయ వీలులేదు. ఒక సంస్థ కార్మికవర్గం పట్ల నిబద్ధత చూపటం లేదంటే, అది పెట్టుబడిదారీ వర్గ ప్రయోజనాలతో కలిసినట్లు నిశ్శబ్ద సంకేతం.

యావత్ సోషల్ మీడియా కాక్రోచ్ జనతాపార్టీని విప్లవ సంస్థగా పరిగణిస్తున్నది. అయితే ఎవరైనా విప్లవకారుడా, కాదా అని పరిశీలించటానికి సోషల్ మీడియా వ్యాఖ్యలు కొలమానం కాదు. మనం సిజెపి ప్రణాళికను పరిశీలించినట్లయితే అందులోని ఐదు అంశాలు అత్యంత ఇటీవలి సమస్యలకు ప్రతి స్పందనగా మనం చూస్తాం. ఒకటి పదవీ విరమణానంతర బహుమతిగా ఏ ప్రధాన న్యాయమూర్తికీ రాజ్యసభ సీటు ఇవ్వరాదు. ఇది ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ యువతపై చేసిన వ్యాఖ్య, ఇతర జడ్జీల ఇతర వ్యాఖ్యలకు ప్రతి స్పందన అనేది స్పష్టం అవుతూంది. రెండు, న్యాయబద్ధమైన ఓటర్లను తొలగించినందుకు సిఇసిని ఉపా కింద అరెస్టు చేయాలి. ఇది ఇటీవలి ఓటరు జాబితాల ప్రక్షాళన (సర్) సమస్యలు , పశ్చిమ బెంగాల్‌లో న్యాయబద్ధమైన ఓటర్ల తొలగింపునకు ప్రతిస్పందన అనేది స్పష్టం . మూడు, పార్లమెంట్‌లో సీట్లు పెంచకుండా మహిళలకు 50శాతం రిజర్వేషన్ , అన్ని మంత్రి పదవుల్లో అదనంగా 50శాతం రిజర్వేషన్ ఇవ్వాలి. ఇది ఇటీవలి డీ లిమిటేషన్ బిల్లుకు స్పందన. నాలుగు, అంబానీ , అదానీ యజమానులుగా ఉన్న మీడియా సంస్థలన్నింటి లైసెన్సుల రద్దు చేయాలి. పత్రికా స్వేచ్ఛ విషయంలో అంతర్జాతీయంగా దిగజారిన మన ర్యాంకింగ్‌కు స్పందన. ఐదు, ఒక పార్టీ నుంచి మరో పార్టీకి ఫిరాయించిన ఏ ఎమ్మెల్యే లేదా ఎంపి 20ఏళ్ల వరకు ఎన్నికల్లో పాల్గొనకుండా, ఏ ప్రభుత్వ పదవీ చేపట్టకుండా నిషేధం. ఇది రాఘవ చెద్దా బిజెపిలో చేరటం పట్ల ప్రతి స్పందన.

సిజెపి ప్రణాళికలోని ఈ పాయింట్లన్నీ నిస్సందేహంగా న్యాయమైనవి, సమకాలీన రాజకీయాల్లో అత్యంత ముఖ్యమైనవి. అయితే ఏదో కనిపించటం లేదు. అది రైతుల సమస్యలు, ఫ్యాక్టరీ కార్మికుల సమస్యలు, ఆదాయంలో అసమానత, మణిపూర్ సంక్షోభం, ప్రభుత్వ విద్యారంగాన్ని ప్రైవేటీకరిస్తున్న సమస్య, దారుణంగా ఉన్న ప్రజారోగ్య పరిస్థితులు స్థానం పొందక పోవటం. ఈ సంస్థ సోషల్ మీడియాలో హైలైట్ అయిన ఇటీవలి సమస్యల గూర్చి ఆందోళన చెందుతోందని తెలుస్తోంది. యువత ప్రాథమిక హక్కులు అయిన నాణ్యమైన ప్రభుత్వ విద్య అందుబాటు, సమాన సౌకర్యాలు, ఉద్యోగం గూర్చి అది అసలు మాట్లాడను కూడా లేదు. ఇవి అభివృద్ధి నిరోధకుల సంకేతాలు తప్ప విప్లవాదుల సంకేతం కాదు.

అది జన్‌జడ్ ఉద్యమంగా వృద్ధి చెందుతుందా? కావచ్చు , కాకపోవచ్చు. నేపాల్‌లో అధికారంలో ఉన్న ప్రభుత్వాన్ని కూలదోసిన జన్–జడ్ ఉద్యమంలాగా సిజెపి ఆ పని చేయలేదు. భారతదేశంలోని బిజెపి ప్రభుత్వం స్వభావం రీత్యా ఫాసిస్టు , ప్రజల్లో , సిద్ధాంతంలో వేళ్లూనని ఏ ఉద్యమాన్నయినా అణచివేయగల రాజ్య ఆయుధాలను అది పటిష్టం చేసుకుంది. సిజెపి ఇప్పటివరకు ప్రజలతో ,వారి ఉద్యమాలతో సంబంధంలేని సోషల్ మీడియా ఉద్యమం. దేశంలోని ప్రధాన పారిశ్రామిక కేంద్రాల్లో ఇటీవల ట్రేడ్ యూనియన్‌ల ఆందోళనతో దానికి సంబంధం ఉందా? అది భారత ప్రభుత్వానికి పెద్ద సవాలు కాదు. నేపాల్‌లో కూడా రాజకీయ ప్రభుత్వమే మారింది, విధానాలన్నీ దాదాపుగా అదే విధంగా ఉన్నాయి. ప్రగతి శీలుడని చెప్పుకుంటున్న నేపాల్ ప్రధాని సైతం విద్యార్థి రాజకీయాల్లో పాల్గొనేందుకు విద్యార్థులకు గల ప్రాథమిక హక్కును రద్దు చేశాడు. తిరుగుబాటు ఎప్పుడూ విప్లవం కాజాలదనే విషయాన్ని ఎల్లప్పుడూ గుర్తుంచుకోవాలి.

ఈ మితవాద రాజకీయాలకు ప్రత్యామ్నాయం మనకు దాదాపు నూరేళ్ల క్రితమే ఉంది. అది భగత్ సింగ్ , చంద్రశేఖర్ ఆజాద్ తదితర జాతీయ విప్లవకారులను ఉత్తేజపరచిన సోషలిజం. భారతదేశంలో ప్రస్తుత ఫాసిస్టు దిగజారుడుకు, ప్రపంచ సామ్రాజ్యవాద సంక్షోభానికి అదొక్కటే ప్రత్యామ్నాయం, పరిష్కారం. అఖిలభారత విద్యార్థి ఫెడరేషన్, యూత్ ఫెడరేషన్ వంటి సంస్థలు సోషలిజం అనే ఉమ్మడి భావజాలం కింద దశాబ్దాలుగా విద్యార్థులను సంఘటిత పరుస్తున్నాయి. సిజెపి తన ప్రణాళికలో కనీసం ప్రస్తావించని అందరికీ నాణ్యమైన విద్య, ఉపాధి సమస్యలపై అవి పనిచేస్తున్నాయి.

ప్రభుత్వ విద్యను కాపాడేందుకు, బనేగా (భగత్ సింగ్ జాతీయ ఉపాధిహామీ చట్టం) కోసం పోరాడుతున్నాయి. యువజన రాజకీయాలను సమాజంలోని ఇతర అంశాలనుంచి వేరుచేసి చూడలేము. విప్లవానికి క్షేత్ర స్థాయిలో సంస్థాగత నిర్మాణం అవసరం. సిజెపి వంటి ధోరణులతో సమస్య ఏమంటే, అవి మధ్య తరగతి ప్రజలకు ఏదో సాధించామన్న భావన కలుగజేస్తాయి; వాస్తవికమైన పోరాటాలకు వారిని దూరంగా ఉంచుతాయి. ఒక నిర్దిష్టమైన వెబ్ పేజీని అనుసరించటం లేక ఒక రీల్ షేర్ చేయటం ద్వారా రాజకీయం గా సంతృప్తి చెందినట్లు ప్రజలు భావించవచ్చు. అయితే దానికి సామాజిక ప్రాముఖ్యత ఉండదు. ●

# ఐక్యతగా ఉంటే బిజెపిని ఓడించడం సులువే



*(న్యూఢిల్లీలోని కాన్‌స్టిట్యూషన్ క్లబ్‌లో జూన్ 8న జరిగిన ఇండియా కూటమి సమావేశంలో లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీ చేసిన ప్రసంగం పూర్తి పాఠం)*

నేడు ఇక్కడికి విచ్చేసిన మీ అందరికీ స్వాగతం పలుకుతున్నాను. వచ్చినందుకు ధన్యవాదాలు. చాలా సంవత్సరాల క్రితం. నా సన్నిహిత మిత్రుడు ఒకరితో నాకు ఒక వాదన జరిగింది. 'నువ్వు చేస్తున్న పని అన్యాయం' అయినదని నేను ఆయనతో చెప్పాను. దానికి ఆయన 'ప్రపంచమే అన్యాయమైనది, దానికి అలవాటు పడాలి' అని సమాధానం ఇచ్చాడు. కాంగ్రెస్ పార్టీ గురించి ఈ రోజు ప్రస్తావించిన విషయాలకు సమాధానం చెప్పడం నా పని కాదు. శైవ సంప్రదాయంలో శివుడు గరళాన్ని మింగినట్లుగా వాటన్నింటినీ స్వీకరించడమే నా బాధ్యత. మీరు ఇంకా ఏమైనా చెప్పాలనుకున్నా, నా మీద లేదా కాంగ్రెస్ పార్టీ మీద మీకు ఎలాంటి విమర్శలు ఉన్నా మేము వాటిని సంతోషంగా, మోముపై చిరునవ్వుతో అంగీకరిస్తాము.

మిమ్మల్ని సంతోషపెట్టేందుకు మేము ప్రయత్నిస్తాము, ఎందుకంటే మీ పాత్ర కంటే మా పాత్ర మౌలికంగా భిన్నమైనది. నేను అహంకారంతో ఈ మాట అనడం లేదు. మీలో చాలామంది పేర్కొన్నట్లుగా ప్రేమ, ఆప్యాయతతో మీ అందరినీ ఏకం చేయడమే మా పాత్ర.

2004లో నా మొదటిసారి ఎన్నికల్లో పోటీ చేసినప్పటి నుండి నేను కాంగ్రెస్ పార్టీ ఎంపిగా కొనసాగుతున్నాను. భారతదేశంలోని ఇతర పార్టీలన్నింటితో పోలిస్తే మా పార్టీ నిర్మాణం ప్రాథమికంగా భిన్నమైనది. ఈ విషయాన్ని నేను వినమ్రంగా చెబుతున్నాను.

ఎందుకు అంటే, ఆధునిక భారతదేశం ఉనికిలోకి రాకముందే ఈ పార్టీ ఒక ప్రతిఘటన ఉద్యమంగా ప్రారంభమైంది. ఇతర రాజకీయ పార్టీల మాదిరిగా కాకుండా, భారత ప్రభుత్వ మౌలికవనరులు లేదా రక్షణ వ్యవస్థను ఉపయోగించుకుని దీని నిర్మాణం జరగలేదు. భారతీయులందరూ సమానం అనే భావనను కాపాడే ఒక ప్రతిఘటన ఉద్యమమే కాంగ్రెస్ పార్టీ.

**ఆర్‌ఎస్‌ఎస్ దృక్పథాన్ని మౌలికంగానే మేము వ్యతిరేకిస్తాము. బిజెపి లేదా ఆర్‌ఎస్‌ఎస్‌తో చేతులు కలపడం లేదా రాజీపడటం కంటే, కాంగ్రెస్ పార్టీలోనే ఉంటూ ప్రాణాలు వదలడానికే మేము ఇష్టపడతాము. ఆర్‌ఎస్‌ఎస్‌తో రాజీ పడడం సంభవించాలంటే మీరు మా తలలు నరకాల్సిందే. 'మా తలలు నరికేయండి, కానీ మేము ఆర్‌ఎస్‌ఎస్ ముందు తలవంచబోము' అని చెప్పే లక్షలాది మంది కాంగ్రెస్ కార్యకర్తలు ఈ దేశంలో ఉన్నారని నాకు తెలుసు.**

ఈ సమూహంలో ఒక గందరగోళం ఉందని చెప్పడానికి నేను చింతిస్తున్నాను. ఆ గందరగోళం ఏమిటంటే సమాజ్‌వాదీ పార్టీ, తృణమూల్ కాంగ్రెస్, రాష్ట్రీయ జనతాదళ్ వంటి పార్టీలు ఇప్పటివరకు ఉపయోగించిన రాజకీయ పద్ధతులే ఇంకా పనిచేస్తాయని విశ్వసిస్తున్నారు. భారత ప్రభుత్వం అందరికీ సమాన అవకాశాలు కల్పించినప్పుడు మాత్రమే అవి పనిచేశాయి. కానీ ఇప్పుడు అలాంటి సమాన అవకాశాలు ఉనికిలో లేవు. ప్రభుత్వ వ్యవస్థలను బిజెపి నియంత్రిస్తోంది. న్యాయ వ్యవస్థను బిజెపి నియంత్రిస్తోంది. అధికార యంత్రాంగాన్ని బిజెపి నియంత్రిస్తోంది. నిఘా సంస్థలను బిజెపి నియంత్రిస్తోంది. ఎన్నికల సంఘాన్ని కూడా బిజెపి నియంత్రిస్తోంది.

టిఎంసిలో నాకు చాలామంది స్నేహితులు ఉన్నారు. తాము ఎన్నికల్లో ఘనవిజయం సాధిస్తామని వారు బలంగా విశ్వసించారు. కానీ, 'మీరు స్వప్నలోకంలో ఉన్నారు' అని తరచుగా వారికి నేను చెప్పాను. ఏమి జరుగుతుందనేది నేను చూశాను. నేను గుజరాత్‌లో చూశాను. మధ్యప్రదేశ్‌లో చూశాను. ఛత్తీస్‌ఘడ్‌లో చూసాను. హర్యానా, మహారాష్ట్రలలో కూడా నేను చూశాను. అయినప్పటికీ మీలో చాలా మంది అర్థం చేసుకోలేదు. కాంగ్రెస్ పార్టీ అనేది ఒక 'ప్రతిఘటన' పార్టీ. అది పని చేసేందుకు భారత ప్రభుత్వ వ్యవస్థ తటస్థత అవసరం లేదు. వాస్తవానికి, భారత ప్రభుత్వంలో అనేక వ్యవస్థల గొంతు ఎంత నులిమితే, రాజ్యాంగాన్ని పరిరక్షించేందుకు కాంగ్రెస్ పార్టీ అంత ఉధృతంగా పోరాడుతుంది. మనమందరం కాంగ్రెస్ పార్టీ ఆదర్శాలను పంచుకుంటాము. ఆ ఆదర్శాలు ఏమిటి? సత్యం, అహింస, దయ.

ఇక్కడ ప్రధాన సమస్య ఏమిటి? **మీతో పోరాడటం అంటే నాకు ఏ మాత్రం ఆసక్తి లేదు. అకస్మాత్తుగా లేచి 'నేను మీతో పోరాడుతాను' అని అనేందుకు నేను పిచ్చివాడిని అయ్యి ఉండాలి. ఎందుకంటే మీరు మా మిత్రపక్షాలు, మా స్నేహితులు, మేము ప్రేమించే వ్యక్తులు. దయచేసి అర్థం చేసుకోండి. 2024 ఎన్నికల్లో మనం గెలిచాము. మనం 2024 ఎన్నికల్లో ఓడిపోలేదు. ఎందుకు వెళ్లిపోయారని మీరు నితీశ్ జీని అడగండి. ఆయన నా వల్లనో, కాంగ్రెస్ వల్లనో వెళ్ళిపోలేదు.**

సమీప భవిష్యత్తులో ఇప్పటివరకు పనిచేస్తున్న కొన్ని వ్యవస్థలు సైతం పనిచేయడం మానేస్తాయని మీతో నేను చెప్పగలను. ఎందుకంటే భారత ప్రభుత్వ వ్యవస్థపై బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ తమ పట్టును మరింత బిగిస్తున్నాయి. కాంగ్రెస్ పార్టీ వంద సంవత్సరాల క్రితమే సరిగ్గా ఇలాంటి నిర్ణయాన్ని ఎదుర్కొంది. 1927కి ముందు మేము ఒక రాజకీయ సంస్థగా ఉండేవాళ్ళం. గాంధీజీ 'మాకు స్వాతంత్ర్యం కావాలి' అని ప్రకటించిన రోజునే, మేము ఒక ప్రతిఘటన ఉద్యమంగా మారాము.




రాజకీయ పార్టీలు పనిచేయలేనప్పుడు, ఏది పనిచేస్తుంది? ప్రతిఘటన పనిచేస్తుంది. ప్రతిఘటన ఫలితాన్నిస్తుంది. మనం ఎక్కడ ప్రతిఘటించినా, అది అక్కడ పని చేస్తుంది. ఈ విషయాన్ని నేనే నా స్వంత కళ్ళతో చూడగలిగాను. నేను ఈ దేశమంతటా 4,000 కిలోమీటర్లు నడిచాను. ప్రతిఘటన పనిచేస్తుంది. మీకు రాజకీయ నిర్మాణం అవసరం లేదు. మీకు అధికార యంత్రాంగం అవసరం లేదు. మీకు నిఘా సంస్థలు అక్కర్లేదు. మీకు కావాల్సింది ప్రతిఘటనా చర్య. దాని అర్థమేమిటంటే 'నేను ప్రతిఘటిస్తాను. అన్యాయం జరిగేందుకు నేను అంగీకరించబోను.' అంతే, అదే ముగింపు. అది ఒక స్ఫూర్తి. అది కేవలం ఒక సంస్థ కాదు. ఇదొక ఆలోచనా విధానం. మనకు నచ్చినా నచ్చకపోయినా, మనం ఆ వైపుగానే వెళ్లాలి. మన ఆలోచనా విధానం మారాలి. ఇకపై మన ఆలోచనా విధానం ఇలా ఉండాలి. మనం పరస్పరం పోరాడుకోకూడదు. మనపై దాడిచేసే అవకాశం మనం పత్రికలకు ఇవ్వకూడదు. మనం ప్రతిఘటించాలి. వచ్చే ఎన్నికల్లో గెలవడమే అసలైన సవాలు అని మీరు అనుకుంటున్నారు. కానీ ఆ ఎన్నికలను ఇప్పటికే గెలిచాము. దయచేసి అర్థం చేసుకోండి. భారత ప్రజల్లో ఆగ్రహం ఎంత తీవ్రంగా ఉందంటే, రాబోయే ఎన్నికల ఫలితం ఇప్పటికే తేలిపోయినట్లే. సమస్య ఏమిటంటే, భారత ప్రభుత్వ వ్యవస్థలను ఆర్‌ఎస్‌ఎస్ తన ఆధీనంలోకి తీసుకోవడం. ఎన్నికలలో గెలిచేందుకు స్వేచ్ఛాయుతమైన, నిష్పక్షపాతమైన ఎన్నికలు లేకపోవడమే అసలు సమస్య.

అందుకే మనం 'ప్రతిఘటన' పద్ధతిని ఎంచుకోవాలి. సిబిఎస్ఇ ఒక ప్రతిఘటన. నీట్ ఒక ప్రతిఘటన, ప్రతిఘటన గ్రేట్ నికోబార్‌కు సైతం వెళ్తుంది. 'భారత్ జోడో యాత్ర' కూడా ప్రతిఘటనే. ఉదయాన్నే నిద్రలేచి 'నేను ఎలా ప్రతిఘటించగలను?' అని మీలో మీరు అనుకోవాలి. మీరు ప్రతిఘటించండి. అది కచ్చితంగా పనిచేస్తుంది. అది పని చేస్తుందని నేను మీకు గ్యారెంటీ ఇస్తారు. నా దృక్పథంలో ఏ వైపు నుంచైనా, ఎలాంటి విమర్శలు వచ్చినా నేను ఎంతో సంతోషంగా స్వీకరిస్తాను. ఎందుకంటే నాకు ఇది ఒక మతపరమైన విధి. ఇది ఇక ఆధ్యాత్మిక బాధ్యత. ఇది ఇకపై ఎంత మాత్రం రాజకీయాలకు సంబంధించిన విషయం కాదు. అందుకే నేను మీకు మాట ఇస్తున్నాను. ఈ సమూహాన్ని కలిసికట్టుగా ఉంచేందుకు, దీనిని విజయవంతం చేసేందుకు జరిగే కృషిలో ఎదురయ్యే ప్రతి ఒక్క అవమానాన్ని నేను భరిస్తాను.

ఇక ఎలా ముందుకు వెళ్లాలనేది అత్యంత స్పష్టంగా ఉంది. మనం ఒక నిర్దిష్టమైన ఆలోచనా ధోరణి నుండి బయటపడాలి. ఎన్నికల్లో తన గెలుపును దొంగలిస్తారని మమతా జీకి 100 శాతం కాకపోయినా, దాదాపు 90 శాతం నమ్మకం ఉంది. తన విజయాన్ని అపహరించారని ఉద్ధవ్ జీ 40 శాతం నమ్ముతున్నారు. నా సోదరుడు తేజస్వి జీకి కూడా 40 శాతం నమ్మకం ఉంది. జాగ్రత్తగా వినండి.. వంద శాతం ఎన్నికలు అపహరించబడుతున్నాయి. దయచేసి మీ మనసుల్లోని సందేహాలను తొలగించుకోండి. అలాగే, సోషల్ మీడియాలో బలమైన గుర్తింపును ఏర్పర్చుకునేందుకు ఏళ్ళకు ఏళ్ళ సమయం పడుతుందని, అది వారం రోజుల్లో సహజంగా జరిగిపోయే ప్రక్రియ కాదని దయ చేసి అర్థం చేసుకోండి. నాకు 10 మిలియన్ల యూట్యూబ్ ఫాలోయర్లు ఉన్నప్పటికీ, నా ఖాతా పూర్తిగా అణచివేయబడుతోంది. కాబట్టి, సోషల్ మీడియా నిష్పక్షపాతంగా ఉంటుందని, ప్రతిపక్షాలకు మద్దతు ఇస్తుందని మీరు భావిస్తుంటే, మీరు వాస్తవానికి దూరంగా ఉన్నట్టే. **మీడియా, సోషల్ మీడియా, న్యాయ వ్యవస్థ, అధికార యంత్రాంగం, నిఘా సంస్థలు ఇలా మొత్తం యంత్రాంగమంతా ఈ ప్రభుత్వాన్ని అధికారంలో ఉంచేందుకే పనిచేస్తోంది. కానీ, ఈ ప్రభుత్వం నిలబడదు, ఎందుకంటే ఇది మన ప్రజాస్వామ్యాన్ని విధ్వంసం చేసింది కాబట్టి. ఇది భారత ప్రజల భవిష్యత్తును నాశనం చేసింది.** ఇరాన్‌లో పరిణామాల తర్వాత ఇప్పుడు ఎదురయ్యే పరిస్థితి ఎవరి అదుపులోనూ ఉండదు. అది నియంత్రించలేనిది, అదే సమయంలో ప్రజలను సమీకరించేందుకు మనకు ఒక అవకాశాన్ని కల్పిస్తుంది. అలాగే, మన మధ్య సమన్వయం లేదని, మనం కలిసికట్టుగా పనిచేయడం లేదని అనుకునే భావన నుంచి బైటపడండి. ఇవన్నీ బిజెపి ప్రచారం చేస్తున్న భావనలు. ఇది నిజం కాదు. నాకు 100 శాతం నమ్మకం ఉంది, ముఖ్యంగా డిఎంకె విషయంలో నేను మీకు ఇప్పుడే హామీ ఇవ్వగలను. 'భారతదేశం' అనే భావనను పరిరక్షించుకునే విషయానికి వస్తే, ప్రతి ఒక్క వ్యక్తి ఈ గదిలోనే ఉంటారు. **మన మధ్య కూడా పరస్పర గొడవలు ఉన్నాయి. కానీ మీరు నన్ను కేరళ మాజీ ముఖ్యమంత్రి దగ్గరకు వెళ్ళి, కౌగిలించుకోమ ని అడిగితే, నేను అలా చేయలేను, అలా చేయబోను కూడా. ఎందుకంటే ఆయనతో నాకు రాజకీయ పోరాటం జరుగుతోంది. కాబట్టి మనం పట్టువిడుపులతో ఉండాలి. ప్రతిపక్షం బలహీనంగా ఉందని నిరూపిం చేందుకు మనపై పూర్తిస్థాయి దాడి జరుగుతోందనే విషయాన్ని మనం గుర్తించాలి.**

చివరగా, మన చర్చల్లో తరచుగా ఒక రకమైన నిస్పృహ ఉన్నట్లు నాకు అనిపిస్తోంది. 'అయ్యో దేవుడా, మనం ఎప్పటికైనా బిజెపిని ఓడించగలమా?' అని ప్రజలు అనుకుంటూ ఉంటారు. కానీ నేను మీతో చెప్పేదేమిటంటే, మనం కలిసికట్టుగా నిలబడి, ప్రతిఘటిస్తే బిజెపిని ఓడించటం చాలా సులభం. గత ఎన్నికల్లో, బిజెపిని ఓడించగలమని నేను తప్ప ఈ గదిలో ఉన్నవారెవరూ నమ్మలేదు. కానీ, మనం వారిని ఓడిస్తామని ఈ గదిలో ఉన్న ప్రతి ఒక్కరూ నమ్మడం ప్రారంభించాలి. ఆ విశ్వాసంతో మీరు ముందుకు సాగండి. రాష్ట్రం తర్వాత రాష్ట్రం, ఎన్నికల తర్వాత ఎన్నిక ల్లో, వారు అక్రమాలకు పాల్పడినా లేదా పాల్పడకపోయినా సరే, వారు కచ్చితంగా ఓడిపోతారని నేను మీకు గ్యారంటీ ఇస్తున్నాను.

**ధన్యవాదాలు.**


## చదువుల ప్రారంభం... ఫీజుల దోపిడీకి శ్రీకారం!



కసిరెడ్డి మణికంఠ రెడ్డి
ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు
7569548477

జూన్ నెల అంటే విద్యార్థులకు కొత్త విద్యా సంవత్సరం ప్రారంభమయ్యే సమ యం. కొత్త పుస్తకాలు, కొత్త తరగతులు, కొత్త ఆశయాలతో విద్యార్థులు పాఠశాలలు, కళాశాలలకు అడుగుపెడతారు. కానీ అదే సమయంలో తల్లిదండ్రులకు జూన్ నెల ప్రైవేట్ విద్యాసంస్థల దోపిడికి ఆర్థిక భారాన్ని మోసుకొచ్చే నెలగా మారుతోంది. విద్యను వ్యాపారం చేస్తున్నాయి ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలలు, కళాశాలలు. రాష్ట్రంలో ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలలు, కళాశాలలు అంతా మా ఇష్టం, ఫీజుల జీవోలు మాకు వర్తించవన్నట్టు, ప్రైవేట్ విద్యా సంస్థలు వ్యాపార కేంద్రాలు అన్నట్లుగా మార్చేస్తున్నారు. అసలు ఏ పాఠశాలకు, కళాశాలకు అనుమతి ఉందో బహిర్గతం చేయాలి అధికారులు .ఒక్కో బ్రాంచ్ కి అనుమతి దాని పేరు మీద 2, 3 బ్రాంచీలు నిర్వహణ చేస్తున్నారు. అధికారికంగా తెలంగాణలో జూన్ 15వ తేదీ నుంచి పాఠశాలల ప్రారంభం, జూన్ ఒకటవ తేదీ నుంచి ఇంటర్ కళాశాలల ప్రారంభం అయ్యాయి. కానీ ఎప్పటి నుండో నిబంధనలకు విరుద్ధంగా అడ్మిషన్ల ప్రారంభం. అనేక పాఠశాలలు, కళాశాలలు ఈ అడ్మిషన్ల పేరుతో దందా మొదలెట్టాయి. తెలంగాణ రాష్ట్రంలో కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల యాజమాన్యాలు విద్యాశాఖ నిబంధనలను గాలికి వదిలి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు, కొత్తగా అడ్మిషన్ల కోసం విద్యార్థులకు అడ్మిషన్ టెస్టులను నిర్వహిస్తూ టెస్ట్ పాస్ అయితేనే సీటు, లేకుంటే లేదు అంటున్నారు. ఏకంగా ఒకటి, రెండు, మూడు తరగతి విద్యార్థు లకు కూడా అడ్మిషన్ టెస్టులు నిర్వహించి అడ్మిషన్లు ఇస్తున్నారు. అడ్మిషన్ టెస్ట్ కోసం ఫీజు కట్టి, పరీక్ష రాసి పరీక్ష పాస్ అయితేనే సీటు ఇట్లా ఒక్కో తరగతిలో 100మంది విద్యార్థులకు పరీక్ష పెట్టి పదుల సంఖ్య విద్యార్థులకు అడ్మిషన్ ఇచ్చి విద్యా వ్యాపారం చేస్తున్న పరిస్థితి. ఆ తరగతిలో విద్యార్థులు సరిపడా ఉన్నా, అడ్మిషన్ టెస్ట్ పెట్టీ ఫీజు వసూలు చేసి మార్కులు తక్కువ వచ్చాయి, సీటు ఇవ్వలేము అని వెనక్కి పంపించే పాఠశాలల యాజమాన్యాలు అనేకం ఉన్నాయి. మళ్లీ అడ్మిషన్ ఫీజు లేదా రిజిస్ట్రేషన్ ఫీజు అంటూ ఒక్కో పాఠశాలలో రూ.10 నుంచి రూ.25 వేల వసూలు, కళాశాలల్లో రూ.5వేల నుంచి రూ.8వేలు వసూలు ఇలా ఇష్టారాజ్యంగా లేని ఫీజులను సృష్టించి వసూలు చేస్తున్నారు. గత సంవత్సరం కంటే ఈ సంవత్సరం ప్రతి పాఠశాల కళాశాలలో వారికి వారే నిర్ణయించుకొని 20 నుండి 25% ఫీజులు పెంచుకున్న పరిస్థితి. ఫీజుల నియంత్ర ణ చట్టం ప్రకారం ఏ పాఠశాలలో ఎంత ఫీజుల వసూలు చేస్తున్నారో ఆ పాఠశాల, కళాశాల ఆవరణ నోటీస్ బోర్డుపై పెట్ట డంలేదు, పేరెంట్స్ కమిటీలు వేయడం లేదు. టీచింగ్ సిబ్బం ది వివరాలు ప్రకటించడం లేదు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడం మూలంగానే ఈ అడ్మిషన్ ఫీజులు, రిజిస్ట్రేషన్ ఫీజుల వసూళ్లు చేస్తున్నారు. అనేక పాఠశాలలు పుస్తకాలు, యూనిఫామ్, అన్ని రకాల స్టేషనరీ వస్తువులను పాఠశాలల ఆవరణలోనే అమ్ముతూ పాఠశాలలను సూపర్ మార్కెట్లుగా మార్చుతున్నారు. ఇక హాస్టల్ విద్యార్థులకు అదనపు ఫీజులు వసూళ్ల పేరుతో మరో 20 నుండి 25వేలు వసూలు చేస్తున్నా రు. చివరకు కొన్ని రెసిడెన్షియల్ కళాశాలల్లో విద్యార్థులకు తల్లిదండ్రులకు ఫోన్ చేసుకోవడానికి స్మార్ట్ కార్డులు ఇచ్చి రీఛార్జ్ చేసుకోవాలని కాయిన్ బాక్స్‌ఫోన్ల దోపిడీ చేస్తున్నారు. ఇదంతా బహిరంగంగా చేస్తా ఉన్న విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవడంలో, ఇలాంటి విద్యా వ్యాపారాన్నీ అరికట్టడంలో పూర్తిగా వైఫల్యం చెందుతున్నారు. విద్యాశాఖ కూడా నిర్వహిస్తున్న ముఖ్యమంత్రి ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాల, కళాశాలల అదనపు ఫీజు వసూళ్ల దోపిడీని అరికట్టాలి. విద్యాశాఖ తీసుకువచ్చిన ప్రతి జీవో ప్రతి విద్యాసంస్థలో అమలుచేసేలా చర్యలు తీసుకోవాలి.

ప్రైవేట్ పాఠశాల, కళాశాలల్లో అడ్మిషన్ ఫీజుల వసూళ్లు, పుస్తకాలు అమ్ముడు, అధిక ఫీజుల దోపిడీపై, నిబంధనలు పాటించని పాఠశాలలు, జూనియర్ కళాశాలలపై కఠినచర్యలు తీసుకోవాలి. విద్య అందరికీ అందుబాటులో ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది




## 'హెల్త్‌కేర్'లో ఏఐ విప్లవానికి..

# హైదరాబాద్ హబ్‌గా మారుతోంది

ప్రపంచ ఆవిష్కరణలకు తెలంగాణ 'లాంచ్ ప్యాడ్': మంత్రి శ్రీధర్ బాబు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** వ్యాధులను గుర్తించే దశను దాటి, భవిష్యత్తులో వచ్చే ఆరోగ్య ముప్పులను ముందుగానే అంచనా వేసే స్థాయికి వైద్య రంగాన్ని కృత్రిమ మేధస్సు తీసుకెళ్తోందని, హెల్త్‌కేర్ ఇన్నోవేషన్స్‌కు ప్రపంచ కేంద్రంగా హైదరాబాద్‌ను తీర్చిదిద్దడమే తెలంగాణ ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ప్రకటించారు. అయితే ఏఐ ఎంత అభివృద్ధి చెందినా అది ఎప్పటికీ వైద్యుడికి ప్రత్యామ్నాయం కాదని స్పష్టం చేశారు. హైటెక్ సిటీలోని యశోద ఆసుపత్రిలో శనివారం ప్రారంభమైన రెండు రోజుల 'ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ ఏఐ ఇన్ హెల్త్ కేర్' కార్యక్రమాన్ని ప్రారంభించిన మంత్రి, ఈ సందర్భంగా మాట్లాడారు. కృత్రిమ మేధస్సు ప్రస్తుతం ప్రతి రంగాన్ని ప్రభావితం చేస్తోందని, ముఖ్యంగా వైద్య రంగంలో రోగ నిర్ధారణ నుంచి వ్యక్తిగత వైద్య సంరక్షణ వరకు విప్లవాత్మక మార్పులకు దారి తీస్తోందన్నారు. ప్రపంచవ్యాప్తంగా వృద్ధుల జనాభా పెరుగుతున్న నేపథ్యంలో క్యాన్సర్, గుండె సంబంధిత వ్యాధులు వంటి క్లిష్ట ఆరోగ్య సవాళ్లకు వినూత్న పరిష్కారాలు అవసరమని పేర్కొన్నారు. ఈ దిశగా హైదరాబాద్‌ను గ్లోబల్ హెల్త్ టెక్ ఇన్నోవేషన్స్‌కు కేంద్రంగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్తోందన్నారు. అకాడెమియా-ఇండస్ట్రీ భాగస్వామ్యాన్ని బలోపేతం చేస్తూ, పరిశోధనలు మరియు ఆవిష్కరణలు నేరుగా ప్రజలకు ప్రయోజనం చేకూర్చేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. దేశంలోనే తొలిసారిగా ఏఐ ఆధారిత డేటా ఎక్స్చేంజ్ ప్లాట్‌ఫామ్‌ను ప్రారంభించామని, లైఫ్ సైన్సెస్ రంగ అభివృద్ధి కోసం 'వన్ బయో' వ్యవస్థను అందుబాటులోకి తీసుకొచ్చామని తెలిపారు. స్టార్టప్‌లకు ఆర్థికంగా అండగా నిలిచేందుకు 'ఫండ్స్ ఆఫ్ ఫండ్స్' ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఆవిష్కరణలు కేవలం ప్రయోగశాలలకే పరిమితం కాకుండా సమాజంలో ప్రత్యక్ష మార్పును తీసుకురావాలని ఆకాంక్షించిన మంత్రి, హైదరాబాద్ వేదికగా జరుగుతున్న హెల్త్ టెక్ విప్లవంలో భాగస్వాములు కావాలని ప్రపంచవ్యాప్తంగా ఉన్న నిపుణులు, పరిశోధకులు, స్టార్టప్స్, కంపెనీలకు పిలుపునిచ్చారు. తెలంగాణ ప్రభుత్వం తరపున సంపూర్ణ సహకారం అందిస్తామని భరోసా ఇచ్చారు.




## రూ.1,600 కోట్ల విలువైన బొగ్గు మాయం?

తక్షణమే సమగ్ర విచారణ జరపాలి!
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి..
కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి లేఖ



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** దాదాపు రూ. 1,600 కోట్ల విలువైన 40 లక్షల టన్నుల బొగ్గు అదృశ్యమైందంటూ పత్రికల్లో వచ్చిన వార్తలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి అన్నారు. సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ (ఎస్‌సిసిఎల్) సంస్థలో జరిగిందని చెప్తున్న భారీ అవకతవకలపై సమగ్ర విచారణ జరిపించాలని కోరుతూ కిషన్ రెడ్డి, రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డికి శనివారం లేఖ రాశారు. ఇటీవల కొన్ని మీడియా సంస్థల్లో వచ్చిన కథనాలను ప్రస్తావిస్తూ ఆయన ఈ లేఖ ద్వారా పలు కీలక అంశాలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఈ అక్రమాల వల్ల సంస్థకు భారీగా ఆర్థిక నష్టం వాటిల్లిందని, వీటిలోని నిజానిజాలను తక్షణమే పరిశీలించి, తగిన చర్యలు తీసుకోకపోతే సింగరేణి కీలక ప్రయోజనాలకు తీవ్ర విఘాతం కలుగుతుందని హెచ్చరించారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థలో, దేశ ఇంధన భద్రతలో సింగరేణి కీలక పాత్ర పోషిస్తోందన్నారు. దాదాపు 40 వేల మంది కార్మిక కుటుంబాలు దీనిపై ఆధారపడి జీవిస్తున్నాయని కిషన్ రెడ్డి గుర్తుచేశారు. తెలంగాణ ప్రభుత్వం నుండి సింగరేణి సంస్థకు రూ. 51,500 కోట్లకు పైగా బకాయిలు రావాల్సి ఉందని, దీనివల్ల సంస్థ ఇప్పటికే తీవ్ర ఆర్థిక ఒత్తిడిని ఎదుర్కొంటున్నారు. ఇలాంటి తరుణంలో బొగ్గు అదృశ్యం వంటి వార్తలు సంస్థ ఆర్థిక స్థిరత్వాన్ని మరింత దెబ్బతీసే ప్రమాదం ఉందన్నారు. సింగరేణి సమర్థవంతమైన నిర్వహణ కోసం ఇంటిగ్రేటెడ్ కంట్రోల్ సిస్టమ్, సేఫ్ గార్డ్స్ సరిగ్గా అమలవుతున్నాయో లేదో సమీక్షించాలని కోరారు. లోపాలను ముందే గుర్తించేందుకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించాలని, నిరంతర తనిఖీల ద్వారా వ్యవస్థలోని లోటుపాట్లను ప్రారంభ దశలోనే అరికట్టవచ్చున్నారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఉండాలన్నా, సంస్థ పారదర్శకత, విశ్వసనీయత పెరగాలన్నా తక్షణమే స్పందించాల్సిన అవసరం ఉందన్నారు. సింగరేణి సజావుగా సాగడానికి, కార్మికుల సంక్షేమాన్ని కాపాడటానికి ముఖ్యమంత్రి ప్రత్యేక చొరవ తీసుకోవాలని కిషన్ రెడ్డి తన లేఖలో ఆకాంక్షించారు.

# సురభి నాటకరంగాన్ని ప్రోత్సహించాలి

సిఆర్ ఫౌండేషన్ గౌరవాధ్యక్షుడు
డాక్టర్ కె.నారాయణ




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఎంతో ఘన చరిత్ర కలిగిన సురభి నాటక రంగానికి ప్రభుత్వం ప్రత్యేక ప్రోత్సాహం అందించాలని సిఆర్ ఫౌండేషన్ గౌరవాధ్యక్షుడు డాక్టర్ కె.నారాయణ కోరారు. తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ, సిఆర్ పౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం కొండాపూర్‌లోని సిఆర్ పౌండేషన్‌లో సురభి డ్రామా థియేటర్ వారు శ్రీకృష్ణ లీలలు నాటకాన్ని ప్రదర్శించారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ, తెలుగు సంస్కృతి, సంప్రదాయాలు, కళా వైభవాన్ని తరతరాలకు అందిస్తూ సురభి నాటకరంగం విశిష్ట సేవలు అందిస్తోందన్నారు. సురభి వంటి కళాసంస్థలు కేవలం వినోదానికి మాత్రమే కాకుండా సమాజానికి విలువలు, చైతన్యం, సృజనాత్మకతను అందించే సాంస్కృతిక వేదికలుగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు.నేడు వినోదం పేరుతో హీన సంస్కృతిని ప్రోత్సహించే కార్యక్రమాలకు అధిక ప్రాధాన్యత లభిస్తోందని, అలాంటి వాటికంటే కళా విలువలను పరిరక్షించే సంప్రదాయ నాటకరంగానికి ప్రభుత్వాలు మరింత మద్దతు ఇవ్వాలని ఆయన అన్నారు. భారీ బడ్జెట్ సినిమాలకు మాత్రమే రాయితీలు, ప్రోత్సాహకాలు కల్పించడం కాకుండా ఆర్థిక ఇబ్బందులతో కొనసాగుతున్న నాటకరంగం, జానపద కళలు, రంగస్థల కళాకారులను ఆదుకునేందుకు ప్రత్యేక పథకాలు అమలు చేయాలని కోరారు. తెలుగు కళా వైభవానికి ప్రతీకగా నిలిచిన సురభి నాటకరంగాన్ని రక్షించి, ప్రోత్సహించడం ద్వారా భావితరాలకు మన సాంస్కృతిక వారసత్వాన్ని అందించవచ్చని కె. నారాయణ పేర్కొన్నారు. ప్రభుత్వం సురభి కళాకారులకు ఆర్థిక సహాయం, ప్రదర్శన వేదికలు, శాశ్వత మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ నాటక ప్రదర్శన కార్యక్రమంలో తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సలహా మండలి సభ్యులు ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లె నరసింహ, సి ఆర్ పాలిక్ క్లినిక్ డైరెక్టర్ కె. రజిని, ఏఐటియుసి సీనియర్ నాయకురాలు ప్రేమ పావని, కనపర్తి జోత్స్న, వృద్ధాశ్రమ సలహా కమిటీ సభ్యులు ఎన్ రాజేంద్ర రావు, మల్లంపాటి వెంకటేశ్వరరావు, ఐదు కళ్లు అరుణకుమారి, తమ్మారెడ్డి తానియా, వృద్ధాశ్రమ వాసులు, హోం మేనేజర్ శ్రీనివాస్, సురభి డ్రామా థియేటర్ అధ్యక్షుడు వాసుదేవరావు, ప్రజానాట్యమండలి కళాకారులు కూన సుధాకర్, డప్పు రామస్వామి పాల్గొన్నారు.

## సిజెపి బహిరంగ సభకు ఎఐవైఎఫ్ మద్దతు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** నీట్ ప్రశ్నాపత్రాల లీకేజీ వ్యవహారానికి నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 14న ఇందిరా పార్క్ ధర్నా చౌక్ వద్ద కాక్రోచ్ జనతా పార్టీ (సిజెపి) ఆధ్వర్యంలో నిర్వహించనున్న భారీ బహిరంగ సభకు అఖిల భారత యువజన సమాఖ్య (ఎఐవైఎఫ్) సంపూర్ణ మద్దతు ప్రకటించింది. విద్యార్థులు, నిరుద్యోగ యువత, ప్రజాస్వామ్యవాదులు, సామాజిక సంస్థలు, ప్రజా సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని సభను విజయవంతం చేయాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర కోరారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆయన ఆరోపించారు. లక్షలాది మంది విద్యార్థులు కష్టపడి చదివి పరీక్షలకు హాజరవుతుంటే ప్రశ్నాపత్రాల లీకేజీల కారణంగా వారి భవిష్యత్తు ప్రమాదంలో పడుతోందన్నారు. నీట్ లీకేజీ ఘటన కేంద్ర ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని విమర్శించారు. దేశంలో నిరుద్యోగం రోజురోజుకూ పెరుగుతున్నప్పటికీ ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయకుండా కేంద్ర ప్రభుత్వం కాలయాపన చేస్తోందని, దీంతో యువత తీవ్ర నిరాశలో ఉందని పేర్కొన్నారు.

# 'విబి-జి రామ్‌జి' పథకంపై కేంద్రానికి నిరసన లేఖ

60 రోజుల విరామ నిబంధన
తొలగించాలని డిమాండ్
ఉపాధి కూలీలకు నష్టం జరగనివ్వమని
మంత్రి సీతక్క హామీ

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కేంద్ర ప్రభుత్వం వచ్చేనెల 1వ తేదీ నుంచి అమలు చేయాలని ప్రతిపాదించిన విబి-జి రామ్‌జి పథకంపై రాష్ట్ర ప్రభుత్వం తన అభ్యంతరాలను అధికారికంగా కేంద్రానికి తెలియజేయనుంది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వానికి నిరసన లేఖ రాయాలని నిర్ణయించినట్లు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క వెల్లడించారు. విబిజి రాంజీ పథకాన్ని వ్యతిరేకిస్తూ శాసనసభ ఇప్పటికే తీర్మానం చేసిన నేపథ్యంలో, కొత్త విధానంలోని లోపాలు, రాష్ట్ర ప్రభుత్వ అభ్యంతరాలను లేఖ రూపంలో కేంద్రానికి తెలియజేయనున్నట్లు మంత్రి తెలిపారు. ఈ అంశంపై జ్యోతిరావు పూలే ప్రజాభవన్‌లో శనివారం ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం. దానకిషోర్, కమిషనర్ దివ్య దేవరాజన్, ప్రత్యేక కమిషనర్ శ్రీలక్ష్మి, జాయింట్ కమిషనర్ నరసింహులు పాల్గొన్నారు. ఉపాధి హామీ పథకానికి అవసరమైన నిధుల్లో కనీసం 60 శాతం కేంద్రం నుంచి అందాలంటే ఈ కొత్త విధానాన్ని అమలు చేయక తప్పదని అధికారులు మంత్రికి వివరించారు. దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాలు ఇప్పటికే ఈ కొత్త పథకం అమలుకు సంబంధించి నోటిఫికేషన్లు జారీ చేస్తున్నాయని, ఇతర రాష్ట్రాలు అనుసరిస్తున్న విధానాలపై ఈ సమావేశంలో కూలంకషంగా చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ డిమాండ్ ఆధారంగా కాకుండా నార్మేటివ్ విధానంలో పనిదినాల కేటాయింపును ప్రతిపాదించడం సరికాదన్నారు. వ్యవసాయ సీజన్‌లో 60 రోజుల పాటు ఉపాధి పనులకు విరామం ఇవ్వాలనే నిబంధనను తొలగించాలని కేంద్రాన్ని కోరనున్నట్లు చెప్పారు. తెలంగాణలో పంటల సీజన్‌లోనే విస్తారంగా వర్షాలు కురుస్తాయని, అదే సమయంలో వనమహోత్సవం, మొక్కలు నాటడం వంటి కార్యక్రమాలను ఉపాధి హామీ పథకం ద్వారా చేపడతామన్నారు.ప్రస్తుతం కొనసాగుతున్న ఉపాధి హామీ పనులు, భవనాలు, ఇతర నిర్మాణ కార్యక్రమాలు పూర్తయ్యే వరకు వాటి నిధులను పూర్తిగా కేంద్ర ప్రభుత్వమే భరించాలని మంత్రి సీతక్క డిమాండ్ చేశారు.

రాష్ట్రాలకు తగిన వెసులుబాటు కల్పించేలా కొత్త చట్టం అమలును వాయిదా వేయాలని కేంద్రాన్ని కోరనున్నట్లు తెలిపారు. కొత్త విధానం అమలుపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర మంత్రివర్గంతో చర్చించిన అనంతరం తుది నిర్ణయం తీసుకుంటామని మంత్రి సీతక్క తెలిపారు.

# రాజ్యాంగ పరిరక్షణ ప్రతీ భారతీయుడి కర్తవ్యం

ఐఏఎల్ రాష్ట్ర అధ్యక్షుడు బొమ్మగాని ప్రభాకర్




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** భారత రాజ్యాంగం మౌలిక లక్ష్యాలను కాపాడుకోవడం ప్రతి భారతీయుడి కర్తవ్యమని, తద్వారా దేశం మరింత పటిష్టంగా నిలుస్తుందని ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ (ఐఏఎల్) రాష్ట్ర అధ్యక్షుడు బొమ్మగాని ప్రభాకర్ అన్నారు. హైదరాబాద్‌లో శనివారం ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ రాష్ట్ర సమితి సమావేశం బొమ్మగాని ప్రభాకర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో న్యాయవాదుల రక్షణ చట్టాన్ని అమలు తీసుకురావడం అభినందనీయమని, న్యాయవాదుల సంక్షేమానికి మరిన్ని చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. న్యాయవాదుల సంక్షేమ నిధిని కనీసం రూ.500 కోట్లకు పెంచాలని, ఆరోగ్య భద్రత కోసం అందిస్తున్న హెల్త్ కార్డుల పరిమితిని రూ.10 లక్షలకు పెంచాలని సూచించారు. అలాగే జూనియర్ న్యాయవాదులకు నెలకు రూ.20 వేల స్టైఫండ్, సీనియర్ న్యాయవాదులకు పెన్షన్ విధానాన్ని ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా న్యాయవాదుల సంక్షేమం, భద్రత,ఆరోగ్య పరిరక్షణ కోసం ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించి మరిన్ని సంక్షేమ కార్యక్రమాలు అమలు చేయాలనిసమావేశం తీర్మానించింది. ఈ సమావేశంలో సంఘం ప్రధాన కార్యదర్శి భీమ్‌నాథ్, శ్రీనివాస్, మల్లేపల ఆదిరెడ్డి, ఎస్కే లతీఫ్,డి.జయ శ్రీనివాస్,అనంతరెడ్డి, భీమార్జున రెడ్డి, వెంకన్న, బి. భగత్ తదితరులు పాల్గొన్నారు.

## షబ్బీర్ అలీకి టిపిసిసి క్రమశిక్షణ కమిటీ నోటీసు

వైరల్ అవుతున్న ఆడియోలో చేసిన వ్యాఖ్యలపై
తక్షణమే వివరణ ఇవ్వాలని కమిటీ ఆదేశం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ కాంగ్రెస్ పార్టీలో అంతర్గత విభేదాలు మరోసారి రచ్చకెక్కాయి. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు షబ్బీర్ అలీ మాట్లాడినట్లుగా చెబుతున్న ఓ ఆడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ కావడంతో పార్టీ నాయకత్వం ఈ వ్యవహారాన్ని సీరియస్‌గా తీసుకుంది. వైరల్ అవుతున్న ఆడియోలో పార్టీ ముఖ్య నేతలపై షబ్బీర్ అలీ తీవ్ర వ్యాఖ్యలు చేసినట్లు ప్రచారం జరుగుతోంది. ముఖ్యంగా డబ్బులు ఇచ్చే వారికి, మహిళలను తార్చే వారికి పార్టీ నాయకత్వం ప్రాధాన్యత ఇస్తోందని చేసిన వ్యాఖ్యలు కాంగ్రెస్ వర్గాల్లో సంచలనంగా మారాయి. ఈ పరిణామం తెలంగాణ కాంగ్రెస్‌లో రాజకీయ వేడిని పెంచింది. పార్టీ నాయకత్వంతో పాటు మహిళలను కించపరిచేలా ఆ సంభాషణలు ఉన్నాయనే ఆరోపణల నేపథ్యంలో పార్టీ క్రమశిక్షణా సంఘం షబ్బీర్ అలీకి షోకాజ్ నోటీసులు జారీ చేసింది. సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారిన ఆ ఆడియోలో టిపిసిసి అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్‌ను ఉద్దేశించి, అలాగే మహిళా నేతలను లక్ష్యంగా చేసుకుని షబ్బీర్ అలీ వివాదాస్పద వ్యాఖ్యలు చేసినట్లు ప్రచారం జరుగుతోంది. ఈ వ్యవహారం కాంగ్రెస్ వర్గాల్లో తీవ్ర కలకలం సృష్టించింది. పార్టీ ప్రతిష్టను మసకబార్చేలా ప్రవర్తించడం, అంతర్గత విషయాలను బయటపెట్టడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసిన క్రమశిక్షణా కమిటీ ఈ ఘటనపై తక్షణమే వివరణ ఇవ్వాలని షబ్బీర్ అలీని ఆదేశించింది. అయితే ఈ వ్యవహారంలో షబ్బీర్ అలీ కూడా తన వైఖరిపై వెనక్కి తగ్గే అవకాశాలు లేవని, తన వాదనను బలంగా వినిపించేందుకు సిద్ధంగా ఉన్నట్లు ప్రచారం జరుగుతుంది. దీంతో ఈ వివాదం రానున్న రోజుల్లో కాంగ్రెస్ పార్టీలో మరిన్ని రాజకీయ పరిణామాలకు దారితీసే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రస్తుతం ఈ అంశం ఏ మలుపు తిరుగుతుందనేది రాజకీయ వర్గాల్లో ఆసక్తికరంగా మారింది. ఇదిలా ఉండగా, మహిళలను చులకన చేస్తూ పార్టీ సీనియర్ నేత షబ్బీర్ అలీ మాట్లాడటం సబబు కాదని మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. షబ్బీర్ అలీకి షోకాజ్ ఇచ్చామని ఆయన చెప్పారు. ఇన్నాళ్లుగా రాజకీయాల్లో ఉండి షబ్బీర్ అలీ ఈ విధంగా మహిళలను చులకన చేసి మాట్లాడటం విచారకరమని ఆయన వ్యాఖ్యానించారు. ఏడాది కిందట ఆయన మాట్లాడిన ఆడియో బయటకు వచ్చిందన్నారు. అలాగే తన ఆస్తులు, వ్యక్తిత్వం గురించి తాను ఏంటో నిజామాబాద్ ప్రజలకు బాగా తెలుసునని ఆయన వ్యాఖ్యానించారు. ఈ విషయంలో షబ్బీర్ అలీ చేసిన ఆరోపణలు పై తొందరపడి స్పందించాల్సిన అవసరం లేదని ఆయన పేర్కొన్నారు.

# ఇంటింటి ఎన్యుమరేషన్ ప్రక్రియపై స్పష్టత ఇవ్వాలి

రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారికి ఎంఐఎం అధినేత అసదుద్దీన్ లేఖ

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఓటు హక్కుకు సంబంధించి స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌లో (ఎస్ఐఆర్)లో భాగంగా 25 నుంచి జులై 24 వరకు నిర్వహించనున్న ఇంటింటి ఎన్యుమరేషన్ ప్రక్రియకు సంబంధించి పలు కీలక అంశాలపై స్పష్టత ఇవ్వాలని ఎంఐఎం జాతీయ అధ్యక్షుడు, ఎంపి. అసదుద్దీన్ ఒవైసీ తెలంగాణ రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారిని కోరారు. ఈ మేరకు అసదుద్దీన్ శనివారం రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి లేఖ రాశారు. ఎన్యుమరేషన్ ఫారంలో 2025 ఓటరు జాబితా వివరాలతో పాటు ప్రీ ఎస్ఐఆర్ సమయంలో మ్యాప్ చేసిన 2002 ఓటరు జాబితా వివరాలను కూడా ముద్రించాలని ఆయన సూచించారు. దీంతో ఓటర్లు, బూత్ లెవల్ అధికారులు (బిఎల్‌ఓలు)పై భారం తగ్గుతుందని పేర్కొన్నారు. అదేవిధంగా తెలంగాణలో ఉర్దూ రెండో అధికార భాష కావడంతో ఎన్యుమరేషన్ ఫారంలను తెలుగులో మాత్రమే కాకుండా ఇంగ్లీష్, ఉర్దూ భాషల్లో కూడా అందుబాటులో ఉంచాలని కోరారు. అవసరమైతే ఓటర్లు ఆన్‌లైన్‌లో డౌన్‌లోడ్ చేసుకునే అవకాశం కల్పించాలని సూచించారు. ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియలో తలెత్తే వయస్సు వ్యత్యాసాలు, పేర్లలో అక్షరదోషాలు, కుటుంబ సంబంధిత వ్యత్యాసాలు వంటి అంశాలపై స్పష్టమైన స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ (ఎస్ఒపి) విడుదల చేయాలని కోరారు. ఎన్నికల సంఘం సూచించిన పత్రాల జాబితాలో తెలంగాణలో జారీ కాని కొన్ని ధృవ పత్రాలు ఉన్నాయని, రాష్ట్రంలో అమల్లో లేని ఎన్ఆర్‌సి లాంటి పత్రాలను తొలగించి, పాన్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, ఫుడ్ సెక్యూరిటీ కార్డు వంటి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పత్రాలను కూడా అంగీకరించాలని విజ్ఞప్తి చేశారు.అలాగే 2026 తాజా ఓటరు జాబితాలో పేర్లు లేని ఓటర్ల విషయంలో స్పష్టమైన మార్గదర్శకాలు విడుదల చేయాలని కోరారు. గతంలో ఓటర్లుగా ఉన్నప్పటికీ వివిధ కారణాలతో పేర్లు తొలగించబడిన వారి దరఖాస్తులను ఫస్ట్ టైమ్ ఓటర్లు కాదనే కారణంతో తిరస్కరిస్తున్నారని, అలాంటి కేసుల పరిష్కారంపై స్పష్టత ఇవ్వాలని ఎన్నికల సంఘాన్ని విజ్ఞప్తి చేశారు.ఎన్యుమరేషన్ ప్రక్రియ పారదర్శకంగా, ఓటర్లకు సౌకర్యవంతంగా, వివక్ష రహితంగా నిర్వహించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని ఆయన లేఖలో కోరారు.

## ఖమ్మం ఘటనలో నిందితుడిని ఉరి తీయాలి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఖమ్మం ఘటనలో నిందితుడిని ఉరి తీయాలని, బాధిత కుటుంబాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని తెలంగాణ రక్షణ సేన (టిఆర్ఎస్) అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. ఈ కేసు విషయంలో రాజకీయ జోక్యం లేకుండా చర్యలు తీసుకోవాలని, నిందితునిపైన కఠినమైన చట్టాలు ప్రయోగించి, త్వరితగతిన శిక్ష పడేలా చేయాలని డిమాండ్ చేశారు. నిమ్స్‌ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఖమ్మం అత్యాచారయత్నం బాధితురాలిని కల్వకుంట్ల కవిత శనివారం పరామర్శించారు. ఈ సందర్భంగా బాధితురాలి ఆరోగ్య పరిస్థితి, చిన్నారికి అందిస్తున్న వైద్య సేవల గురించి ఆమె డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కవిత మాట్లాడుతూ బాధితురాలి తల్లితండ్రులు ఇద్దరు కూలీలేనని, ఆ బాధితురాలిని జీవితాంతం పసిబిడ్డలా చూసుకోవాల్సిన పరిస్థితి. కానీ ఆ కుటుంబానికి అంత ఆర్థిక స్థోమత లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వారికి వెంటనే ఇంటిని మంజూరు చేయాలని, ఆ కుటుంబానికి ఒకేసారి డబ్బు డిపాజిట్ చేయడమా? లేదా ప్రతి నెలా రూ.50 వేల పెన్షన్ వచ్చే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నిందితుడు బెయిల్‌పై వచ్చి మళ్లీ బాధిత కుటుంబంపై దాడి చేసే పరిస్థితి కూడా లేకపోలేదని, అందుకే బాధితురాలి కుటుంబానికి భద్రత కల్పించాలన్నారు. ఈ సంఘటనను రాష్ట్ర ప్రభుత్వం కచ్చితంగా మానవీయకోణంలో ఆలోచించాలని సూచించారు.

## ఆదాయపు పన్ను చెల్లింపుల్లో తెలుగు రాష్ట్రాలు దేశంలో 4వ స్థానం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** దేశంలో ఆదాయపు పన్ను చెల్లింపుల్లో తెలుగు రాష్ట్రాలు 4వ స్థానంలో ఉన్నామయని ఆదాయపు పన్ను కమిషనర్లు బి.బాలకృష్ణ, కె. హరిత తెలిపారు. 2024–25 ఆర్థిక సంవత్సరంలో సుమారు రూ.1,25,000 కోట్ల ఆదాయపు పన్ను వసూళ్లు నమోదయ్యాయని వెల్లడించారు.హైదరాబాద్‌లోని ఓ హోటల్‌లో తెలంగాణ ఆంధ్రప్రదేశ్ ట్యాక్స్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అసోసియేషన్ అధ్యక్షుడు సిఏ వేముల చంద్రశేఖర్ అధ్యక్షతన ఆదాయపు పన్ను సమస్యలుపై జరిగిన బహిరంగ చర్చా కార్యక్రమం జరిగింది. ఈ వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా ఆదాయపు పన్ను కమిషనర్లు బి.బాలకృష్ణ మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ఆదాయపు పన్ను చట్టం–2025 ద్వారా పన్ను విధానం సరళీకృతమైందని తెలిపారు. దీనివల్ల పన్ను చెల్లింపులు పెరిగి, దేశ ఆర్థిక అభివృద్ధికి తోడ్పాటుగా మారుతోందన్నారు. తప్పుడు ఆదాయపు పన్ను రిటర్న్‌లు దాఖలు చేయడం, పన్ను ఎగవేత వంటి చర్యలపై కఠిన చర్యలు తీసుకుంటామని, అలాంటి వారిపై జరిమానాలతో పాటు జైలు శిక్ష కూడా తప్పదని హెచ్చరించారు.కె.హరిత మాట్లాడుతూ, టిడిఎస్ విధానం ద్వారా పన్ను ఎగవేతను తగ్గించవచ్చని తెలిపారు. అదనంగా చెల్లించిన టిడిఎస్ మొత్తానికి సంబంధించి అర్హులైన వారికి ఒక రోజులోనే రిఫండ అందిస్తున్నట్లు తెలిపారు. సిఏ చంద్రశేఖర్ మాట్లాడుతూ, పన్ను చెల్లింపులపై ప్రజలకు అవగాహన కల్పించి తెలుగు రాష్ట్రాల్లో ఆదాయపు పన్ను వసూళ్లు మరింత పెరిగేలా కృషి చేస్తామని అన్నారు.ఈ కార్యక్రమంలో సుమారు 200 మంది చార్టర్డ్ అకౌంటెంట్లు, పన్ను న్యాయవాదులు పాల్గొని ఆదాయపు పన్ను సంబంధిత సందేహాలను కమిషనర్లను అడిగి నివృత్తి చేసుకున్నారు.




## కెటిఆర్ పాదయాత్రలను ప్రజలు నమ్మరు

ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** అధికారంలో ఉన్నప్పుడు ప్రజలతో సంబంధం లేకుండా పరిపాలన కొనసాగించిన బిఆర్ఎస్ ఇప్పుడు ప్రతిపక్షంలోకి వచ్చిన తర్వాత యాత్రలు చేయడం రాజకీయ నాటకమేనని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ విమర్శించారు. బిఆర్ఎస్ పార్టీ నాయకులు చేస్తున్న బస్సు యాత్రలు, పాదయాత్రలు ప్రజల కోసం కాదని, కేవలం తమ క్యాడర్‌ను కాపాడుకునేందుకేనని, బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారక రామారావు పాదయాత్ర చేసినా ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. సిఎల్‌పి కార్యాలయంలో శనివారం మీడియాతో ఆయన మాట్లాడారు. మాజీ సిఎం కె.చంద్రశేఖర్ రావు గతంలో అధికారంలో ఉన్నప్పుడు ప్రజలకు దూరంగా ఫామ్‌హౌస్‌కే పరిమితమయ్యారని శ్రీనివాస్ ఆరోపించారు.

గత ఎన్నికల్లో ప్రజల స్పష్టమైన తీర్పు ఇవ్వడం ద్వారా ప్రజలు ఇప్పటికే బిఆర్ఎస్‌కు గుణపాఠం చెప్పారని, అయినా కెటిఆర్, హరీశ్‌రావులకు మాత్రం జ్ఞానోదయం కలగలేదన్నారు. బిజెపి, బిఆర్ఎస్ మధ్య రాజకీయ అవగాహన ఉందనే అనుమానాలు ప్రజల్లో ఉన్నాయని ఆయన అన్నారు. భవిష్యత్తులో ప్రజలు మళ్లీ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నాయకత్వాన్నే బలపరుస్తారని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. రాష్ట్ర అభివృద్ధికి సంబంధించిన ఫ్యూచర్ సిటీ వంటి ప్రాజెక్టులు ముందుకు సాగుతాయని, వాటిపై ప్రతిపక్షాల విమర్శలు రాజకీయ ఉద్దేశ్యాలతోనే ఉన్నాయని అన్నారు.

# బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు కృషి




### కలెక్టర్ చాహత్ బాజ్ పాయి

**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు కృషి చేయాలని కలెక్టర్ చాహత్ బాజ్ పాయి పిలుపునిచ్చారు. ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినం నేపథ్యంలో హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన గోడ ప్రతులను జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ హనుమకొండ, కాజీపేట పరిధిలోని పారిశ్రామిక ప్రాంతాల్లో, షాపుల్లో, ప్రమాదకర ప్రాంతాల్లో కార్మిక శాఖ, జిల్లా బాలల పరిరక్షణ విభాగం, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ పోలీసు యూనిట్, చైల్డ్ హెల్ప్ లైన్, స్వచ్ఛంద సంస్థల సహకారంతో స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలన్నారు. 14 ఏళ్లలోపు బాల బాలికలు పని చేస్తున్నట్లు గుర్తిస్తే బాల కార్మిక నిర్మూలన చట్టం ప్రకారం సంబంధిత యాజమానులపై చట్ట ప్రకారం కేసు నమోదు చేయాలన్నారు. 18 ఏళ్లలోపు బాల బాలికలు పనిచేస్తున్నట్లు గుర్తిస్తే బాలల న్యాయ చట్టం ప్రకారం యాజమానులపై కేసులు నమోదు చేయాలన్నారు. కార్యాచరణ ప్రకారం స్పెషల్ డ్రైవ్ బృందాలకు జిల్లా బాలల పరిరక్షణ విభాగం వారు అత్యవసర పరిస్థితుల్లో వినియోగించే వాహనాన్ని వినియోగించుకోవాలని సూచించారు.ఈ సంవత్సరము బాల కార్మిక వ్యతిరేక దినం సందర్భంగా నిర్వహించే క్యాంపెయిన్ అంశం న్యాయమైన బాల్యం బాలలకు, గౌరవప్రదమైన ఉపాధి పెద్దలకు అనేది దృష్టిలో ఉంచుకొని ఏ రంగంలో కూడా బాల కార్మికులు ఉండకూడదని కలెక్టర్ అన్నారు.ఈ సందర్భంగా జిల్లా సంక్షేమ అధికారి విశ్వజ మాట్లాడుతూ అన్ని శాఖల సమన్వయంతో బాల కార్మిక రహిత జిల్లా ఏర్పాటుకు కృషి చేస్తున్నామని అన్నారు.ఈ కార్యక్రమంలో ఎన్సీఎల్పీ డైరెక్టర్ బుర్ర అశోక్, బాలల సంక్షేమ సమితి సభ్యులు డాక్టర్ పరికి సుధాకర్, బాలల పరిరక్షణ విభాగం ఇంచార్జి అధికారి ఎస్. ప్రవీణ్ కుమార్, ఎఫ్ఎంఎం ఎస్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఎర్ర శ్రీకాంత్, ప్రోగ్రాం మేనేజర్ కరుణ, ప్రొటెక్షన్ ఆఫీసర్ మౌనిక,చైల్డ్ హెల్ప్ లైన్ కో ఆర్డినేటర్ భాస్కర్, ఓఆర్ డబ్ల్యు విజయ్ కుమార్, సీత తదితరులు పాల్గొన్నారు. గురుకుల విద్యార్థిని అభినందించిన కలెక్టర్ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల (గౌలిదొడ్డి)లో ఇంటర్మీడియట్ విద్యలో ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణుడయ్యి ఇటీవల జాతీయ స్థాయిలో నిర్వహించిన జేఈఈ అడ్వాన్స్ లో ఐఐటీ లో సీట్ సాధించిన పెరుమాండ్ల మనస్విత్ ను కలెక్టర్ చాహత్ బాజ్ పాయి కలెక్టరేట్ లో అభినందించారు, జిల్లా బాలల పరిరక్షణ రక్షణ విభాగంలో ఔట్ రీచ్ వర్కర్ గా పని చేస్తున్న విజయ్ కుమార్ కుమారుడు మనస్విత్ సాధించిన ప్రగతిని పలువురు అభినందించారు.

## గోవర్ధనగిరి వద్ద కారు బోల్తా ఇద్దరు మృతి

**ప్రజాపక్షం/జనగామ:** జనగామ జిల్లా రఘునాథపల్లి మండలం గోవర్ధనగిరి వద్ద కారు శనివారం తెల్లవారుజామున కారు బోల్తా పడి ఇద్దరు మృతి చెందగా మరికొందరికి గాయాలయ్యాయి. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం హన్మకొండలోని నయిమ్‌నగర్‌కు చెందిన మహ్మమద్ హబీబా హఫ్సా, అసదుద్దీన్ ఖాసీం ఖాన్ తదితరులు గుల్బర్గా నుండి తమ సొంత ఊరు నయింనగర్‌కు వెళ్తున్నారు. శనివారం తెల్లవారుజామున గోవర్ధనగిరి వద్ద వారు ప్రయానిస్తూ ఎర్టిగా కారు అదుపు తప్పి రోడ్డు కిందకు దూసుకు పోయింది. ఈ ఘటనలో హబీబా హఫ్సా, అసదుద్దీన్ అక్కడికి అక్కడే మృతి చెందగా ఖాసీ ఖాన్, బియాబాని రహీముద్దీన్‌లకు తీవ్రగాయలయ్యాయి. పోలీసులు కేసు నమోదుచేసి మృతులను పోస్టుమార్టం నిమిత్తం జనగామ ఏరియా హాస్పటల్‌కు తరలించారు.

## 15 ఏళ్ల తర్వాత తెరుచుకున్న బడి తలుపులు



**ప్రజాపక్షం/తాడ్వాయి:** గ్రామీణ ప్రాంతాల్లో విద్యా వికాసానికి ప్రభుత్వం కట్టుబడి ఉందనడానికి నిదర్శనంగా ములుగు జిల్లాలో ఒక గొప్ప కార్యం సాకారమైంది. తాడ్వాయి మండలం కన్నెపల్లి గ్రామంలో గత 15 సంవత్సరాలుగా వివిధ కారణాల వలన మూతబడి ఉన్న ప్రభుత్వ పాఠశాల ఎట్టకేలకు పునః ప్రారంభమైంది. రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ధనసరి అనసూయ(సీతక్క) ప్రత్యేక చొరవతో ములుగు జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి శుక్రవారం ఈ పాఠశాలను ఘనంగా పునః ప్రారంభించారు. పాఠశాల పునః ప్రారంభోత్సవం సందర్భంగా మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి మాట్లాడుతూ సుదీర్ఘ కాలంగా మూతబడిన బడిని మంత్రి సీతక్క సహకారంతో మరల ప్రారంభించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. పాఠశాలకు అవసరమైన ఫర్నిచర్, ఇతర మౌళిక సదుపాయాలను తన సొంత ఖర్చులతో సమకూరుస్తానని విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు ఈ సందర్భంగా ఆమె హామీ ఇచ్చారు. మార్కెట్ కమిటీ చైర్మన్ హోదాలో పాఠశాల అభివృద్ధి పనులను తానే దగ్గరుండి పర్యవేక్షిస్తానని స్పష్టం చేశారు.

## రైతు రిజిస్ట్రీ కార్యక్రమాన్ని నిర్ణీత గడువులో పూర్తిచేయాలి

### జిల్లా వ్యవసాయ అధికారి(డిఎఒ)విజయచంద్ర



**ప్రజాపక్షం/హసన్‌పర్తి:** రైతు రిజిస్ట్రీ కార్యక్రమాన్ని నిర్ణీత గడువులోగా పూర్తిచేయాలని జిల్లా వ్యవసాయ అధికారి విజయ్ చంద్ర (డిఎఒ)అధికారులకు సూచించారు. హనుమ కొండ జిల్లా హసన్ పర్తి మండలంరైతు రిజిస్ట్రీ కార్యక్రమం అమలు పురోగతిని పరిశీలించేందుకు జిల్లావ్యవసాయ అధికారి శుక్రవారం వంగపహాడ్ గ్రామాన్నిఆకస్మికంగాసందర్శించారు.ఈ సందర్భంగా రైతుల నమోదు,ధృవీకరణ ప్రక్రియను పరిశీలించి,సంబంధిత రికార్డులను తనిఖీ చేసిరైతులతో ప్రత్యక్షంగా మాట్లాడి నమోదు ప్రక్రియలోఎదురవుతున్నసమస్యలను వారిని అడిగి తెలుసుకున్నారు.అర్హులైన ప్రతి రైతు వివరాలు రైతు రిజిస్ట్రీలో తప్పకుండా నమోదు చేయాలని, నమోదు వివరాల్లో ఎలాంటి పొరపాట్లు లేకుండా పారదర్శకంగా, ఖచ్చితత్వంతో ప్రక్రియను పూర్తి చేయాలని సంబంధితఅధికారులనుఆదేశించారు. రైతు రిజిస్ట్రీ ద్వారా సమగ్ర రైతు డేటా బేస్ రూపొందించబడుతుందని, భవిష్యత్తులో ప్రభుత్వ వ్యవసాయ సంక్షేమ పథకాల అమలులో ఇది కీలకపాత్ర పోషిస్తుందని జిల్లా వ్యవసాయ అధికారి విజయచంద్ర(డీఏఓ) తెలిపారు.ఈ కార్యక్రమాన్ని నిర్ణీత గడువులోగా విజయవంతంగా పూర్తిచేయడానికి క్షేత్రస్థాయి సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని అధికారులను ఆదేశించారు. ఈకార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఎ.అనురాధ, ఏఈవో బిందు ,వంగపహాడ్ సొసైటీ సీఈఓ పరమెష్, వంగపహాడ్ గ్రామ రైతులు ఉన్నారు.

## నాణ్యమైన విద్యుత్ కోసం నెలవారీ మరమ్మతులు



**ప్రజాపక్షం/జఫర్‌గడ్:** నాణ్యమైన, నిరంతరం విద్యుత్ సరఫరా కోసం ప్రతి నెలా రెండో శనివారం విద్యుత్ ఉప కేంద్రాలలో మరమ్మత్తులు చేపడుతున్నట్లు అధికారులు తెలిపారు. శనివారం ఉదయం 9 : 30 నుంచి 11 :30 వరకు ఘనపూర్ టౌన్, తాటికొండ 33/11 కేవీ ఉప కేంద్రాలలో సిబ్బంది మెయింటెనెన్స్ పనులు చేపట్టారు. ఏబీ స్విచ్‌లు, నట్ బోల్టులు బిగించడం, జంపర్ వైర్ల పరిశీలన, పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ఫ్యూజుల మార్పిడి, బ్రీదర్లలో సిలికాజెల్ భర్తీ చేశారు. ఫీడర్ ట్రిప్పులు, లైన్ నష్టాలను నివారించేందుకే ఈ మరమ్మత్తులు అని, సుమారు రెండు గంటలలో పనులు పూర్తవుతాయని అధికారులు వివరించారు.

## రైతు సంక్షేమానికి పెద్దపీట

### 1500 మంది రైతులకు ఉచిత స్ప్రే పంపులు టార్పాలిన్ కవర్లు



**ప్రజాపక్షం/గూడూరు:** మహబూబాబాద్ జిల్లా రైతుల సంక్షేమం కోసం జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్ నాయక్ నిరంతరం కృషి చేస్తున్నారని హుస్సేన్ నాయక్ యువసేన నాయకలు తెలిపారు.ఈ నెల 14వ తేదీ ఆదివారం ఉదయం 9 గంటలకు మహబూబాబాద్ పట్టణంలోని శ్రీ చైతన్య పాఠశాల ఆవరణలో యూనియన్ బ్యాంక్ సహకారంతో జిల్లాలోని సుమరు 1500 మంది నిరుపేద రైతులకు ఉచితంగా తైవాన్ స్ప్రే పంపులు టార్పలిన్ కవర్లు పంపిణి చేయనున్నట్లు వెల్లడించారు.ఇప్పటికే జిల్లాలోని పలు మండలాల్లో తొలి విడుతగా వెయ్యికి పైగా తైవాన్ స్ప్రే పంపులను రైతుకు అందజేసినట్లు పెర్కోన్నారు.అలాగే ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థుల విద్యాభివృద్ధి కోసం 500కు పైగా ల్యాప్‌టాప్‌లను పంపిణి చేసినట్లు తెలిపారు. రాబోయే రోజుల్లో నిరుపేద మహిళలకు ఉపాధి కల్పన లక్ష్యంగా కుట్టుమిషన్లు వెల్లడించారు. మహబూబాబాద్ జిల్లా ప్రజల సంక్షేమ రైతుల అభ్యున్నతి యువత మరియు మహళల ఆర్థికాభివృద్ధే హుస్సేన్ నాయక్ లక్ష్యమని యువసేన సభ్యులు పేర్కోన్నారు. ఈసందర్బంగా ఈకార్యక్రమంలో పల్లె సందీఫ్ కుమార్ వీరమల్ల ప్రేమ్ రాయుడు మలోత్ బాలునాయక్ వాంకుడోత్ నరేష్ నాయక్ గాడిపెల్లి శ్యామ్ కుమార్ చుక్క శ్యామ్ తదితరులు పాల్గోన్నారు.

## ఎంపి చామలను కలిసిన ఎస్‌సి సెల్ జిల్లా అధ్యక్షుడు మల్లేష్



**ప్రజాపక్షం/జనగామ:** కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జనగామ జిల్లా అధ్యక్షులు వేముల మల్లేషం శనివారం భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరన్‌కుమార్‌రెడ్డిని మర్యాదపూర్యంగా కలిశారు. కాంగ్రెస్ పార్టీ జనగామ జిల్లా అధ్యక్షురాలు లకావత్ ధన్వంతి, టిపిసిసి సభ్యులు డాక్టర్ లక్ష్మి నారాయణ నాయక్‌తో కలిసి చామలను కలిశారు. జనగామ జిల్లాలో ఎస్సీ సెల్ విస్తరణ సహకరించాలని ఈ సందర్భంగా కోరారు. చామలను చాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు జాయ మల్లేష్, లీగల్ సెల్ నాయకులు బాలబోయిన సంపత్ పాల్గొన్నారు.

## కోటి మంది మహిళలను కోటీశ్వరులు చేయడమే ప్రభుత్వ లక్ష్యం

### ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి



**ప్రజాపక్షం/హనుమకొండ:** నిజాయితీ, నిబద్ధత, మన పెట్టుబడి ద్వారా పరకాల ఇందిరా మహిళ పాల ఉత్పత్తిదారుల సహకార సమాఖ్య లిమిటెడ్ ఏర్పాటు చేయడం జరిగిందని పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాష్ రెడ్డి అన్నారు. శనివారం హనుమకొండ భవాని నగర్ లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ముందు పరకాల ఇందిరా మహిళా డైరీ కార్యవర్గ సమావేశాన్ని అధికారితో కలిసి పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...డైరీ ఆవశ్యకత, నిర్మాణం యజమాని బాధ్యతలు పాల ఉత్పత్తి,పాల మార్కెటింగ్ పై అవగాహన కల్పించడమే కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశం అన్నారు.ప్రాథమిక సొసైటీలోనా సభ్యత్వం నమోదు పెంపు,దామెర లో దాదాపు 10 ఎకరాల భూమి కేటాయించామని,తదితర అంశాలపై చర్చించారు.అలాగే ఈ డైరీ ఏర్పాటుకు రాష్ట్ర, యంత్రాంగ కృషి ఎంతో ఉందన్నారు.నన్ను ఎమ్మెల్యేగా గెలిపించిన ఆడబిడ్డల రుణం తీర్చుకునేందుకు పరకాల ఇందిరా మహిళా డైరీ ఏర్పాటు చేస్తున్నామన్నారు.ప్రభుత్వ సహకారంతో అధికారుల కృషితో, రాజకీయాలకు అతీతంగా పరకాల డైరీనీ అభివృద్ధి చేసుకుందాం అని,ప్రతి మహిళ పారిశ్రామికవేత్తగా తీర్చిదిద్దాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నారని తెలిపారు.మహిళల ఆర్థిక అభివృద్ధికి కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం కృషి చేస్తుందని, మహిళా సంఘాలు ఆర్థికంగా బలపడాలంటే పాడి పరిశ్రమలు అభివృద్ధి చేసుకోవాలన్నారు.ఇది కేవలం ఒక ఆర్థికపరమైన వ్యాపారం మాత్రమే కాదు, ప్రజల జీవితాల్లో వెలుగు నింపే మహా యజ్ఞం అని, ఈ యజ్ఞంలో పరకాల నియోజకవర్గం ప్రజలందరూ భాగస్వాములు కావాలని కోరారు.త్వరలో గ్రామాలలలో పాల సేకరణ చేపట్టాలని,సబ్సిడీ ద్వారా గేదెలు కొనుగోలు, దాన,గడ్డి సేకరణ చేపట్టాలని అన్నారు.5 సంవత్సరాలు నేషనల్ డైరీ డెవలప్‌మెంట్ తో ఒప్పందం జరిగిందని అన్నారు.

## కాంగ్రెస్ కార్యకర్తకు ఆర్థిక సాయం



**ప్రజాపక్షం/ఖిలా వరంగల్:** వరంగల్ తూర్పు 13వ డివిజన్ ఇనుగాల బాబు సతీమణి మరణించగా సందర్భంగా శనివారం జ్ఞాపకార్థ కూటమి కార్యక్రమం నిర్వహించగా ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి, ప్రస్తుత ఎంఎల్‌సి బస్వరాజు సారయ్య ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ వరద రాజేశ్వర్ రావు, టిపిసిసి డెలికేట్ మెంబర్ నల్గొండ రమేష్ సారథ్యంలో కాంగ్రెస్ వరంగల్ తూర్పు సీనియర్ నాయకులు అంతా కలిసి రూ.1,10,000 వేల ఆర్థిక సాయం ఇనుగాల బాబు కుటుంబానికి అందించారు. కాగా ఇనుగాల బాబు కుటుంబానికి ఏ ఆపద వచ్చినా, వారి కూతురు చదువు విషయంలో కూడా సహాయ, సహకారాలు అందిస్తామనని బస్వరాజు సారయ్య అభయమిచ్చాడు. భవిష్యత్తులో ఏ పరిస్థితిలోనైనా కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని ఎర్రబెల్లి స్వర్ణ అన్నారు. ఈ కార్యక్రమంలో వరంగల్ తూర్పు సీనియర్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారని బస్వరాజు సారయ్య తెలిపారు.

## మహిళా సంఘాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట

### ఎమ్మెల్యే కెఆర్ నాగరాజు



**ప్రజాపక్షం/హసన్‌పర్తి:** గ్రామీణ ప్రాంతాల సమగ్ర అభివృద్ధి, మహిళల ఆర్థిక సాధికారత, ప్రజలకు మెరుగైన పరిపాలనా సేవలు అందించడమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు అన్నారు. శనివారం రోజున హన్మకొండ జిల్లా హసన్ పర్తి మండల పరిధిలోని జయగిరి గ్రామంలో, సీతంపేట గ్రామంలో వివో భవన నిర్మాణ పనులకు ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు శంకుస్థాపన చేశారు. అనంతరం అనంతసాగర్ గ్రామంలో నూతనంగా నిర్మించిన వివో భవనాన్ని ప్రారంభించి, గ్రామపంచాయతీ భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, గ్రామీణ మహిళలు స్వయం సహాయక సంఘాల ద్వారా ఆర్థికంగా ఎదిగి కుటుంబాలకు, సమాజానికి అండగా నిలుస్తున్నారని కొనియాడారు. మహిళల సంఘాలకు శాశ్వత వేదికగా వివో భవనాలు ఉపయోగపడతాయని, సంఘాల సమావేశాలు, పొదుపు కార్యక్రమాలు, నైపుణ్యాభివృద్ధి శిక్షణలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు వంటి అనేక కార్యక్రమాలకు ఈ భవనాలు కేంద్ర బిందువుగా మారనున్నాయని తెలిపారు. మహిళా సంఘాలు బలోపేతం కావడం ద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థ మరింత పటిష్టం అవుతుందని, మహిళల సాధికారతే కుటుంబాలు, గ్రామాలు, రాష్ట్ర అభివృద్ధికి మూలస్తంభమని ఆయన పేర్కొన్నారు. స్వయం సహాయక సంఘాల ద్వారా వేలాది మంది మహిళలు ఉపాధి, స్వయం ఉపాధి అవకాశాలు పొందుతున్నారని, ప్రభుత్వం వారికి మరిన్ని అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తోందన్నారు. అదేవిధంగా, గ్రామపంచాయతీ భవనాల నిర్మాణం ద్వారా ప్రజలకు అవసరమైన సేవలు మరింత సులభంగా, వేగంగా అందుబాటులోకి వస్తాయని తెలిపారు. గ్రామాల అభివృద్ధి కోసం ప్రభుత్వం మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేస్తోందని, రహదారులు, తాగునీరు, విద్యుత్, విద్య, ఆరోగ్య రంగాలతో పాటు మహిళా సాధికారత, గ్రామీణ పరిపాలన బలోపేతంపై ప్రత్యేక దృష్టి సారిస్తోందని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, మహిళా సంఘాల సభ్యులు, గ్రామ పంచాయతీ ప్రతినిధులు, అధికారులు, గ్రామ పెద్దలు, యువకులు, పెద్ద సంఖ్యలో గ్రామస్థులు పాల్గొన్నారు.

## మహిళా ఉద్యోగులకు కలెక్టర్ భరోసా

### లైంగికంగా వేధించిన ఉద్యోగిపై కేసు

**ప్రజాపక్షం/జనగామ:** జనగామ జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా మహిళా ఉద్యోగులకు బరోసా కల్పిస్తున్నారు. విధులు నిర్వయించే మహిళా ఉద్యోగుల పట్ల తోటి పురుష ఉద్యోగులు అసభ్యంగా ప్రవర్తిస్తే కేసులు పెట్టిస్తున్నారు. జనగామ కలెక్టరేట్‌లో ఓ మహిళా ఉద్యోగి పట్ల అసభ్యంగా ప్రవర్తిసూ ఆ మహిళా ఉద్యోగి అనుమతి లేకుండా అమె పోటోలు వాటప్స్‌లో వైరల్ చేసిన సదరు పురుష ఉద్యోగిపై కేసు నమోదు చేయించడమే కాకుండా అరెస్ట్ చేయించారు. దీనితో కలెక్టర్ పట్ల జిల్లాలోని మహిళా ఉద్యోగులకు గౌరవం పెరగడంతో పాటు అండగా ఉంటున్న కలెక్టర్‌కు ధన్యవాదాలు తెలుపుతున్నారు. జనగామ జిల్లా కలెక్టరేట్‌లో జరిగిన సంఘటన వివరాలు పరిశీలిస్తే.. వ్యవసాయ శాఖ కార్యాయలంలో ఓ మహిళా ఎఓ ఉద్యోగి పట్ల పురుష ఉద్యోగి విజయ్‌రెడ్డి అవమానకరంగా, అసభ్యంగా ప్రవర్తించారు. ఆ మహిళా ఉద్యోగి అనుమతి లేకుండా ఫోటో మార్ఫింగ్ చేసి సోషల్ మీడియాలో పోస్టు చేశారు. ఈ విషయం తెలుసుకున్న ఆ ఉద్యోగు తోటి పురుష ఉద్యోగి విజయ్‌రెడ్డిపై మండిపడడంతో పాటు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ విషయం కలెక్టర్‌కు తెలియడంతో వెంటనే కేసు నమోదు చేయాలని పోలీస్‌లను ఆదేశించారు. సెక్షన్ 75,77,78,79,296(బి) బిఎన్ఎస్ 66 ఈ 67 ఎ ఐటిఎ 20002008 కింద కేసు నమోదు చేయించారు. అంతే కాకుండా వ్యవసాయ శాఖ కార్యాలయంలో గత కొన్నేళ్లుగా ఒకే చోట పనిచేస్తున్న వారిని బదిలీ చేశారు. మహిళా ఉద్యోగి ఫోటోలు మార్ఫింగ్ చేసి సోషల్ మీడియాలో వైరల్ చేసిన వ్యక్తిని కేసు పెట్టి అరెస్ట్ చేయాలని ఆదేశించడంతో శనివారం పోలీసులు అరెస్ట్ చేశారు. చాలా తక్కువ సమయంలో పోలీసులు స్పందించి కేసు నమోదు చేయడంతో పాటు అరెస్ట్ చేశారు. మహిళ ఉద్యోగికి జరిగిన అవమానకరమైన సంఘటనపై కలెక్టర్ స్పందన పట్ల వివిధ శాఖల్లోని మహిళా ఉద్యోగులు హర్షం వ్యక్తం చేశారు. కలెక్టర్ సైతం మహిళా ఉద్యోగులకు మనోధైర్యాన్ని కల్పిస్తున్నారు. మహిళా ఉద్యోగుల విధులతో పాటు వారి భద్రత కూగా ప్రధానమన్నారు. మహిళా ఉద్యోగులు క్రమశిక్షణతో పనిచేయాలని, ఎవరు ఎలాంటి అవమానాలకు గురి కావొద్దని, ఎవరికీ ఎలాంటి సంఘటన ఎదురైనా తన వద్దకు తీసుకురావాలని, చట్ట ప్రకారం చర్యలు ఉంటాయని చెబుతున్నారు. దీనితో మహిళా ఉద్యోగుల్లో మరింత మనోధైర్యం పెరిగినట్లుగా కనిపిస్తుంది.

## పాలకుర్తి పోలీస్ స్టేషన్‌లో డిసిపి ఆకస్మిక తనిఖీ




**ప్రజాపక్షం/పాలకుర్తి:** తెలంగాణ డీజీపీ, వరంగల్ పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు శనివారం జనగామ వెస్ట్ జోన్ డీసీపీ రాజమహేంద్ర నాయక్ పాలకుర్తి పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా సందర్శించి తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్లో నేర కేసుల ఫైళ్ల , రికార్డులు, స్టేషన్ నిర్వహణ, పెండింగ్ కేసుల పురోగతి, తదితర అంశాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ డీజీపీ ఆదేశాలను పోలీస్ సిబ్బంది సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరించడం, ఫిర్యాదులను సత్వరంగా స్వీకరించి పరిష్కరించడం, ప్రజా అనుకూల పోలీసింగ్‌కు ప్రాధాన్యత ఇవ్వడం, పోలీస్ శాఖపై ప్రజలకు మరింత విశ్వాసం కలిగే విధంగా విధులు నిర్వహించాలని సిబ్బందికి సూచించారు.ఈ కార్యక్రమంలో పాలకుర్తి సీఐ జానకిరామ్ రెడ్డి, ఎస్ఐ డి పవన్ కుమార్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## గార్లలో టియుడబ్ల్యుజె(ఐజెయు) క్లీన్ స్వీప్




### సందడిగా సాగిన సభ్యత్వ నమోదు కార్యక్రమం

**ప్రజాపక్షం/గార్ల:** గార్ల మండలానికి చెందిన జర్నలిష్టులు అందరూ ఒకే మాట మీద, టియుడబ్లూజే (ఐజెయు)లో కొనసాగెందుకు నిర్ణయించు కున్నందుకు టియుడబ్ల్యుజె (ఐజెయు) జిల్లా అధ్యక్షుడు సిహెచ్ శ్రీనివాస్ దన్యవాదాలు తెలయజేసారు. శనివారంనాడు మండల కేంద్రంలోని స్థానిక వర్తక సంఘభవణంలో టియుడబ్లూజే (ఐజెయు) మండల అధ్యక్షుడు నేలం శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సభ్యత్య నమోదు కార్యక్రమంల్లో టియుడబ్ల్యుజె (ఐజెయు) మహబుబాబాద్ జిల్లా అధ్యక్షుడు సిహెచ్ శ్రీనివాస్ ముఖ్యఅతిదిగా పాల్గోని మాట్లడుతూ, యూనియన్ పట్ల, యూనియన్ నాయకత్వం పట్ల నమ్మకాన్ని, మీ ఆదరణను, అభిమానాన్ని కలకాలం నిలుపుకునెందుకు కృషి చేస్తామని మాట ఇచ్చారు. ఇప్పటి వరకు జిల్లాలోని యూనియన్ సభ్యులందరం ఒక కుటుంబంలోని సభ్యులుగా అన్నదమ్ములుగా అందరి కష్టసుకాలలో పాలు పంచుకుంటూ ఒకరికొరు సహాయం చేసుకుంటూ ముందుకు సాగుతున్నాం, ఇకముందు కూడా ఇలాగే సాగాలని సూచించారు. జర్నలిష్టుల హక్కులకు భంగం కలిగేలా ఎవరు ప్రయత్రించినా సహించేది లేదని ఐక్యంగా పోరాడాలని పిలుపు నిచ్చారు. జర్నలిష్టులకు ఎలాంటి ఆపద వచ్చినా జిల్లా నాయకత్వం అండగా ఉండి సమస్య పరిష్కారానికి కృషి చేస్తుందని హమీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టియుడబ్లూజే (ఐజెయు) ప్రదాన కార్యదర్శి గాడిపల్లి శ్రీహరి, యూనియన్ జిల్లా నాయకులు షేక్ బుడాన్, రావూరి ప్రశాంత్, తోడేటి రాము మండల ప్రదాన కార్యదర్శి రూపన్ శంకర్, పలువురు సీనియర్ జర్నలిస్టులు, మండల బాధ్యులు, సభ్యులు పాల్గోన్నారు.

## లైసెన్స్ ఉన్న డీలర్ల వద్దే రైతులు విత్తనాలు కొనాలి

### తెలంగాణ రైతు రక్షణ సమితి ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వరికెల కిషన్ రావు



**ప్రజాపక్షం/నడికూడ:** రైతులకు నాణ్యమైన ప్రత్తి, ఇతర పంటల విత్తనాలు అందించాలని, నకిలీ విత్తనాలను విక్రయించారాదని లైసెన్స్ పొందిన డీలర్ల వద్ద విత్తనాలు కొనాలని రైతుల నమ్మకాన్ని డీలర్లు వమ్ము చేయవద్దని తెలంగాణ రైతు రక్షణ సమితి ఉమ్మడి జిల్లా అధ్యక్షులు వరికెల కిషన్ రావు తెలిపారు. వారు మాట్లాడుతూ ప్రస్తుతం వానాకాలం సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో మండలంలోని వ్యవసాయ శాఖ అనుమతి పొంది లైసెన్సు కలిగిన అధికృత డీలర్ల వద్ద నుంచి రైతులు నాణ్యమైన విత్తనాలను కొనుగోలు చేసే సమయంలో తప్పనిసరిగా బిల్లులు తీసుకోవాలని, విత్తనాల ప్యాకెట్పై ఉన్న లాట్ నంబర్, గడువు తేదీ, కంపెనీ వివరాలను పరిశీలించాలని రైతులకు సూచించారు. బిల్లు, విత్తనాల సంచులను భద్రపరచుకోవడంతో ఉపయోగపడుతుందని డీలర్లు నకిలీ విత్తనాలతో రైతులను మోసం చేయొద్దని, రైతులు విత్తనాలను లైసెన్స్ పొందిన డీలర్ల వద్ద కొనుగోలు చేసి అధిక దిగుబడులు సాధించాలని విత్తనాలు కొనే ముందు రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని ఫర్టిలైజర్‌లను ఎప్పటికప్పుడు వ్యవసాయ అధికారులు పర్యవేక్షించాలని కోరారు.

## సంత పనులకు శ్రీకారం



**ప్రజాపక్షం/మణుగూరు:**మణుగూరు మండలం సమితి సింగారం గ్రామ పంచాయతీలో డిపో రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేస్తున్నటువంటి సంత అంగడి అభివృద్ధి పనులకు సర్పంచ్ కలబోయిన మాధవరావు, ఉప సర్పంచ్ గాండ్ల సురేష్, వార్డు సభ్యులు మాదాడి రాజేష్, కోలపిన్ని మానస శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించే లక్ష్యంతో,ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని సంత ను ఏర్పాటు చేయడమైనది అన్నారు. అలాగే పంచాయతీ పరిధిలో మౌలిక సదుపాయాలు కల్పించి అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తూ పంచాయతీని అభివృద్ధి చేయడం జరుగుతుందని అన్నారు. సంతను మరింత సౌకర్యవంతంగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఈ పనులు పూర్తయితే గ్రామ ప్రజలకు నాణ్యమైన మరియు తాజా సరుకులు అందుబాటులోకి వస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు కోలపిన్ని మానస, మాదాడి రాజేష్,కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎఎం చారీ, ఎండి యాకూబ్ అలీ, బొజ్జా త్రిమూర్తులు తదితరులు పాల్గొన్నారు.

## ట్రాక్టర్ బోల్తా: డ్రైవర్ మృతి




**ప్రజాపక్షం/పాల్వంచ :** దుక్కి దున్నుతుండగా ట్రాక్టర్ బోల్తా పడి డ్రైవర్ మృతి చెందిన సంఘటన శనివారం జరిగింది. పాల్వంచ పట్టణ పరిధి శేఖరం బంజెర రామస్వామి గుంపు, పిచ్చయ్య బంజెరలో పొలంలో దుక్కి దున్నే క్రమంలో ట్రాక్టర్ ప్రమాదవశాత్తు బోల్తా కొట్టింది. దీనితో డ్రైవర్ కరక శ్రీను (30) ట్రాక్టర్ కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. పాల్వంచ పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా డ్రైవర్ శ్రీను చత్తీస్‌గడ్‌కు చెందిన వాడుగా తెలుస్తోంది.

## వనమా విశ్వేశ్వరరావుకు సన్మానం



**ప్రజాపక్షం/వైరా:**తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు సీనియర్ రాజకీయ నాయకులు వనమా విశ్వేశ్వరరావును ఆయన నివాసం నందు మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించిన తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య సంఘం మహాసభ పొలిటికల్ కార్యదర్శి వజినేపల్లి చక్రవర్తి. ఈ సందర్భంగా చక్రవర్తి తనకు పదవి వచ్చేందుకు సహకరించిన కృషి చేసిన వనమా విశ్వేశ్వరరావుకు , ఇతర ఆర్యవైశ్య పెద్దలకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రానున్న రోజుల్లో వనమా విశ్వేశ్వరరావుకు సూచనలు సలహాలతో ఆర్యవైశ్య సంఘం అభివృద్ధిలో పాల్పంచుకుంటానని ఆయన తెలిపారు.

## మృతురాలి కుటుంబానికి సాయం



**ప్రజాపక్షం/కల్లూరు:**కల్లూరులో అనారోగ్యంతో మృతి చెందిన దోసపాటి సుజాత కుటుంబానికి కల్లూరు మండల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో శనివారం 65 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఇటీవల కాలంలో దోసపాటి సర్వేశ్వరరావు భార్య సుజాత అనారోగ్య కారణాలతో మరణించారు. స్పందించి విరాళాలను సేకరించి ఆర్థిక సహాయం చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు పసుమర్తి చంద్రరావు మాట్లాడుతూ ఆర్య వైశ్య సంఘంలో పేదవంతులను ఆదుకోవడమే లక్ష్యంగా ఉన్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు అనుములు శ్రీను, ఆర్యవైశ్య సంఘ ప్రముఖులు దోసపాటి కృష్ణార్జునరావు, శ్రీనివాసరావు, నాల శ్రీనివాసరావు, నాగేశ్వరరావు, పుల్లారావు, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ బడిని సద్వినియోగం చేసుకోవాలి: నాగార్జున



**ప్రజాపక్షం/నేలకొండపల్లి:** ప్రభుత్వ పాఠశాలలను సద్వినియోగం చేసుకోవాలని సర్పంచి కట్టెకోల నాగార్జున సూచించారు. మండల పరిధిలోని బోదులబండ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అనుంతుల నరేందర్ ఆధ్వర్యంలో శనివారం బడిబాట కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పాఠశాలలో ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలు సద్వినియోగం చేసుకోవాలని తల్లిదండ్రులకు చెబుతూ విస్తృత ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో యువజన సంఘాల ప్రతినిధి గుండు మహేశ్, గ్రామ పెద్దలు ఎల్లయ్య, కె.మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

## బాసర ట్రిబుల్‌ఐటిలో భరత్ విద్యాసంస్థల విద్యార్థిని విజయం



**ప్రజాపక్షం/మధిర మున్సిపాలిటీ:** బాసర ట్రిబుల్‌ఐటిలో భరత్ విద్యాసంస్థల విద్యార్థిని కే.వీ.మనోన్వితకు రాష్ట్రంలో8వ ర్యాంకు సాధించినట్లు అధినేతలు శీలం వెంకటరెడ్డి, విద్యాలత పేర్కొన్నారు. తమ విద్యాసంస్థలో వి ద్యార్థిని మనోన్విత పదో తరగతిలో 600కు గాను 573మార్కులు సాధించడమేకాక టిజెఆర్‌జెసిలో రాష్ట్రంలో 8వ ర్యాంకు సాధించిందని, భవిష్యత్తు లో మరెన్నో విజయాలు సాధించాలని ఆకాంక్షిచారు. ఈమేరకు ప్రిన్సిపాల్ జింకల కోటేశ్వరరావు, డీన్ రవీందర్‌రెడ్డి, ప్రాథమిక పాఠశాల ప్రిన్సిపాల్ ఉమ, ఇంఛార్జి బెల్లంకొండ స్రవంతి, ప్రీ ప్రాథమిక ఇంఛార్జి కె.ప్రియాంక తదితర ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందనలు తెలియజేశారు.

### అక్రమ ఇసుక రవాణాపై

# వైరా పోలీసుల ఉక్కుపాదం

- వ్యవస్థీకృత నేరాలకు పాల్పడే ఇసుక మాఫియాపై కఠిన చర్యలు
- అక్రమార్కులపై హిస్టరీ షీట్లు తెరిచేందుకు చర్యలు చేపట్టిన వైరా పోలీసులు



**ప్రజాపక్షం/వైరా:**ఆర్థిక ప్రయోజనాల కోసం ప్రభుత్వానికి చెందిన సహజ వనరులైన ఇసుకను అక్రమంగా తరలిస్తూ ప్రభుత్వ ఆదాయానికి భఘారీ నష్టం కలిగిస్తూ వ్యవస్థీకృత కార్యకలాపాలను కొనసాగిస్తున్న ఇసుక మాఫియాపై వైరా పోలీసులు మరోసారి ఉక్కుపాదం మోపారు. ఈ సందర్భంగా ఏసిపి సారంగపాణి మాట్లాడుతూ వైరా పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం నిర్వహించిన వాహన తనిఖీల్లో, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఎన్‌టిఆర్ జిల్లా కంచికచర్ల మండల దొనబండి రీచ్ నుండి ఎటువంటి ప్రభుత్వ అనుమతులు, మైనింగ్ పర్మిట్లు, ట్రాన్స్‌పోర్ట్ చలానాలు, ఈ వే బిల్లులు లేకుండా సుమారు 25 టన్నుల ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ముఠాను పోలీసులు పట్టుకున్నారు. ఈ కేసులో ఖమ్మంకు చెందిన చల్లమల్ల వెంకటేశ్వరరావు, ఆయన కుమారుడు చల్లమల్ల సుమంత్ కుమార్, అలాగే లారీ డ్రైవర్ కొడేటి ఉపేందర్‌లను అరెస్ట్ చేశారు. ఇసుక రవాణాకు ఉపయోగించిన అశోక్ లేలాండ్ లారీ, ఎస్కార్ట్ వాహనంగా వినియోగించిన మహీంద్రా థార్ కారు, విక్రయాల కోసం ఉపయోగిస్తున్న టిప్పర్ వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. దర్యాప్తులో నిదితులు ఆంధ్రప్రదేశ్‌లో తక్కువ ధరకు ఇసుకను కొనుగోలు చేసి, ఖమ్మం, తెలంగాణలోని ఇతర ప్రాంతాల్లో అధిక ధరలకు విక్రయించి అక్రమ లాభాలు పొందుతున్నట్లు అంగీకరించారు. ఈ సందర్భంగా నిందితుల నేర చరిత్రను పరిశీలించగా, చల్లమల్ల సుమ ంత్ కుమార్‌పై మొత్తం 12 క్రిమినల్ కేసులు నమోదై ఉండగా, వాటిలో పలు కేసుల్లో శిక్షలు కూడా విధించబడ్డాయి. అదేవిధంగా చల్లమల్ల వెంకటేశ్వరరావుపై ప్రస్తుతం నమోదైన ఈ కేసుతో కలిపి మొత్తం 4 కేసులు నమోదైనట్లు దర్యాప్తులో వెల్లడైంది. గతంలో కూడా అక్రమ ఇసుక రవాణా, దొంగతనం, మోసం వంటి నేరాల్లో వీరు ప్రమేయం ఉన్నట్లు గుర్తించారు. ఇటువంటి వ్యక్తులపై హిస్టరీ షీట్లు ప్రారంభించడం, నిరంతరం నిఘా ఏర్పాటు చేయడం, అవసరమైతే రౌడీ షీట్లు తెరవడం వంటి కఠిన చర్యలు చేపట్టబడతాయి.

**వైరా పోలీసుల కఠిన హెచ్చరిక**

అక్రమ ఇసుక తవ్వకం, రవాణా, నిల్వ, కొనుగోలు, విక్రయాల్లో పాల్గొనే వ్యక్తులు, వాహన యజమానులు, డ్రైవర్లు, సహకరించే మధ్యవర్తులు ఎవరైనా సరే చట్టం ముందు తప్పించుకోలేరు. ప్రభుత్వ ఆదాయానికి నష్టం కలిగించే పర్యావరణాన్ని దెబ్బతీసే ఇటువంటి కార్యకలాపాలను పాల్పడే వారిపై కేసులు నమోదు చేయడమే కాకుండా వాహనాలను స్వాధీనం చేసుకోవడం, హిస్టరీ షీట్లు తెరవడం, పునరావృత నేరస్తులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయడం వంటి చర్యలు కచ్చితంగా అమలు చేయబడతాయి. ప్రజలు కూడా అక్రమ ఇసుక రవాణా వ్యాపారం గురించి సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేసి చట్ట పరిరక్షణలో భాగస్వాములు కావాలని వైరా పోలీసులు విజ్ఞప్తి చేశారు.అక్రమ ఇసుక మాఫియాపై వైరా పోలీసుల స్పష్టమైన హచ్చరిక చట్టాన్ని దిక్కరించే వారికి కఠిన శిక్షలు తప్పవు. అక్రమ ఇసుక రవాణా ఏ రూపంలోనైనా సహించబడదు అన్నారు. ఈ కార్యక్రమంలో సిఐ వెంకటప్రసాద్, వైరా ఎస్సై పుప్పాల రామారావు, కొణిజర్ల ఎస్సై సూరజ్, చింతకాజి ఎస్సై నరేష్, వైరా అదనపు ఎస్సై పవన్, పలువురు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## మైనర్ బాలికపై దాడి భారీ నిరసన ర్యాలీ




**ప్రజాపక్షం/అశ్వాపురం:**ఖమ్మం నగరంలో ఇటీవల 12 ఏళ్ల మైనర్ బాలికపై జరిగిన లైంగిక దాడి, హత్యాయత్నం ఘటనను ఖండిస్తూ అశ్వాపురం మండల కేంద్రంలో శనివారం సాయంత్రం భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. నిందితుడు మహమ్మద్ గౌస్‌కు కఠిన శిక్ష విధించి, ఉరిశిక్ష అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బస్టాండ్ సెంటర్ నుంచి గౌతమ్‌నగర్ కాలనీ గేటు వరకు ర్యాలీ చేపట్టారు. ఈసందర్భంగా పాల్గొన్న నాయకులు మాట్లాడుతూ చిన్నారులపై జరుగుతున్న దారుణాలు సమాజానికి మచ్చగా నిలుస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ర్యాలీలో వివిధ సంఘాల నాయకులు, సభ్యులు, యువకులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని నినాదాలు చేస్తూ నిరసన వ్యక్తం చేశారు.

## మత్స్యకారులకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ విజయవంతం

**జలాశయాల్లో శాస్త్రీయ చేపల పెంపకంతో అధిక లాభాలు సాధించాలి**




**ప్రజాపక్షం/కూసుమంచి:**మత్స్య పరిశోధన స్థానం, పాలేరు ఆధ్వర్యంలో తెలంగాణ షెడ్యూల్డ్ ట్రైబ్, షెడ్యూల్డ్ క్యాస్ట్ మత్స్యకారులకు నిర్వహించిన జలాశయాలలో చేపల పెంపకం, యాజమాన్య పద్ధతులు అంశంపై మూడు రోజులు నైపుణ్యాభివృద్ధి శిక్షణా కార్యక్రమం విజయవంతంగా ముగిసింది. ఈకార్యక్రమంలో ఖమ్మం, సూర్యాపేట జిల్లాలకు చెందిన 25 మంది మత్స్యకారులు పాల్గొన్నారు. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా మత్స్యశాఖ అధికారి డి ఆంజనేయస్వామి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న సబ్సిడీ పథకాలు, కిసాన్ క్రెడిట్ కార్డులు, బ్యాంకు రుణాలను వినియోగించుకొని మత్స్యకారులు ఆక్వాకల్చర్ రంగంలో మరింత అభివృద్ధి సాధించాలని సూచించారు. ఖమ్మం జిల్లా మత్స్య సహకార సంఘం అధ్యక్షుడు ఎం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ శిక్షణలో నేర్చుకున్న ఆధునిక పద్ధతులను ఆచరణలో పెట్టి ఆర్థికంగా ఎదగాలని మత్స్యకారులకు సూచించారు. మత్స్య పరిశోధన స్థానం పాలేరు సీనియర్ మత్స్య శాస్త్రవేత్త డాక్టర్ ఎం శ్యాంప్రసాద్ మాట్లాడుతూ శిక్షణలో నేర్చుకున్న అంశాలను క్షేత్రస్థాయిలో అమలు చేసి అధిక దిగుబడులు, లాభాలు పొందాలని కోరారు. అలాగే ఈ జ్ఞానాన్ని ఇతర మత్స్యకారులకు కూడా పంచాలని సూచించారు. మత్స్య శాస్త్రవేత్త బి రవీందర్ నీటి నాణ్యత ప్రమాణాలు, చెరువుల నిర్వహణపై అవగాహన కల్పించారు. భౌతిక, రసాయానికి ప్రమాణాలను సరైన స్థాయిలో నిర్వహించడం ద్వారా చేపల వ్యాధులను నివారించవచ్చని వివరించారు. అనంతరం ఆంధ్రప్రదేశ్ మత్స్య విశ్వ విద్యాలయం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ జి విద్యాసాగర్‌రెడ్డి జి విద్యాసాగర్ రెడ్డి చేపల మార్కెటింగ్, చేపల పట్టుబడిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. యంగ్ ప్రొఫెషనల్ బానోతు విద్య చేపలలో వచ్చే సాధారణ వ్యాధులు, నివారణ మార్గాలు, నాస్పాడ్ రిపోర్ట్ ఫిష్ డిసీజ్ యాప్ వినియోగంపై శిక్షణ ఇచ్చారు. ఈకార్యక్రమం ముగింపులో పాల్గొన్న మత్స్యకారులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. శిక్షణ ద్వారా మత్స్యకారులకు ఆధునిక చేపల పెంపకంపై అవగాహన పెరిగి, వారి ఆదాయ వృద్ధికి దోహపడుతుందని నిర్వాహకులు తెలిపారు.

## వెంకటయ్య మృతి పార్టీకి తీరని లోటు

- నమ్మకమైన సీనియర్ నాయకుడిని కోల్పోయాం..
- బాధిత కుటుంబానికి పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుంది
- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం:**సిపిఐ సీనియర్ నాయకులు పొన్నబోయిన వెంకటయ్య మృతి పార్టీకి తీరని లోటని, ఆయన మరణం అత్యంత బాధాకరమని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూఎం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివ రావు అన్నారు. కొత్తగూడెం మేదరబస్తీ ప్రాంతానికి చెందిన సీనియర్ నేత పొన్నబోయిన వెంకటయ్య (65) ఇటీవల మృతిచెందగా, శనివారం ఆయన గృహాన్ని కూనంనేని సాంబశివరావు సందర్శించారు. ఈ సందర్భంగా వెంకటయ్య చిత్రపటానికి పూలమాల వేసి ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దశాబ్ధాలుగా పొన్నబోయిన కుటుంబం పార్టీ బలోపేతానికి, సిద్ధాంతాల వ్యాప్తికి అందిస్తున్న సేవలను కొనియాడారు. వెంకటయ్య లాంటి నిబద్ధత గల నాయకుడిని కోల్పోవడం విచారకరమన్నారు. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షిస్తూ, శోకసంద్రంలో ఉన్న కుటుంబానికి పార్టీ అన్ని విధాలా ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. నివాళులర్పించిన వారిలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్ పాషా, మేయర్ మూడ్ గణేష్, కార్పొరేటర్ బండి నర్సింహా, సిపిఐ నాయకులు, వెంకటయ్య కుమారుడు పొన్నబోయిన కుమార్, స్థానిక నాయకులు

## చెరువులను సర్వే చేసి హద్దులు తేల్చండి

**సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు దండు ఆదినారాయణ డిమాండ్**



**ప్రజాపక్షం/సత్తుపల్లి:**పట్టణ, మండలంలోని వేశ్యకాంతల, తామర, బేతుపల్లి, రుద్రాక్షపల్లిలోని ఊర చెరువు భూములు ఆక్రమణకు గురయ్యాయని ఈ చెరువులన్నింటినీ సర్వే నిర్వహించి వాటి హద్దులు తేల్చాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు దండు ఆదినారాయణ డిమాండ్ చేశారు. పట్టణంలోని ఐబి ఈఈ కార్యాలయం ముందు శనివారం ధర్నా నిర్వహించి, ఈఈ కార్యాలయం ఇంచార్జ్ శ్రీనివాస్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా దండు ఆదినారాయణ మాట్లాడుతూ వేశ్యకాంతుల చెరువు, తామర చెరువు, బేతపల్లి చెరువు,ఊరచెరువు, గాడిదల వాగు, సిద్దారం, తుమ్మూరు, రేజర్ల, కిష్టారం, కాకర్లపల్లి , సత్యనారాయణపురం, గంగారం చెరువు శిఖం భూములు అన్యక్రాంతమయ్యాయని వీటిని వెంటనే సర్వే చేసి హద్దులు నిర్ణయించి మిగులు భూములు గుర్తించాలని, అంతేకాకుండా ఎన్టీఆర్ కెనాల్ కోసం ప్రభుత్వం కొనుగోలు చేసిన భూములు భరణిపాడు వరకు ఆక్రమణలకు గురయ్యాయని అట్టి భూములను తీసి పేదలకు పంపిణీ చేయాలని వినతి పత్రంలో పేర్కొన్నట్లు తెలిపారు. వీటితోపాటు బేతుపల్లి చెరువు కళంగి భూమి 7 ఎకరాల, 30కుంటలు ఉండగా దానిని కొందరు ఆక్రమించి పట్టా పాస్ బుక్కులు పొందారని వాటిని కూడా సర్వే చేయాలనీ ఆయన డిమాండ్ చేశారు. అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకుపోతే సిపిఐ ఆధ్వర్యంలో ఆక్రమించి పేదలకు పంపిణీ చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు కోలేటి వెంకటేశ్వరరావు, సిపిఐ నాయకులు తాటి రాజులు, కృష్ణ, వెంకటేశ్వరరావు, జిల్లా కౌన్సిల్ సభ్యురాలు రంజాన్ బి, రత్న రాజమ్మ , వెంకటమ్మ, భద్రమ్మ, చెన్నారావు, వెంకన్న, ప్రసాద్, పాల్గొన్నారు.

## సిపిఐ నాయకుడికి దండి పరామర్శ



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్:**ఏదులాపురంమున్సిపాలిటీపరిధిలోని 3వ వార్డుకు చెందిన సిపిఐ నాయకుడు పసుపులేటి లక్ష్మయ్యను సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ శనివారం పరామర్శించారు. ఇటీవల కాలుకి ఇన్ఫెక్షన్ అయ్యి ఆపరేషన్ జరిగి ఇంట్లో విశ్రాంతి తీసుకుంటుండగా వెళ్లి ఆరోగ్య పరస్థితి అడిగి తెలుసుకున్నారు. అలాగే నగదు సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు మిడకంటి చిన్న వెంకట్‌రెడ్డి, సిపిఐ జిల్లా సమితి సభ్యుడు వెంపటి సురేందర్, 28వ డివిజన్ సిపిఐ శాఖ కార్యదర్శి లగిశెట్టి రమేష్, నాయుడుపేట శాఖ కార్యదర్శి రావుల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## దాతల సహకారంతో మజ్జిగ పంపిణీ అభినందనీయం

**ప్రజాపక్షం/కల్లూరు:**కల్లూరు ప్రయాణికుల ప్రాంగణంలో గత ఐదు సంవత్సరాలుగా దాతల సహకారంతో ప్రయాణికులకు మధ్యకు పంపిణీ చేయడం ఆర్‌టిసి సేవలు అభినందనీయమని కల్లూరు మున్సిపాలిటీ చైర్మన్ మోహన్ నాయక్, ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షులు పసుమర్తి చంద్రావు ప్రయాణికుల ఆరోగ్య భద్రతకు పెద్దపీటవేస్తూ వేసవిలో దాతల సహకారంతో మజ్జిగ పంపిణీ ఒఆర్‌ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేయడం అభినందనీయమని వారు పేర్కొన్నారు. 65 రోజులు పాటు నిర్వహించి కార్యక్రమం ముగింపు సందర్భంగా కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమని ఈ సందర్భంగా సత్తుపల్లి డిపో మేనేజర్ లక్ష్మీ నారాయణ లు అభినందించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు ఉబ్బన రాంబాబు, దాసరి సుధారాణి, గుండ్ల పుల్లారావు ,నాయకులు వీరస్వామి, శ్రీకాంత్, నరసింహారావు, రవి, గ్రామీణ బస్సు అధికారి కిన్నెర ఆనందరావు, కంట్రోలర్ యంగల వెంకటేశ్వర్లు, ప్రయాణికులు తదితరులు పాల్గొన్నారు.

## ఏదులాపురం చెరువు తూము ధ్వంసం

**వృథాగా పోయిన నీరు... మున్సిపాలిటీ తాగునీటి భద్రతపై మళ్లీ ప్రశ్నలు**





**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్:**ఏదులాపురంమున్సిపాలిటీకి ప్రధాన జీవనాధారంగా ఉన్న ఏదులాపురం చెరువు తూము శనివారం తెల్లవారుజామున మరోసారి దుండగుల చర్యలకు గురికావడం ఆందోళనన కలిగిస్తోంది. గుర్తు తెలీని వ్యక్తులు చెరువు తూమును ధ్వసం చేసినట్లు సమాచారం. దీంతో నిండుగా నిల్వ ఉన్న నీరు పెద్ద ఎత్తున్న వృథాగా వెళ్లిపోగా మున్సిపాలిటీ ప్రజలకు అవసరాలకు కీలకమైన నీటి నిల్వకు గండి పడింది. ఈ చెరువు కేవలం సాగునీటి వనరు మాత్రమే కాకుండా స్థానిక తాగునీటి అవసరాలకు, రక్షిత మంచినీటి పథకానికి కూడా ఆధారంగా ఉండటంతో ఘటన తీవ్రత మరింత పెరిగింది. నీటి వృథాతో భవిష్యత్తులో సరఫరాపై ప్రభావం పడే అవకాశం ఉందనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. సమాచారం అందుకున్న అధికారులు ఘటనాస్థలానికి చేరుకొని నీటి ప్రవాహాన్ని నియంత్రిచే చర్యలు చేపట్టినట్లు తెలిసింది. అయితే ఇక్కడే ప్రజల ప్రశ్న మొదలవుతోంది. పదేపదే ఇదే చెరువు తూము ధ్వంసానికి గురవుతుంటే ఇప్పటి వరకు బాధ్యులను గుర్తించి కఠిన చర్యలు ఎందుకు తీసుకోలేదు? ప్రజల అవసరాలకు కీలకమైన ప్రజా వనరులపై దాడులు జరుగుతున్నా, దోషులను గుర్తించడంలో నిర్లక్ష్యం కొనసాగితే ఇలాంటి ఘటనలు పునరావృతమయ్యే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## ఎస్‌టి యువతీ, యువకులకు మాత్రమే ఉపాధి అవకాశాలు

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం:** టిటిడిఎ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వైటిసి శిక్షణా కేంద్రంలో 18 నుండి 33 సంవత్సరాల వయస్సు గల ఎస్టీ యువతీ, యువకులకు మాత్రమే ఉచిత శిక్షణ అందించి ఉపాధి అవకాశాలు కల్పించడం జరుగుతుందని ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి.రాహుల్ శనివారంనాడు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం కంప్యూటర్ కోర్సు 1 బ్యాచ్ బ్యూటీషియన్ కోర్స్2 బ్యాచ్‌లు మాత్రమే సీట్లు మిగిలి ఉన్నాయని అన్నారు. ఉచిత భోజనం, వసతి శిక్షణ అనంతరం సర్టిఫికెట్ ఉపాధి అవకాశాలు కల్పించడం జరుగుతుందని అన్నారు. ఆసక్తి గల గిరిజన నిరుద్యోగ యువతీ యువకులు ఈ నెల 20వ తేదీ లోగా తమ లగేజ్‌లతో నేరుగా వైటిసి శిక్షణా కేంద్రానికి వచ్చి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని, రిజిస్ట్రేషన్ పూర్తయిన వెంటనే తరగతులు ప్రారంభమవుతాయని ఆయన అన్నారు.

## గిరిజన మహిళలపై అక్రమ కేసులు పెట్టడం సరికాదు

**ప్రగతిశీల మహిళా సంఘ (పిఓడబ్ల్యు) రాష్ట్ర మాజీ కార్యదర్శి చంద్ర అరుణ**



**ప్రజాపక్షం/సత్తుపల్లి:**మండల పరిధిలోని కాకరపల్లి బీట్‌లో గుడిపాడు గిరిజనులు గత 25 సంవత్సరాల నుండి పోడు వ్యవసాయం చేస్తున్నారని, వారికి పూర్తిస్థాయిలో పట్టాలివ్వకుండా ఫారెస్ట్ అధికారులు నిరంతరం గిరిజన మహిళపై దౌర్జన్యాలు, దాడులు చేస్తూ అక్రమ కేసులు బనాయించటం సరైనది కాదని అక్రమ కేసులు వెంటనే ఉపసంహరించుకోవాలని ప్రగతిశీల మహిళా సంఘం పిఓడబ్ల్యు రాష్ట్ర మాజీ కార్యదర్శి చంద్రా అరుణ డిమాండ్ చేశారు. శనివారం గుడిపాడు లో జరిగిన జనరల్ బాడీ సమావేశంలో వారు మాట్లాడుతూ ఫారెస్ట్ అధికారులు మహిళలపై నిరంతర దాడులు జరుపుతున్నారని అనేక సంవత్సరాలుగా సాగు చేసుకుంటున్న పోడు భూములకు పట్టాలు ఇవ్వకుండా, 85 ఎకరాలలో 60 ఎకరాలకు పట్టాలి చ్చి మిగిలిన 25 ఎకరాలకు ఫారెస్ట్ అధికారులు, ప్రభుత్వ అధికారులు అడ్డుపడటం సరైనది కాదని 25 ఎకరాలలో పేద గిరిజనులు పొట్టకూటి కోసం పంటల వేస్తుంటే, ఫారెస్ట్ అధికారులు అత్యుత్సాహంతో నిరంతరం పంటలను ధ్వంసం చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో పిఓడబ్ల్యు రాష్ట్ర కార్యదర్శి శిరోమణి, కోశాధికారి ఝాన్సీ, రాష్ట్ర నాయకులు దుర్గ, సరోజినీ, పద్మ, కల్లూరు డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు వెంకట నరసమ్మ, పరిమళ సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ డివిజన్ కార్యదర్శి వర్గ సభ్యులు అమర్లపూడి శరత్, అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం డివిజన్ అధ్యక్షుడు ఒగ్గు నాగిరెడ్డి, దుర్గా, చెల్లమ్మ, రమణ, శ్రీనివాసరావు, రజిని, రంగమ్మ పాల్గొన్నారు.

# మాదకద్రవ్యాల నిర్మూలనే జగిత్యాల ఐఎంఎ లక్ష్యం

## 'యాంటీ డ్రగ్' 3కే రన్ కరపత్రాన్ని ఆవిష్కరించిన జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్



**ప్రజాపక్షం /జగిత్యాల రూరల్ :** ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఐఎంఎ జగిత్యాల శాఖ ఆధ్వర్యంలో జూన్ 26, 2026న నిర్వహించనున్న "యాంటీ డ్రగ్ 3కే రన్" కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాన్ని శనివారం జగిత్యాల ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ యువతను లక్ష్యంగా చేసుకుని సమాజాన్ని పట్టిపీడిస్తున్న మాదకద్రవ్యాల వ్యసనం దేశ భవిష్యత్తుకు తీవ్రమైన ముప్పుగా మారిందని ఎమ్మెల్యే ఆందోళన వ్యక్తం చేశారు. డ్రగ్స్ దుర్వినియోగంపై ప్రజల్లో ముఖ్యంగా యువతలో అవగాహన పెంపొందించేందుకు జగిత్యాల ఐఎంఏ చేపట్టిన ఈ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే అభినందించారు. సమాజంలో ఆరోగ్యకరమైన జీవన విధానాలను ప్రోత్సహించేందుకు వైద్యులు ముందుకు రావడం ప్రశంసనీయమని జగిత్యాల ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్ పేర్కొన్నారు.మాదకద్రవ్యాల నిర్మూలనకు సమాజంలోని ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలని యువత ఆరోగ్యవంతమైన భవిష్యత్తు కోసం డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని సంకల్పిద్దామని ఎమ్మెల్యే అన్నారు. ఈ యాంటీ డ్రగ్ 3కే రన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనాలని ఎమ్మెల్యే కోరారు. "రన్ స్ట్రాంగ్ – లివ్ ఫ్రీ, సే నో టు డ్రగ్స్" అనే నినాదంతో నిర్వహించనున్న ఈ 3కే రన్ వివేకానంద మినీ స్టేడియం నుండి ఐఎంఎ భవన్ వరకు జరగనుంది. విద్యార్థులు, యువత, వైద్యులు, ప్రజాప్రతినిధులు అన్ని వర్గాల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని మాదకద్రవ్యాల వ్యతిరేక సందేశాన్ని సమాజానికి చాటాలని జగిత్యాల ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్ పిలుపునిచ్చారు. డాక్టర్ ఆకుతోట శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ.. డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని వారు తెలిపారు. యువతను వ్యసనాల బారిన పడకుండా కాపాడేందుకు ప్రజల్లో చైతన్యం తీసుకురావడం కోసం ఈ అవగాహన పరుగు నిర్వహిస్తున్నామని డాక్టర్ ఆకుతోట శ్రీనివాస రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల ఐఎంఎ కార్యదర్శి డాక్టర్ ఆకుతోట శ్రీనివాస రెడ్డి, కోశాధికారి డాక్టర్ కోటగిరి సుధీర్ కుమార్, డాక్టర్ వద్లూరి శ్రవణ్ కుమార్,డాక్టర్ బండెల విజయ్ ,డాక్టర్ ఇను గురతి రాజశేఖర్,తదితరులు పాల్గొన్నారు.

## సిసి కెమెరాల ఏర్పాటుతో నేరాలు నియంత్రణ: ఎస్ఐ



**ప్రజాపక్షం / గంగాధర:** మండలంలోని వెంకంపల్లి గ్రామంలో గ్రామ పంచాయతీ పాలకవర్గం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసినసిసి కెమెరాలను గంగాధర ఎస్ఐవంశీకృష్ణ ప్రారంభించారు. గ్రామ ప్రజల భద్రత, నేరాల నివారణ లక్ష్యంగా పిట్టలపల్లి జంక్షన్ వద్ద 4, గ్రామంలో 3 మొత్తం 7 సిసి కెమెరాలను ఏర్పాటు చేశారు. ప్రజల భద్రత మరింత మెరుగవుతుందని తెలిపారు. గ్రామ భద్రత కోసం కృషి చేసిన పంచాయతీ పాలకవర్గాన్ని ఆయన ఈ సందర్భంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, పాలకవర్గ సభ్యులు, గ్రామ పెద్దలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

## అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుక సీజ్



**ప్రజాపక్షం / వీణవంక :** వీణవంక మండలం కొండపాక గ్రామంలో అక్రమంగా నిల్వ ఉంచిన సుమారు 50 ట్రిప్పుల ఇసుక డంపును ఎస్ఐ ఆవుల తిరుపతి సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీణవంక మండలంలోని కొండపాక గ్రామంలో ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక డంపును ఏర్పాటు చేసుకున్నారని తెలిపారు. వాటిని స్వాధీనం చేసుకొని తహసీల్దార్‌కు అప్పగించినామని మానేరు వాగునుంచి అక్రమంగా ఇసుక లిఫ్ట్ చేస్తున్న సల్పల అశోక్, గోదె రాజేందర్‌లకు చెందిన 2 ఎస్కవేటర్స్, నాగుల సదయ్యకు చెందిన ట్రాక్టర్ సీజ్ చేయడం జరిగిందని ఎస్ఐ పేర్కొన్నారు. సీజ్ చేసినవారిలో బ్లూకోర్ట్ ఆంజనేయులు, వినీత్ తదితరులు పాల్గొన్నారు.

## సమష్టి కృషితోనే సమ్మె సక్సెస్



**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :** మార్బుల్,టైల్స్ అండ్ గ్రానైట్ యూనియన్ చేపట్టిన బంద్ కార్యక్రమం 5వ రోజుకు చేరుకుంది.జూన్ 10న ప్రారంభమై జూన్ 20 వరకు కొనసాగనున్న ఈ బంద్‌ను యూనియన్ అధ్యక్షుడు కల్లేపల్లి రవి నేతృత్వంలో అత్యంత ప్రశాంతంగా నిర్వహిస్తున్నారు.ఈ నేపథ్యంలో శనివారం శాంతినగర్,బంధంపల్లి,గొల్లపల్లి, రాఘవాపూర్,గౌరెడ్డిపేట,ముత్తారం,హనుమంతునిపేట,చీకురాయి గ్రామాల్లో పర్యటించిన రవి,బంద్ కొనసాగుతున్న తీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు.ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బంద్‌ను విజయవంతం చేస్తున్న మేస్త్రీలందరికీ ఈ సందర్భంగా ఆయన కృతజ్ఞతలు తెలిపారు.ఇదే స్ఫూర్తితో రాబోయే మరో ఆరు రోజుల పాటు అందరూ సహకరించి బంద్‌ను విజయవంతం చేయాలని రవి పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో తిరుమల్, మధు,రవీందర్ రావు,శంకర్ ,రమేష్,మనీష్, లోకేష్,రాజేష్, ఇతర యూనియన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## సైబర్ నేరాలు, గంజాయి నిర్మూలనపై అవగాహన: సిఐ సురేష్ బాబు



**ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం :** జగిత్యాల జిల్లా ఎస్పిఅశోక్ కుమార్,మెట్‌పల్లి డిఎస్పి ఏ. రాములు ఆదేశాల మేరకు జగిత్యాల జిల్లా వర్షకొండ గ్రామంలో సైబర్ నేరాలు, గంజాయి నిర్మూలన,ట్రాఫిక్ నియమాలు,సామాజిక రుగ్మతలు,మూఢనమ్మకాలు, ఆధునిక చట్టాలపై శుక్రవారం రాత్రి అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మెట్పల్లి సిఐ బి. సురేష్ బాబు మాట్లాడుతూ ప్రజలు సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని,మాదకద్రవ్యాల నిర్మూలనకు సహకరించాలని సూచించారు.ఎస్ఐ నవీన్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జగిత్యాల జిల్లా పోలీస్ కళాబృందం పాటలు,నాటికల ద్వారా అవగాహన కల్పించింది.ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ ఫోన్ కంటి చిన్న వెంకట్, ఉప సర్పంచ్, పోలీస్ సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

## శాంతిభద్రతల పరిరక్షణ ముఖ్యం

### పెద్దపల్లి టౌన్ నూతన ఎస్ఐ గా కె .నరేష్ బాధ్యతల స్వీకరణ

**ప్రజాపక్షం/పెద్దపల్లి :** శనివారం రోజున పెద్దపల్లి టౌన్ నూతన ఎస్ఐగా కె. నరేష్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెద్దపల్లి పట్టణ శాంతి భద్రతల పరిరక్షణ ధ్యేయంగా పనిచేస్తానని, ముఖ్యంగా యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, పట్టణంలో ఎవరైనా సరే అక్రమ కార్యాకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు.

## హుజూరాబాద్ గడ్డ ..కాంగ్రెస్ అడ్డా...

### వొడితెల ప్రణవ్

**ప్రజాపక్షం / హుజురాబాద్ :** ఉప ఎన్నికల తరువాత హుజురాబాద్ అభివృద్ధికి ఆనాటి బిఆర్ఎస్ ప్రభుత్వం రూపాయి కూడా కేటాయించలేదని, ఇక్కడ నున్న కౌశిక్ రెడ్డి పిచ్చి లేసినట్లు ప్రవర్తిస్తున్నాడే తప్ప అభివృద్ధి గురించి ఏనాడు మాట్లాడలేదని హుజురాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ వొడితెల ప్రణవ్ అన్నారు. శనివారం రోజున హుజురాబాద్ పట్టణంలో ప్రతాప సాయి గార్డెన్‌లో సర్‌పై బిఎల్‌ఏలకు అవగాహన సదస్సు కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జీ ప్రణవ్ అధ్యక్షతన ముఖ్య సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానిక కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే శ్రీశైలం, సుడా చైర్మన్ కోమటి రెడ్డి నరేందర్ రెడ్డి హజరయ్యారు. అనంతరం వారు మాట్లాడుతూ సర్ పై జాగ్రత్తగా ఉండాలని, కార్యకర్తలకు సూచించారు. హుజురాబాద్ ఇకపై కాంగ్రెస్ అడ్డా అని దానికి ఉదాహరణ హుజురాబాద్ మున్సిపాలీటిపై కాంగ్రెస్ జెండా ఎగిరిందని, సర్పంచుల స్థానంలో మొదటి స్థానం, ఎంపిలో, ఎమ్మెల్సీలో ముందు స్థానంలో ఉన్నామని ఇకపై హుజురాబాద్‌లో ఏ ఎన్నిక వచ్చినా కాంగ్రెస్ జెండా ఎగురవేస్తామని అన్నారు. బిఆర్ఎస్ నాయకులు మొసలి కన్నీరు కారుస్తున్నారని అన్నారు. కౌశిక్ రెడ్డిని ప్రజలు తిరస్కరిస్తున్నారని, కాంగ్రెస్ పార్టీని ఆదరిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ రొంటాల సుహాసిని, వైస్ చైర్‌పర్సన్ అంజలి, కౌన్సిలర్లు, వ్యవసాయ మార్కెట్ చైర్మన్‌లు, డైరెక్టర్లు, వివిధ గ్రామాల సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


## కొత్త ర్యాగ్ పిక్కర్లను తీసుకోవద్దు

### ఒంటెత్తు పోకడలు అధికారులు,ప్రజా ప్రతినిధులు మానుకోవాలి*ఎఐటియుసి నేత ఎంఎ గౌస్



**ప్రజాపక్షం/పెద్దపల్లి :** రామగుండం మున్సిపల్ కార్పొరేషన్‌లో కొత్త ర్యాగ్ పిక్కర్ లను తీసుకోవద్దని, పాత కార్మికులను కొనసాగించాలని కోరుతూ తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ వర్కర్స్ అండ్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ ఎఐటియుసి రామగుండం కార్పొరేషన్ ప్రధాన కార్యదర్శి ఎం.ఎ. గౌస్ ఆధ్వర్యంలో శనివారం మేయర్ మహంకాళి స్వామికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 26 సంవత్సరాలుగా ఇంటింటి చెత్త సేకరణ చేస్తున్న కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని, మున్సిపల్ అధికారుల ఆదేశాల మేరకు పనిచేస్తున్న 140 మంది ఇంటింటి చెత్త సేకరణ కార్మికులకు మున్సిపల్ కార్పొరేషన్ ఇస్తున్న మ్యాచింగ్ గ్రాంట్ నెలకు రూ.4,000 మాత్రమేనని, ఇంటి యజమానులు ఇచ్చే రూ.40 కూడా అందరూ ఇవ్వడం లేదని గౌస్ తెలిపారు. ఈ మొత్తం కుటుంబ పోషణకు సరిపోవడం లేదన్నారు.ఇంటింటి చెత్త సేకరణతో పాటు, వార్డుల్లో ఊడ్చడం, రోడ్లపై చెత్త ఎత్తడం, ట్రాక్టర్‌లో లోడింగ్, డంప్‌యార్డుకు తరలించడం వంటి పలు పనులు చేస్తున్న వీరిని ఔట్‌సోర్సింగ్ పారిశుద్ధ్య కార్మికులుగా గుర్తించాలని కోరారు. గతంలో 70 మందిని పారిశుద్ధ్య కార్మికులుగా తీసుకున్నా, ప్రస్తుతం 50 డివిజన్ల నుంచి 60 డివిజన్లుగా పెరగడంతో పనిభారం పెరిగిందన్నారు. కార్మికుల కొరతతో ఉదయం 5 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పనిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.చెత్తతో ప్రత్యక్ష సంపర్కం వల్ల అనారోగ్యాలకు గురవుతున్న వారికి సబ్బులు, బెల్లం, కొబ్బరి నూనె, మాస్కులు, ఎండకు రుమాళ్లు వంటి కనీస రక్షణ సదుపాయాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు.అదేవిధంగాఇప్పటికే పనిచేస్తున్న కార్మికులకు పోటీగా కొత్త రాగ్‌పిక్కర్లను నియమించే విధానాన్ని రద్దు చేయాలనీ, ట్రాలీ డ్రైవర్లను తొలగించవద్దనీ, చట్టపరంగా కనీస వసతులు కల్పించాలనీ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో ఇంటింటి చెత్త సేకరణ కార్మికులు పాల్గొన్నారు.

## ఉప ముఖ్యమంత్రి భట్టికి ఘనస్వాగతం



**ప్రజాపక్షం/ధర్మపురి :** పొరుగున ఉన్న మంచిర్యాల జిల్లా దండెపెల్లి మండలం గూడెం శ్రీ సత్యనారాయణ స్వామి ఆలయ పునర్నిర్మాణంతోపాటు పలు అభివృద్ధి పనుల శంకుస్థాపన కార్యక్రమాలకై ధర్మపురి నియోజకవర్గం మీదుగా వెళ్తున్న తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు శనివారం రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ రాయపట్నం వద్ద ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం తోపాటు మంత్రులు శ్రీధర్ బాబు,పొన్నం ప్రభాకర్ లను అడ్లూరి శాలువాలతో సత్కరించారు పెద్దపల్లి ఎంపి గడ్డం వంశీకృష్ణ,జగిత్యాల జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సంగనబట్ల దినేష్,రాయపట్నం గ్రామ సర్పంచ్ రాందేని మొగిలి తదితరులు స్వాగతం పలికిన వారిలో ఉన్నారు.

## అన్ని హంగులతో ప్రారంభానికి కలెక్టరేట్ సిద్ధం

### యుద్ధ ప్రాతిపదికన పనులన్నీ పూర్తి కావాలి: కలెక్టర్ చిత్రా మిశ్రా



**ప్రజాపక్షం/కరీంనగర్:** కరీంనగర్ నూతన కలెక్టరేట్ భవనాన్ని అన్ని హంగులతో ప్రారంభానికి సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో శనివారం పోలీస్ కమిషనర్ గౌష్ ఆలంతో కలిసి నూతన కలెక్టరేట్ భవన నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టరేట్ ప్రధాన గేటు, కాంపౌండ్ వాల్ నిర్మాణ పనుల పురోగతిని పరిశీలించిన కలెక్టర్, రోడ్లు,భవనాల శాఖ అధికారులకు, కాంట్రాక్టర్‌కు పలు సూచనలు చేశారు. మిగిలిన పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి, ప్రారంభోత్సవానికి ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూడాలని ఆదేశించారు. ముఖ్యమంత్రి పర్యటనకు ముందే అన్ని అభివృద్ధి, మౌలిక సదుపాయాల పనులు పూర్తవ్వాలని స్పష్టం చేశారు. అనంతరం ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో ఏర్పాటు చేస్తున్న హెలిప్యాడ్ ప్రాంతాన్ని పరిశీలించి, భద్రతా ఏర్పాట్లపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. కలెక్టరేట్లోని హెలిప్యాడ్ నుంచి అంబేద్కర్ స్టేడియం వరకు ఉండే రోడ్డు మార్గాన్ని పరిశీలించి, రాకపోకలు సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) డి. శ్రీనివాస్ రెడ్డి, ఆర్ అండ్ బి శాఖ ఇఇ నరసింహాచారి, కరీంనగర్ టౌన్ ఎసిపి వెంకటస్వామి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## మృతదేహాలను స్వస్థలాలకు త్వరగా పంపించాలి

### చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం



**ప్రజాపక్షం/కరీంనగర్:** దుబాయ్‌లో ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన జగిత్యాల జిల్లాకు చెందిన ముగ్గురు వలస జీవుల మృతదేహాలను త్వరితగతిన స్వస్థలాలకు పంపించాలని చొప్పదండి ఎమ్మెల్యే డా. మేడిపల్లి సత్యం దుబాయ్‌లోని ప్రముఖ బుర్జీల్ ఆసుపత్రి ప్రతినిధులను కోరారు. దుబాయ్ పర్యటనలో భాగంగా శుక్రవారం ఆసుపత్రిని సందర్శించిన ఎమ్మెల్యే, మృతదేహాలను పరిశీలించారు. ఈ సందర్భంగా బుర్జీల్ హోల్డింగ్స్ చైర్మన్ డా. షంషీర్ వయలిల్ మానవతా దృక్పథంతో ప్రమాదంలో మృతి చెందిన ఐదుగురి కుటుంబాలకు, గాయపడిన 9 మంది క్షతగాత్రులకు భారీ ఆర్థిక సాయం ప్రకటించడం పట్ల ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.డా. షంషీర్ అందుబాటులో లేకపోవడంతో ఆయన కంపెనీ ప్రతినిధులైన విజయ్‌కుమార్, అహ్మద్ బిన్ సులేమాన్, ఉస్నిక్కట్టిడ్, డా. పంకజ్ కుమార్ భట్‌లను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. బుర్జీల్ ప్రతినిధులను హైదరాబాద్‌కు ఆహ్వానించిన ఎమ్మెల్యే, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా బాధిత కుటుంబాలకు సాయం చెక్కులు అందజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎన్నారై అడ్వైజరీ కమిటీ సభ్యుడు సత్యంగౌడ్, తెలంగాణ సామాజిక కార్యకర్తలు శ్రీనివాస్ రావు, షామ్యూల్, సలావుద్దీన్, ఎస్‌వి రెడ్డి, మహిపాల్ యాదవ్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## బావూపేట రోడ్డుపై నీళ్లు నిలుస్తున్నా పట్టించుకోకపోతే ఎలా?




**ప్రజాపక్షం/కరీంనగర్:** కరీంనగర్ మండలంలోని బావుపేట వద్ద రోడ్డుపై చిన్నపాటి వర్షం వస్తే నీళ్లు నిలిచి రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతున్నా అధికారులు పట్టించుకోకపోవడంపట్ల కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సం జయ్ కుమార్ అసంతృప్తి వ్యక్తం చేశారు. కరీంనగర్ నుండి సిరిసిల్లకు శనివారం వెళుతుండగా బావుపేట వ ద్ద రోడ్డుపై నీళ్లు నిలిచి సిరిసిల్ల నుండి కరీంనగర్ వరకు రాకపోకలకు, వాహనదారులకు తీవ్రమైన ఇబ్బంది ఏర్పడుతున్న విషయాన్ని కేంద్ర మంత్రి బండి సంజయ్ గమనించారు. స్వయంగా వాహనం దిగి నీళ్లు నిలిచిన చోటకు వచ్చి ఆగారు. వర్షాకాలం మొదలు కావడంతో నిరంతరం ఈ సమస్య ఏర్పడుతుందని, స్కూళ్లు స్టార్ట్ అయితే ఆటోలు, బైక్‌లకు తీవ్రమైన ఇబ్బంది ఏర్పడుతుందని స్థానికులు చెప్పడంతో .. వెంటనే బండి సంజయ్ జిల్లా కలెక్టర్ కు ఫోన్ చేశారు. తక్షణమే ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని, తాత్కాలికంగా నీళ్లు నిలవకుండా యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని కోరారు. వెంటనే అధికారులను పంపించి తగిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు.

## ధర్మపురి ఠాణాలో ఎస్‌పి తనిఖీ




**ప్రజాపక్షం/ధర్మపురి :** జగిత్యాల జిల్లాలో పోలీసింగ్ వ్యవస్థను మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దే దిశగా జిల్లా ఎస్పి అశోక్ కుమార్ ధర్మపురి పోలీస్ స్టేషన్‌తో పాటు ధర్మపురి సర్కిల్ కార్యాలయాన్ని శనివారం తనిఖీ చేశారు.ఈ సందర్భంగా స్టేషన్‌లోని రికార్డుల నిర్వహణ, పెండింగ్ కేసుల పురోగతి, సిబ్బంది పనితీరు తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. కేసుల దర్యాప్తులో నాణ్యతతో పాటు వేగం కూడా ఉండేలా చర్యలు తీసుకోవాలని,సర్కిల్ పరిదిలో నమోదవుతున్న గ్రేవ్ కేసులు, అండర్ ఇన్వెస్టిగేషన్ ఉన్న కేసులలో ఉన్న సిడి ఫైల్స్‌ను,పెండింగ్ ట్రాయల్లో ఉన్న సిడి ఫైళ్లను పరిశీలించారు. తరచుగా సర్కిల్ పరిధిలోని పోలీస్ స్టేషన్ లను తనిఖీ చేయాలని,సిబ్బంది పనితీరును నిత్యం పర్యవేక్షిస్తూ ఉండాలనీ సి.ఐ రాం నర్సింహారెడ్డి కి సూచించారు.కమ్యూనిటీ పోలీసులలో భాగంగా పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న ప్రజలకు సైబర్ నేరాలు వివిధ సామాజిక అంశాలపై ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పించాలని అన్నారు.అలాగే నేరాల నియంత్రణలో విజిబుల్ పోలీసింగ్, సాంకేతిక పరిజ్ఞానం వినియోగంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని , మాదకద్రవ్యాల నిర్మూలన, రోడ్డు భద్రత,శాంతిభద్రతల పరిరక్షణలో సమన్వయంతో పనిచేయాలని సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. ప్రతి కానిస్టేబుల్ తమ పరిధిలోని గ్రామాలను క్రమం తప్పకుండా సందర్శించి,ప్రజలతో మమేకమై శాంతిభద్రతలకు సంబంధించిన సమస్యలను తెలుసుకోవాలని ఆదేశించారు.విధుల్లో ఉన్న సమయంలో తప్పనిసరిగా లాఠీ వెంట ఉంచుకోవాలని సూచించారు.ఈ తనిఖీలో ఎస్పి వెంట డిఎస్పి పురుషోత్తం రెడ్డి,సిఐ ఎలపాటి రాం నరసింహారెడ్డి,ఎస్ఐలు గురుక మహేష్,మిర్యాలరవీందర్,పోలీస్‌సిబ్బంది పాల్గొన్నారు.

## ఐఐటి, ఎన్ఐటిలో 'ఆల్ఫోర్స్' విద్యార్థులకు సీట్ల కేటాయింపు

**ప్రజాపక్షం/కొత్తపల్లి:** జెఒఎస్ఎస్ఎ2026 మొదటి రౌండ్ కౌన్సిలింగ్ ద్వారా 108 మంది ఆల్ఫోర్స్ విద్యార్థులకు జాతీయస్థాయి ఐఐటి, ఎన్ఐటిలలో సీట్లు కేటాయించడం సంతోషంగా ఉందని ఆల్ఫో ర్స్ విద్యా సంస్థల చైర్మన్ డా.వి.నరేందర్ రెడ్డి అ న్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్ర తిష్టాత్మక ఐఐటిలలో 31 మంది విద్యార్థులు సీట్లు సాధించగా ప్రతిష్టాత్మక ఎన్ఐటిలో 36 మంది విద్యార్థులు, వివిధ ఐఐఐటిలలో 16 మంది విద్యార్థులు, వివిధ ఐఐఇఎస్‌టి, బిఐటి,జిఎఫ్‌టిఐ, ఎస్ఎన్ఐఇ,ఎన్ఐఇఎల్‌టి, సియూహెచ్‌లలో 25 మంది విద్యార్థులు సీట్లు సాధించి ఆల్ఫోర్స్ ఖ్యా తి ని పెంచార న్నారు. యుజిఇఇ ద్వారా ఆల్ఫోర్స్ వి ద్యార్థి జి.అశీస్ రెడ్డి ఐఐటిహైదరాబాద్‌లో సీటు సాధించడం విశేషమని, ఐఐటీ జెఇఇ మెయిన్ ప ర్సంటైల్ ద్వారా పటేల్ అక్షయ రెడ్డి ఐఐఐటి హైదరాబాద్ సీటు సాధించడం గమనార్హమని పేర్కొన్నారు.

## అభరణాలు శుభ్రం చేస్తామంటూ మహిళను మోసం చేసిన దొంగలు



**ప్రజాపక్షం/దుబ్బాక:** అభరణాలను శుభ్రం చేసి కొత్తవాటిలా మెరిపిస్తామని నమ్మబలికి మహిళను మోసం చేసిన సంఘటన తొగుట మండలం వెంకట్రావుపేట గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామంలో ఇద్దరు వ్యక్తులు ఇంటింటికి తిరుగుతూ తమ వద్ద ఉన్న ప్రత్యేక పౌడర్, లిక్విడ్‌తో బంగారం వెండి అభరణాలను తెల్లగా చేసి మెరిపిస్తామని నమ్మబలికారు. చాలా మంది వారి మాటలను నమ్మలేదు. చివరికి గ్రామానికి చెందిన కల్లెపు అనూష యువకుల మాటలు నమ్మి ఆమె మెడలోని ఉన్న బంగారు పుస్తెలతాడు, ఆమెతో పాటు ఆమె చెల్లి కాళ్లకు ఉన్న వెండి పట్టి గొలుసులు తీసి ఇచ్చారు.మెరిసేలా చేసి తిరిగి అనూషను అభరణాలు ఇచ్చారు. కాని అభరణాల్లో సుమారు 8 గ్రాముల బంగారు తక్కువ వచ్చిందని మోసపోయానాని గ్రహించిన బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇద్దరు దుండగులు రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న దృశ్యాలు సీసీ కెమెరాలో కనిపించాయి. తొగుట పోలీసులు ఈ సంఘటనపై విచారణ మొదట పెట్టి మోసగాళ్లను గుర్తించే ప్రయత్నం చేస్తున్నారు.

## అసోంలో కుప్పకూలిన విమానం

### అసోంలోని జోర్హాట్‌లో ల్యాండ్ అవుతుండగా ప్రమాదం

### ఐదుగురు భారత వైమానికి దళ సిబ్బంది మృతి



**న్యూఢిల్లీ :** అసోంలో విమానం ప్రమాదం సంభవించింది. రష్యాకు చెందిన ఆంటోనోవ్ ఆన్–32 రవాణా విమానం శనివారం ల్యాండింగ్ అవుతుండగా జోర్హాట్‌లో కూలిపోయింది. ఈ ఘటనలో ఇద్దరు అధికారులతో సహా ఐదుగురు భారత వైమానిక దళ సిబ్బంది మృతి చెందారు. విమానం కోపైలట్ గాయపడ్డాడని, అతనికి జోర్హాట్‌లోని సైనిక ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారని వర్గాలు తెలిపాయి. ప్రమాద సమయంలో విమానంలో ఆరుగురు సిబ్బంది ఉన్నారు. భారత వైమానిక దళం (ఐఎఎఫ్) తెలిపిన ప్రకారం ఉదయం సుమారు 10 గంటలకు సాధారణ గస్తీలో ఉండగా ఈ విమానం ప్రమాదానికి గురైంది. మృతులను స్క్వాడ్రన్ లీడర్ ప్రశాంత్ సింగ్, ఫ్లైట్ లెఫ్టినెంట్ శుభం కుమార్, సార్జెంట్ జితేంద్ర శర్మ, అగ్నివీర్వాయు ఖేమరామ్ కుమావత్, అగ్నివీర్వాయు డానిష్ ఆలంగా గుర్తించారు. ప్రమాదానికి గల కారణాలను నిర్ధారించడానికి విచారణ కమిటీని ఏర్పాటు చేశారు. 'అసోంలోని జోర్హాట్‌లో జరిగిన ఆన్–32 ప్రమాదంలో ఐదుగురు సిబ్బందిని కోల్పోయినందుకు భారత వైమానిక దళం తీవ్ర విచారం వ్యక్తం చేస్తోంది' అని వైమానిక దళం ఒక ప్రకటనలో తెలిపింది. మృతులు విధి నిర్వహణలో తమ ప్రాణాలను అర్పించారని పేర్కొంది. వారి కుటుంబాలకు ఐఎఎఫ్ ప్రగాఢ సంతాపం తెలియజేస్తూ, ఈ దుఃఖ సమయంలో వారికి అండగా నిలుస్తుందని తెలిపింది. విమానం ల్యాండ్ అయిన వెంటనే అదుపు తప్పి రన్‌వే నుండి పక్కకు జారిపోయిందని వర్గాలు తెలిపాయి. అది సమాంతరంగా ఉన్న టాక్సీవే మీదుగా దూసుకెళ్లి, రెండు ముక్కలుగా విరిగి, ఆ తర్వాత మంటల్లో చిక్కుకుందని వారు తెలిపారు. ఎఎన్–32 అనేది సోవియట్ రూపొందించిన రెండు ఇంజన్ల టర్బోప్రాప్ రవాణా విమానం. ఈ విమానాలు దశాబ్దాలుగా ఐఎఎఫ్‌కు నమ్మకమైన సాధనాలుగా సేవలందిస్తున్నాయి. ప్రపంచంలోని అత్యంత క్లిష్టమైన భూభాగాల్లో సిబ్బందిని రవాణా చేయడానికి, కీలకమైన సామాగ్రిని గాలిలో నుండి జారవిడవడానికి ఇవి ఉపయోగపడతాయి. ఈ విమానాలను కొనసాగించడానికి అనేకసార్లు వీటిని అప్‌గ్రేడ్ చేశారు.

### కాంగ్రెస్ దేశ వ్యాప్తంగా

# పేపర్‌లీక్ వ్యతిరేక ఉద్యమం

● 17న కోటాలో ప్రారంభమయ్యే పలు విద్యార్థి సదస్సుల్లో పాల్గొననున్న రాహుల్‌గాంధీ ● రాజకీయ అనుబంధాలకు అతీతంగా విద్యార్థులను ఈ ఉద్యమం ఏకం చేస్తుంది : కెసి వేణుగోపాల్

**న్యూఢిల్లీ:** పేపర్ లీక్‌లు, పరీక్షల అవకతవకలకు వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ దేశవ్యాప్తంగా దశల వారీగా ప్రచారం చేపట్టనుంది. అందులో భాగంగా తొలి దశ షెడ్యూల్‌ను కాంగ్రెస్ శనివారం ప్రకటించింది. ఈనెల 17న రాజస్థాన్‌లోని కోటాలో ప్రారంభమయ్యే పలు విద్యార్థి సదస్సులలో రాహుల్ గాంధీ ప్రసంగించనున్నారు. ఈ ఉద్యమం రాజకీయ అనుబంధాలకు అతీతంగా విద్యార్థులను ఏకం చేస్తుందని, అలాగే పదేపదే పరీక్షలలో వైఫల్యాలు, పేపర్ లీక్ కుంభకోణాలపై తమ అనుభవాలను పంచుకోవడానికి, జవాబుదారీతనం కోరడానికి బాధితులైన యువతకు ఒక వేదికను అందిస్తుందని పార్టీ తెలిపింది. 'భారత యువత ఎదుర్కొంటున్న సంక్షోభంపై పార్లమెంటులో సమగ్ర చర్చ జరిపి, వారి ప్రయోజనాలు, హక్కులు, భవిష్యత్తును పరిరక్షించేందుకు శాసనపరమైన చర్యలను కాంగ్రెస్ పార్టీ ప్రతిపాదిస్తుంది' అని ఎఐసిసి ప్రధాన కార్యదర్శి (సంస్థాగత) కెసి వేణుగోపాల్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మార్గదర్శకత్వంలో, రాహుల్‌గాంధీ నాయకత్వంలో, 'ప్రశ్నపత్రాల లీకేజీలు, పరీక్షల్లో అక్రమాలు, నిరుద్యోగం, మోదీ ప్రభుత్వం భారతీయ యువతకు చేస్తున్న క్రమబద్ధమైన ద్రోహం వంటి పెరుగుతున్న సంక్షోభాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్త ఉద్యమంలో మొదటి దశను ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ ప్రకటించిందని వేణుగోపాల్ పేర్కొన్నారు. భారతదేశ విద్యార్థులు, యువతకు అత్యంత స్థిరమైన, విశ్వసనీయమైన ప్రతినిధిగా ఎదిగిన ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ కోట (జూన్ 17), అలహాబాద్ (జులై 10), పాట్నా (జులై 11), ఢిల్లీ (జులై 14)లలో పలు భారీ విద్యార్థి సదస్సులను నిర్వహిస్తారని ఆయన అన్నారు. ఈ సదస్సులకు విద్యార్థులు, అభ్యర్థులు, యువజన సంఘాలు, విద్యావేత్తలు, అలాగే ఆరోపిత పరీక్షల కుంభకోణాల వల్ల ప్రత్యక్షంగా ప్రభావితమైన వారందరూ హాజరవుతారని తెలిపారు.



పేపర్ లీక్‌లు, పెరుగుతున్న పరీక్షల ఖర్చులు, నిష్పక్షపాతమైన, పారదర్శకమైన నియామక, విద్యా వ్యవస్థను నిర్ధారించడం లో ప్రభుత్వ వైఫల్యం కారణంగా పదేపదే భవిష్యత్తు ప్రమాదంలో పడుతున్న లక్షలాది మంది యువ భారతీయులు ఎదుర్కొంటున్న కష్టాలను ఈ ప్రచారం వెలుగులోకి తెస్తుందని వేణుగోపాల్ అన్నారు. ఈ దేశ వ్యాప్త ప్రచారంలో భాగంగా, దేశవ్యాప్తంగా నేషనల్ స్టూడెంట్స్ యూనియన్ ఆఫ్ ఇండియా (ఎన్ఎస్‌యుఐ), యూత్ కాంగ్రెస్, ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీలు, జిల్లా కాంగ్రెస్ కమిటీలు, స్థానిక విభాగాల ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించి, విద్యార్థులను సమీకరించాలన్న రాహుల్‌గాంధీ పిలుపును పార్టీ పునరుద్ఘాటిస్తుందని ఆయన తెలిపారు. 'అవినీతి, అసమర్థత లేదా రాజకీయ ఉదాసీనతకు యువ భారతీయుల ఆకాంక్షలను బలి చేయకూడదనే రాహుల్ గాంధీ దృఢ విశ్వాసాన్ని ప్రతిబింబిస్తూ, ఈ ఉద్యమం రాజకీయ అనుబంధాలకు అతీతంగా విద్యార్థులను ఏకం చేయడానికి ప్రయత్నిస్తుంది. అలాగే, పదేపదే పరీక్షలలో విఫలమవడం, పేపర్ లీక్ కుంభకోణాలపై జవాబుదారీతనం కోరడానికి, ప్రభావిత యువత తమ అనుభవాలను పంచుకోవడానికి ఒక వేదికను అందిస్తుంది' అని ఆయన అన్నారు. నీట్ నిర్వహణలో వికేంద్రీకరణ, పరీక్షా రుసుముల రద్దు, ప్రశ్నపత్రాల లీకేజీ వ్యవహారాల్లో ప్రమేయం ఉన్నవారిపై కఠిన చర్యలు, కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామాతో సహా ప్రభుత్వ అత్యున్నత స్థాయిలలో జవాబుదారీతనం వంటివి, రాహుల్‌గాంధీ గతంలో లేవనెత్తిన డిమాండ్లను ఈ ఉద్యమం ప్రజల్లోకి తీసుకెళ్తుందని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి పేర్కొన్నారు. పెరుగుతున్న ధరలు, నిరుద్యోగం, పరీక్షా ప్రశ్నపత్రాల లీకేజీ ఆరోపణలు ఎన్నికల తారుమారు వంటి అంశాలపై ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టేందుకు దేశవ్యాప్త ఉద్యమాన్ని ప్రారంభించనున్నట్లు పార్టీ గురువారం ప్రకటించింది. పార్టీ ప్రధాన కార్యాలయంలో ఖర్గే అధ్యక్షతన జరిగిన ప్రధాన కార్యదర్శులు, రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జ్‌లు, ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుల సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు.

## ఆర్మీ చీఫ్‌గా లెఫ్టినెంట్ జనరల్ ధీరజ్ సేథ్

### జూన్ 30న బాధ్యతలు స్వీకరణ



**న్యూఢిల్లీ :** లెఫ్టినెంట్ జనరల్ ధీరజ్ సేథ్ తదుపరి ఆర్మీ చీఫ్‌గా బాధ్యతలు చేపట్టనున్నారని రక్షణ మంత్రిత్వ శాఖ శనివారం ప్రకటించింది. వ్యూహాత్మక ప్రణాళికలు, సైన్యం ఆధునీకరణకు చేసిన కృషికి విస్తృతంగా పేరుగాంచిన లెఫ్టినెంట్ జనరల్ సేథ్, ప్రస్తుతం వైస్ చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్‌గా పనిచేస్తున్నారు. ప్రస్తుత ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది ఈ నెల 30న పదవీ విరమణ చేయనున్నారు. అయితే అదే రోజున సేథ్ బాధ్యతలు స్వీకరించనున్నారు. 'ప్రస్తుతం వైస్ చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్‌గా పనిచేస్తున్న లెఫ్టినెంట్ జనరల్ ధీరజ్ సేథ్‌ను జూన్ 30 మధ్యాహ్నం నుంచి అమలులోకి వచ్చేలా తదుపరి ఆర్మీ చీఫ్ ఆఫ్ స్టాఫ్‌గా ప్రభుత్వం నియమించింది' అని మంత్రిత్వ శాఖ తెలిపింది. ఈ సీనియర్ సైనిక అధికారి ఖడక్‌వాస్లాలోని జాతీయ రక్షణ అకాడమీ పూర్వ విద్యార్థి. ఆయన డిసెంబర్ 1986లో ఆర్మర్డ్ కార్ప్స్‌లో నియమితులయ్యారు. దాదాపు నాలుగు దశాబ్దాల పాటు సాగిన తన విశిష్ట సైనిక వృత్తిలో, ఆయనకు కార్యాచరణ, వ్యూహాత్మక, సామర్థ్య అభివృద్ధి, సంస్థాగత రంగాలలో విస్తృతమైన అనుభవం ఉంది. బలగాల ఆధునీకరణకు ఆయన చేసిన సేవలకు విస్తృతంగా గుర్తింపు పొందిన ఈ అధికారి, ఆర్మీ ప్రధాన కార్యాలయంలోని వ్యూహాత్మక ప్రణాళిక, సామర్థ్య అభివృద్ధి విభాగాలలో కీలకమైన పదవులను నిర్వహించారు. సీనియర్ అధికారుల ప్రకారం, సామర్థ్య రోడ్‌మ్యాప్, దీర్ఘకాలిక బలగాల పునర్నిర్మాణ కార్యక్రమాలను చేపట్టడంలో లెఫ్టినెంట్ జనరల్ సేథ్ గణనీయంగా తోడ్పడ్డారు. ఈ అధికారి విభిన్న కార్యాచరణ వాతావరణాలలో ప్రతి స్థాయిలో కమాండ్ చేశారు. ఆయన కమాండ్ బాధ్యతలలో ఎడారి సెక్టార్‌లోని ఒక ఆర్మర్డ్ రెజిమెంట్, వెస్ట్రన్ థియేటర్‌లోని ఒక ఆర్మర్డ్ బ్రిగేడ్, జమ్ముకశ్మీర్‌లోని ఒక తిరుగుబాటు నిరోధక దళం ఉన్నాయి. లెఫ్టినెంట్ జనరల్‌గా, ఆయన భారత సైన్యంలోని ప్రముఖ స్ట్రైక్ ఫార్మేషన్‌లలో ఒకటైన సుదర్శన్ చక్ర కార్ప్స్‌కు కమాండ్ చేశారు. ఆ తర్వాత ఆయన ఢిల్లీ ఏరియా జనరల్ ఆఫీసర్ కమాండింగ్‌గా పనిచేస్తూ, కీలకమైన జాతీయ, అంతర్జాతీయ సైనిక కార్యకలాపాలు, ఉత్సవ బాధ్యతలను పర్యవేక్షించారు.

### భారత వ్యాఖ్యలపై ఇరాన్ డ్రోన్ దాడి వ్యాఖ్యలు

## 'పూర్తిగా నిరాధారం': ఇరాన్

**న్యూఢిల్లీ :** హోర్ముజ్ జలసంధిలో భారత నౌకలపై ఇరాన్ డ్రోన్ దాడి చేసిందన్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వాదన 'పూర్తిగా నిరాధారమైనది' అని ఇరాన్ రాయబార కార్యాలయం పే ర్కొంది. ఈ వారం ఒమన్ గల్ఫ్‌లో వాణిజ్య నౌకలపై అమెరికా సైన్యం జరిపిన దాడుల్లో ముగ్గురు భారతీయ నావికులు మరణించిన ఘటన నుంచి ప్రజల దృష్టిని మళ్లించే ప్రయత్నమే డొ నాల్డ్ ట్రంప్ వ్యాఖ్యలని రాయబార కార్యాలయం నొక్కిచెప్పింది. హోర్ముజ్ జలసంధిలోని భారతీయ నౌకకు సంబంధించి ఇరాన్ పై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చేసిన ఆరోపణ పూర్తిగా నిరాధారమైనది అని సోషల్ మీడియాలో పేర్కొన్నారు. వారంలోపే అమెరికా మూడు భారతీయ నౌకలపై ముగ్గురు అమాయక భారతీయ నావికులపై క్రూరంగా దాడిచేసిందనే వాస్తవం నుండి ప్ర జల దృష్టిని మళ్లించే ప్రయత్నమే ఇది అని, ఇది చాలా దయనీ యం అని రాయబార కార్యాలయం పేర్కొంది. ఒమన్ తీరంలో భారతీయ సిబ్బందితో ఉన్న వాణిజ్య నౌకలపై అమెరికా సైన్యం జరిపిన 'ప్రాణాంతకమైన..ఘోరమైన దాడులు', ఆమోదయోగ్య ం కాదని, భారత్–అమెరికా ఛార్జ్ డి'అఫైర్స్ జాసన్ మీక్స్‌ను పిలిపించి చెప్పిన కొన్ని గంటల తర్వాత, శుక్రవారం అమెరికా అధ్యక్షుడు ఈ వాదనలు చేశారు. మూడు నౌకలపై అమెరికా దాడిచేసి ముగ్గురు భారతీయులను చంపిన ఘటనపై ఈ వారంలో న్యూఢిల్లీ జాసన్ మీక్సన్‌ను పిలిపించడం ఇది రెండవ సారి. పలా వ్ జెండా కలిగిన ఒక చమురు ట్యాంకర్‌లో 24మంది భారతీయ నావికులు ప్రయాణిస్తుండగా జూన్ 8న అమెరికా దళాలు దా నిని నిలిపివేశాయి. సిబ్బంది అందరినీ సురక్షితంగా రక్షించారు. జూన్ 10న అమెరికా దళాలు పలావు జెండా కలిగిన 'సెటొబె ల్లో' అనే మరో చమురు ట్యాంకర్‌పై దాడిచేయగా, ఈ దాడిలో అందులోని 24మంది భారతీయ నావికులలో ముగ్గురు మరణించారు. గినియా–బిస్సావ్ జెండా కలిగిన ఇండియన్ ట్యాంకర్స్ 'జలవీర్' అనే మరోనౌకపై గురువారం దాడి జరిగింది. సెట్టెబె ల్లో, మారివెక్స్,జల్‌వీర్‌లపై జరిగిన మూడు వేర్వేరు దాడులలో అమెరికా నావికాదళం నుండే జరిగాయి అని విదేశాంగ మంత్రి త్వ శాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జైస్వాల్ గురువారం చెప్పా రు. మూడు నౌకలలో రెండు యుఎస్ ట్రెజరీకి చెందిన ఆఫీస్ ఆఫ్ ఫారిన్ అసెట్స్ కంట్రోల్ (ఓఎఫ్ఎసి) నిర్వహించే తనిఖీకి లోబడి ఉన్నాయని, మరొకటి నిబంధనలకు అనుగుణంగా లేదని వర్గీకరించబడిందని జైస్వాల్ చెప్పారు.ఒఎఫ్ఎసి అనేది యుఎస్ ట్రెజరీ డిపార్ట్‌మెంట్ ఆర్థిక నిఘా, అమలు విభాగం, ఇది ప్రమేయం ఉన్న నౌకలపై చర్యలు తీసుకుంటుంది. ఇరాన్–రష్యా చమురు అమ్మకంపై అమెరికా ఆంక్షలను ఉల్లంఘించడం, ఇరాన్ ఓడలపై అమెరికా విధించిన దిగ్బంధనాన్ని ఉల్లంఘించేందుకు ప్రయత్నిస్తున్నాయని పేర్కొంటూ, జూన్ 8న మారివెక్స్, జూన్ 9న సెట్టెబెల్లో, జూన్ 11న ఎంటి జల్‌వీర్ అనే మూడు నౌకలను నిలిపివేసేందుకు చర్యలు ప్రారంభించినట్లు యుఎస్ కమాండ్ కంట్రోల్ తెలిపింది.

## గ్లోబల్ సౌత్ ఆకాంక్షలపై భారత్ గళం విప్పుతుంది

● ప్రధాని నరేంద్రమోదీ వెల్లడి ● 16, 17 తేదీల్లో ఫ్రాన్స్‌లోని ఎవియాన్‌లో జి–7 శిఖరాగ్ర సమావేశం

**న్యూఢిల్లీ :** జరగబోయే జి–7 సమావేశాలలో భారత దేశం కేవలం తన తరపున మాత్రమే మాట్లాడదని, 'గ్లోబల్ సౌత్' ఆకాంక్షలపై కూడా గళం విప్పుతుందని శనివారం ప్రధానమంత్రి నరేంద్రమోదీ స్పష్టం చేశారు. వారం రోజులపాటు జరగనున్న తన ఫ్రాన్స్, స్లోవేకియా పర్యటనకు ముందు అక్కడ జరిగే శిఖరాగ్ర సమావేశానికి బయలుదేరిన సందర్భంగా ప్రధాని మోదీ, జి–7లో తన ఉనికి ప్రపంచవ్యాప్తంగా దేశం యొక్క పెరుగుతున్న ప్రాముఖ్యతపై దాని భాగస్వాములు ఉంచిన నమ్మకాన్ని ప్రతిబింబిస్తుందని తన వీడ్కోలు ప్రకటనలో తెలిపారు. భారతదేశం వరుసగా 8వసారి ఆహ్వానించిన జి–7 శిఖరాగ్ర సమావేశం ఇది. జి–7లో భారతదేశం కేవలం తన గురించి మాత్రమే కాకుండా గ్లోబల్ సౌత్ ఆకాంక్షలపై కూడా గళమెత్తుతుందన్నారు.జి–7 శిఖరాగ్ర సమావేశం ఫ్రాన్స్‌లోని ఎవియాన్‌లో జూన్ 16, 17 తేదీలలో జరగనుంది. ఫ్రాన్స్, స్లోవక్ రిపబ్లిక్‌లో తన పర్యటనలు ఐరోపా ఖండంతో భారతదేశపు సంబంధాలు మరింత బలోపేతం చేస్తాయని, అలాగే ఆ ఖండంతో, వెలుపల కూడా విస్తృత భాగస్వామ్యాలను విస్తరించడంలో మా దృఢ నిబద్ధతను ప్రదర్శిస్తాయని తాను విశ్వసిస్తున్నానని మోదీ పేర్కొన్నారు.



భారతదేశం దృష్టిలో ఫ్రాన్స్‌కు ఒక ప్రత్యేక స్థానం ఉందన్నారు. అలాగే 1993లో దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఒక భారత ప్రధాని స్లోవేకియాలో పర్యటించడం ఒక చరిత్రాత్మక మైలురాయి అని, ఇది ద్వైపాక్షిక సంబంధాలలో పెరుగుతోన్న ఒక ఊపును మరింత ముందుకు తీసుకువెళుతుందన్న ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు. జూన్ 14న నైస్‌లో ఫ్రెంచ్ ప్రెసిడెంట్ ఇమ్మాన్యుయేల్ మాక్రోన్‌తో కలిసి 'భారత్ ఇన్నోవేట్స్'ను ప్రారంభించేందుకు తాను ఆసక్తితో ఎదురుచూస్తున్నానని మోదీ అన్నారు. భారత్–ఫ్రాన్స్ ఆవిష్కరణల సంవత్సరం నేపథ్యంలో జరుగుతున్న ఈ చరిత్రాత్మక కార్యక్రమం, భారతదేశంలోని అత్యంత ప్రముఖ స్టార్టప్‌లన ప్రపంచ పెట్టుబడులతో అనుసంధానించడంతో పాటు భారతదేశ ఉన్నత విద్యా వ్యవస్థ నుంచి ఆవిర్భవిస్తున్న ఆవిష్కరణలకు ఒక ప్రధాన వేగవర్ధకంగా కూడా పనిచేస్తుంది. మోదీ ఫ్రాన్స్ నుంచి జూన్ 14–15 తేదీలలో స్లోవేకియాలో అధికారిక పర్యటనకు వెళ్లనున్నారు. అక్కడ ఆయన బ్రాటిస్లావాలో ప్రెసిడెంట్ పీటర్ పెల్లెగ్రిని, ప్రధానమంత్రి రోబర్ట్ ఫికోలతో చర్చలు జరిపి, వ్యాపార వర్గాలతో సంప్రదింపులు జరుపనున్నారు.'ఈ చరిత్రాత్మక పర్యటన ద్వైపాక్షిక సంబంధంపై బలమైన ఊపును మరింత ముందుకు తీసుకువెళుతుంది. నేను అధ్యక్షుడు పెల్లెగ్రిని, ప్రధానమంత్రి రోబర్ట్ ఫికోలతో చర్చలు జరిపే అవకాశం కోసం ఎదురుచూస్తున్నాను ' అని ప్రధాని మోదీ చెప్పారు. స్లోవేకియా యూరోపియన్‌లో ఒక ముఖ్యమైన, విలువైన సభ్యదేశం అని తెలియజేశారు. జూన్ 18న పారిస్‌లో అధ్యక్షుడు మాక్రాన్‌తో పాటు వివాటెక్ 2026లో పాల్గొననున్న ఆయన తన ఫ్రాన్స్ పర్యటనను ముగించనున్నారు. వివాటెక్ అనేది యూరప్‌లో సాంకేతికత, ఆవిష్కరణలకు సంబంధించిన ప్రధాన సదస్సు. ఇందులో, భారతదేశం అతిపెద్ద జాతీయ పెవిలియన్‌ను కలిగి ఉంటుంది. ఇది భారతదేశం, యురోపియన్ ఆవిష్కరణల పర్యావరణ వ్యవస్థల మధ్య భాగస్వామ్యానికి ఉన్న అపారమైన సామర్థ్యానికి ఈ ఫ్రాన్స్ పర్యటన తగిన చిహ్నంగా నిలుస్తుంది.

## అర్ధరాత్రి అభిషేక్ నివాసంలో పోలీసుల తనిఖీలు

రాజకీయ కక్షసాధింపు చర్యగా అభివర్ణించిన టిఎంసి

**కోల్‌కతా :** పశ్చిమ బెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్ (టిఎంసి)ను కష్టాలు చుట్టుముట్టుతున్నాయి. ఆర్థిక మోసానికి సంబంధించిన కేసులో తన సన్నిహిత సహాయకుడి ఆచూకీ కోసం పోలీసులు శనివారం తెల్లవారుజామున ఆ పార్టీ ఎంపి అభిషేక్ బెనర్జీ నివాసంలో గంటల తరబడి సోదాలు నిర్వహించారు. ఈ ఆపరేషన్‌లో కేంద్ర బలగాలు కూడా పాల్గొన్నాయి. పశ్చిమ్ మిద్నాపూర్ జిల్లాలోని సల్బోని పోలీస్ స్టేషన్‌కు చెందిన బృందం కోల్‌కతా పోలీసుల సహకారంతో తెల్లవారుజామున 2 గంటల ప్రాంతంలో ఈ సోదాలు ప్రారంభించింది. ఇది రాజకీయ ఘర్షణకు దారితీసింది. టిఎంసి దీనిని రాజకీయ కక్షసాధింపు చర్యగా ఆరోపించగా, దర్యాప్తు అధికారులు కేవలం చట్టపరమైన ప్రక్రియను అనుసరిస్తున్నారని అధికార బిజెపి నేతలు సర్దిచుకున్నారు. సమాచారం తెలుసుకున్న మాజీ ముఖ్యమంత్రి, టిఎంసి అధినేత్రి మమతా బెనర్జీ హుటాహుటిన కాళీఘాట్‌లోని అభిషేక్ నివాసానికి చేరుకుని, సోదాలు ముగిసి పోలీసులు అక్కడి నుండి వెళ్ళిపోయే వరకు అక్కడే ఉన్నారు. సల్బోని పోలీస్ స్టేషన్‌లో నమోదైన ఆర్థిక మోసం కేసు దర్యాప్తులో భాగంగా గాలిస్తున్న అభిషేక్ వ్యక్తిగత సహాయకుడు సుమిత్ రాయ్ ఆచూకీ కనుగొనడమే ఈ సోదాల ప్రధాన ఉద్దేశమని పోలీసు వర్గాలు తెలిపాయి. ఆ వర్గాల సమాచారం



ప్రకారం, రాయ్ మొబైల్ ఫోన్ సిగ్నల్ చివరిసారిగా బెనర్జీ కాళీఘాట్ నివాసం వద్ద గుర్తించబడింది, దీంతో దర్యాప్తు అధికారులు ఈ ఆపరేషన్‌ను చేపట్టారు. సోదాలు చేయడానికి వచ్చిన పోలీసు బృందం అభిషేక్ నివాసం తలుపులను పదేపదే తట్టినప్పటికీ ఎటువంటి స్పందన రాలేదని, దాదాపు నాలుగు గంటల పాటు వారు బయటే వేచి ఉండాల్సి వచ్చిందని అధికారులు తెలిపారు. పోలీసు బృందం తాళం పగలగొట్టి, సోదాలు నిర్వహించడానికి ఆవరణలోకి ప్రవేశించిందని టిఎంసి ఆరోపించింది. దాదాపు గంటన్నర పాటు సోదాలు నిర్వహించిన బృందం ఉదయం 7:30 గంటల ప్రాంతంలో వెళ్లిపోయింది. అనంతరం అభిషేక్ విలేకరులతో మాట్లాడుతూ వారు తాళం పగలగొట్టి ఇల్లంతా సోదా చేశారు అని చెప్పారు. ఆవరణలో రాయ్ ఆచూకీ దొరికిందా అని అడిగినప్పుడు, నా ఇంటిని క్షుణ్ణంగా సోదా చేసిన పోలీసులనే ఆ ప్రశ్న అడగాలి. నేను పోలీసుల ప్రతినిధిని కాను అని బదులిచ్చారు. విస్తృతంగా సోదాలు చేసినప్పటికీ రాయ్ ఆచూకీ లభించలేదని, ఎటువంటి వస్తువులను స్వాధీనం చేసుకోకుండానే బృందం వెనుదిరిగిందని దర్యాప్తు బృందంలోని వర్గాలు తెలిపాయి. ఆపరేషన్ జరుగుతున్నంత సేపు కాళీఘాట్‌లోని పటువపారా ప్రాంతంలో భారీ భద్రత కల్పించారు. ఆ ప్రాంతంలో కేంద్ర బలగాలను మోహరించగా, కాళీఘాట్, భవానీపూర్ పోలీస్ స్టేషన్ల సిబ్బంది సోదా బృందానికి సహకరించారు. అయితే, పోలీసులు ఆ కేసు వివరాలను లేదా తాము వెతుకుతున్న సాక్ష్యాల గురించి వెల్లడించడానికి నిరాకరించారు. ఈ సోదా ప్రక్రియలో మహిళా అధికారులతో సహా పలువురు సిబ్బంది పాల్గొన్నారు. ఒక దశలో, సోదాలు కొనసాగించే ముందు చర్చల కోసం కొందరు అధికారులు కాసేపు ఇంటి బయటకు వచ్చారు. గత వారం రోజులుగా అనేక దర్యాప్తు సంస్థల పరిశీలనను ఎదుర్కొంటున్న బెనర్జీకి, శనివారం జరిగిన ఈ ఆపరేషన్ రాజకీయంగా అత్యంత సున్నితమైన సమయంలో చోటుచేసుకుంది. కేవలం రెండు రోజుల క్రితమే, రాష్ట్ర అసెంబ్లీకి సంబంధించిన నకిలీ సంతకం కేసులో పశ్చిమ బెంగాల్ సిఐడి ఆయన్ని ప్రశ్నించింది.

## కాంగ్రెస్ మునిగే నావ కాదు..

గతంలో కాంగ్రెస్‌ను వీడి వేర్వేరు పార్టీలు పెట్టిన వారు మళ్లీ ఏకం కావాలి : సంజయ్‌రౌత్

**పుణె :** కాంగ్రెస్ పార్టీ మునిగిపోతున్న నౌక కాదని శివసేన (యుబిటి) నాయకుడు సంజయ్ రౌత్ అన్నారు. గతంలో ఆ కాంగ్రెస్ పార్టీని వీడి వేర్వేరు పార్టీలను ఏర్పాటు చేసిన నాయకులు, దానిని బలోపేతం చేయడానికి మళ్లీ ఏకం కావాలని పిలుపునిచ్చారు. బిజెపి అనుసరిస్తున్న వికృత రాజకీయాలకు వ్యతిరేకంగా పోరాడేందుకు అందరూ ఏకం కావాలని కోరుతూ, ఈ దిశగా చొరవ తీసుకోవాలని ఎన్‌సిపి (ఎస్‌పి) అధినేత శరద్ పవార్‌కు ఆయన విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ పార్టీ మునిగిపోతున్న నౌక అని, తెలివైన వారెవరూ దానిని ఎక్కరని మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్ వ్యాఖ్యానించిన మరుసటి రోజే రౌత్ ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. శనివారం ఆయన పుణలో విలేకరులతో మాట్లాతూ బిజెపి వికృత రాజకీయాలకు వ్యతిరేకంగా మనం నిజంగా పోరాడాలంటే, అందరూ ఏకం కావాలన్నారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతం కావాలని, కాంగ్రెస్‌ను వీడిన నాయకులందరూ ముందుగా ఒక్కటి కావాలని సూచించారు.



సీనియర్ నాయకుడు శరద్ పవార్ చొరవ తీసుకుంటే ఇది సాధ్యమవుతుందని, తమది ప్రాంతీయ పార్టీ అయినప్పటికీ అండగా నిలబడతామని స్పష్టం చేశారు. నేటికీ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కాంగ్రెస్ అంటే భయపడుతున్నారని, కాంగ్రెస్ ఎప్పుడూ మునిగిపోతున్న నౌక కాదు అని సేన (యుబిటి) ప్రతినిధి పేర్కొన్నారు. ఇంతకు ముందు కూడా రౌత్ మాట్లాడుతూ ఒకప్పుడు కాంగ్రెస్‌లో భాగంగా ఉన్న టిఎంసి, ఎన్‌సిపి (ఎస్‌పి) వంటి పార్టీలు తిరిగి కలిసి ఆ పార్టీని బలోపేతం చేయాలని, ఎందుకంటే అది ప్రస్తుత తక్షణ అవసరం అని అన్నారు. బిజెపిపై విమర్శలు గుప్పిస్తూ ఆ పార్టీ నిజంగా చేసిన పనిలో కనీసం ఒక శాతమైనా చూపించాలని, వారు స్వాతంత్ర్య పోరాటంలో భాగం కాలేదని, సంయుక్త మహారాష్ట్ర ఉద్యమంలోనూ పాల్గొనలేదన్నారు. ఆ ఉద్యమాల సమయంలో వారు ఎక్కడా కనిపించలేదని, వారు పిరికివారని విమర్శించారు. 'కేంద్ర హోం మంత్రి అమిత్ షా 'ఆపరేషన్ టైగర్'ను వంద సార్లు అమలు చేశారు. రాజకీయ పార్టీలను, వాటి నాయకులను విడదీయడం ప్రజాస్వామ్య వికృత రూపానికి నిదర్శనం. ప్రస్తుత బిజెపి నాయకత్వంలో ఈ వికృత ధోరణి తారాస్థాయికి చేరింది. అయితే, ఇది కూడా ఒక రోజు అంతమవుతుంది. రాష్ట్రంలోనూ, దేశంలోనూ ఇటువంటి వికృత ధోరణికి వ్యతిరేకంగా తిరుగుబాటు వస్తుందని ఆ రాజ్యసభ సభ్యుడు అన్నారు. కేంద్ర హోం మంత్రి జాతీయ భద్రత కాకుండా ఇతర విషయాలతో తీరిక లేకుండా ఉంటున్నారని, న్యాయమూర్తులు విహారయాత్రకు వెళ్తున్నట్లుగా లండన్‌కు వెళ్తున్నారని, ఎన్నికల సంఘం (ఇసి) బిజెపి ఏజెంట్‌లా పనిచేస్తోందన్నారు.

## కేరళ సిఎంను చంపేస్తామంటూ బెదిరింపు కాల్

### నిందితుడిని అరెస్టు చేసిన పోలీసులు

**తిరువనంతపురం :** కేరళ ముఖ్యమంత్రి, ఆయన కుటుంబాన్ని చంపుతానంటూ ఓ వ్యక్తి బెదిరిస్తూ ఫోన్ చేశాడు. అయితే ఆ వ్యక్తిని అరెస్టు చేసినట్లు అధికారు లు తెలిపారు. అతన్ని అట్టింగల్‌కు చెం దిన సోనీ థామస్‌గా గుర్తించారు. పోలీసుల వివరాల ప్రకారం, శుక్రవారం సా యంత్రం 6:50 గంటలకు ఒక అజ్ఞాత వ్యక్తి తిరువనంతపురం సిటీ డిస్ట్రిక్ట్ పోలీస్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌కు (డిపిసిసి) ఫోన్ చేసి, ముఖ్యమంత్రి ని, ఆయన కుటుంబాన్ని చంపుతానని బె దిరించాడు. కారణం అడిగినప్పుడు, సతీశన్ అంటే తనకు ఇష్టం లేదని ఆ వ్యక్తి చెప్పినట్లు ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్నారు. నిందితుడు సాయంత్రం 6:53 గంటలకు మళ్లీ ఫోన్ చేసి అదే బెదిరింపును పునరావృతం చేశాడని అధికారులు తెలిపారు.


**WARANGAL URBAN CO-OPERATIVE BANK LIMITED**

**BALANCE SHEET AS AT 31st MARCH 2026**

**Form 'A'**

(Amount in Rupees)

| | Schedule | As on 31.03.2026 | As on 31.03.2025 |
|---|---|---|---|
| **I. Capital & Liabilities** | | | |
| Capital | 1 | 7,49,60,225.00 | 5,06,92,065.00 |
| Reserves & Surplus | 2 | 20,48,57,073.39 | 20,95,06,927.00 |
| Deposits | 3 | 2,63,97,07,693.74 | 2,19,02,49,371.88 |
| Borrowings | 4 | - | - |
| Other Liabilities & Provisions | 5 | 3,14,97,251.60 | 3,26,54,405.80 |
| | **Total** | **2,95,10,22,243.73** | **2,48,31,02,769.68** |
| **II. Assets** | | | |
| Cash bank & Balance with RBI | 6 | 5,81,61,249.00 | 6,67,16,004.00 |
| Balance with Banks & Money at Call & Short notice | 7 | 39,86,26,015.30 | 31,99,70,905.98 |
| Investments | 8 | 50,19,70,966.00 | 45,12,56,303.00 |
| Advances | 9 | 1,90,75,21,736.14 | 1,54,12,17,763.12 |
| Fixed Assets | 10 | 5,07,41,719.61 | 4,03,24,718.35 |
| Other Assets | 11 | 3,40,00,557.68 | 6,36,17,075.23 |
| | **Total** | **2,95,10,22,243.73** | **2,48,31,02,769.68** |
| **Contingent Liabilities** | 12 | | |
| Bank Guarantees | | 2,46,62,500.00 | 65,92,500.00 |
| Bills for Collection DEAF A/c with RBI | | 8,32,383.61 | 8,32,383.61 |
| **Significant Accounting Policies** | 18 | | |
| **Notes to Accounts** | 19 | | |

The Schedules referred to above form an integral part of the accounts.

**PROFIT AND LOSS ACCOUNT FOR THE YEAR ENDING 31st MARCH 2026**

**Form 'B'**

(Amount in Rupees)

| | Schedule | As on 31.03.2026 | As on 31.03.2025 |
|---|---|---|---|
| **I Income** | | | |
| Interest earned | 13 | 26,76,37,367.33 | 22,86,51,619.96 |
| Other Income | 14 | 1,43,06,298.05 | 1,13,22,326.50 |
| | **Total** | **28,19,43,665.38** | **23,99,73,946.46** |
| **II Expenditure** | | | |
| Interest Expended | 15 | 17,26,65,454.81 | 14,56,89,723.56 |
| Operating Expenses | 16 | 7,73,34,912.30 | 6,30,78,329.47 |
| Provisions& contingencies& Write offs | 17 | 1,03,97,874.15 | 89,51,849.89 |
| | **Total** | **26,03,98,241.26** | **21,77,19,902.92** |
| **III. Profit/Loss** | | | |
| Net Profit/Loss (-) for the year | | 2,15,45,424.12 | 2,22,54,043.54 |
| Profit/Loss (-) brought forward | | 2,22,54,043.54 | 2,36,49,986.89 |
| | **Total** | **4,37,99,467.66** | **4,59,04,030.43** |
| **IV. Appropriations** | | | |
| Transfer to statutory reserves | | 93,77,831.54 | 1,09,89,027.89 |
| Transfer to other reserves | | 66,76,212.00 | 70,94,997.00 |
| Transfer to proposed dividend | | 62,00,000.00 | 55,65,962.00 |
| Balance carried over to balance sheet | | **2,15,45,424.12** | **2,22,54,043.54** |
| | **Total** | **4,37,99,467.66** | **4,59,04,030.43** |

Significant Accounting Policies and Notes to accounts,
The Schedules referred to above form an integral part of the accounts.

Sd/-
**For P V N & CO**
(Statutory Auditor)

Sd/-
**M. Satyanarayana Rao**
Chief Executive Officer

# ఇరుపక్షాల సమాన సంతృప్తే చర్చల మార్గం లక్ష్యం

ఇరాన్ విదేశీ మంత్రి అబ్బాస్ అరాఘ్చీ

చివరి నిమిషందాకా ఎంఓయులో మార్పులు

లెబనాన్ సహా అన్నిచోట్లా యుద్ధం ముగుస్తుంది

ఆక్రమిత ప్రాంతాల నుండి ఇజ్రాయెల్ వైదొలగుతుంది

అన్నీ పూర్తయ్యాకే వివరాలు బయటకు చెబుతాం

తుది దశలో ఎంఓయు

రెండు నెలల చర్చల ఫలితమే ఇరాన్ ప్రజల విజయం



**టెహ్రాన్:** చర్చల్లో ప్రతిపాదిత అంశాల్లో చివరి నిమిషం వరకూ మార్పులకు అవకాశం ఉందని, అందువల్ల మీడియా ద్వారా ముందుగానే బయటకు పొక్కిన, పాకిస్థాన్ ప్రతిపాదించిన 14 అంశాల ఎంఓయు (ముసాయిదా అవగాహన ఒప్పందం)పై తుది అంగీకారం కుదిరే వరకూ వివరాలు ప్రజలకు చెప్పబోమని ఇరాన్ విదేశీ వ్యవహారాలమంత్రి అబ్బాస్ అరాఘ్చీ ప్రకటించారు. ఒప్పందం కుదిరాక డిజిటల్ పద్ధతిలో ఇరు దేశాలూ సంతకాలు చేస్తాయని ఇరాన్ ప్రభుత్వ టీవీకి ఇచ్చిన ఇంటర్వ్యూలో చెప్పారు. చర్చల్లో ఒక పక్షానికి నూటికి నూరుశాతం సంతృప్తి,మరోపక్షానికి యాభై శాతం సంతృప్తి చెల్లుబాటు కాదని, చర్చల మార్గం ఎన్నుకున్నప్పుడు ఇరు పక్షాలూ సమాన సంతృప్తి పొందడమే అత్యంత కీలకమని అన్నారు. బెదిరింపులకు ఇరానియన్లు ఎప్పటికీ తలవంచరని మరోసారి స్పష్టం చేశారు. బెదిరింపులు–ఒత్తిడి ఉండిఉంటే చర్చలనుండి ఏనాడో ఇరాన్ వైదొలగేదని, బెదిరింపుల వల్ల ప్రతికూల ఫలితాలు వస్తాయనేది ఇరాన్ స్పష్టమైన సందేశమని అన్నారు. ఇంటర్వ్యూ వివరాలను ఇరాన్ పత్రిక శనివారం వెల్లడించింది. బెదిరింపులు,ఒత్తిడి,యుద్ధ మార్గం ఎన్నుకుంటే అందుకు ఇరాన్ సిద్ధంగా సమర్థవంతంగా ఉందన్నారు.

పాకిస్థాన్ మధ్యవర్తిత్వంతో కుదిరిన ఈ ఒప్పందం ద్వారా లెబనాన్ సహా అన్ని రంగాలలో యుద్ధం ముగుస్తుందని, ఒప్పందం మేరకు అన్నిచోట్ల నుండీ ఇరాన్ సైన్యం వైదొలగుతుందని చెప్పారు. అదేవిధంగా కొత్త యుద్ధాన్ని ప్రారంభించకపోవడం,బెదిరింపులు,బలప్రయోగాలకు పాల్పడకపోవడం వంటి అవశాలకు ఎంఓయు ప్రకారం కట్టుబడి ఉంటారు, ఎంఓయు పాఠం ప్రకారం ఇరు దేశాలు ఒకరి సార్వభౌమాధికారాన్ని మరొకరు గౌరవించుకుంటాయి,ఇస్లామిక్ రిపబ్లిక్ ఆఫ్ ఇరాన్ సార్వభౌమాధికారాన్ని అమెరికా గుర్తించి,గౌరవించి లిఖితపూర్వకంగా అంగీకరించడం గడచిన 47 సంవత్సరాల చరిత్రలో ఇదే మొదటిసారి అని తాను భావిస్తున్నానని చెప్పారు.

"లెబనాన్‌లో ఇజ్రాయెల్ యుద్ధ విరమణ" కూడా ఎలాంటి ఒప్పందంలోనైనా ఉండాల్సిందేనని ఇరాన్ మొదటినుండీ చెబుతోంది. ఒప్పందం కుదిరిన తర్వాతే ప్రజలకు వివరాలు వెల్లడిస్తామన్నారు. ఈ 14 అంశాల ఎంఓయు ప్రతిపాదనలపై ఇరాన్ అత్యున్నత జాతీయ భద్రతా మండలి, ఇతర అత్యున్నత నిర్ణాయక సంస్థలు పదే పదే లోతుగా చర్చించి సమీక్షించాయన్నారు. యుద్ధ విరమణ చర్చల్లో ఇరాన్–అమెరికా ముసాయిదా అవగాహన ఒప్పందం చేసుకోవడానికి తుదిదశకు వచ్చాయని పశ్చిమాసియాలో యుద్ధంలో ఇరాన్ ప్రజలు ఇప్పటికే విజయం సాధించారని, ఐతే ఈ విజయాన్ని సుస్థిరం చేసుకోవడానికి రెండునెలలపాటు శ్రమించి చర్చలు జరిపామని,ఈ శ్రమ ఫలితంగా ఇరాన్ ప్రజల విజయం సుస్థిరం కాబోతోందని, ఈ ప్రక్రియ ఇప్పుడు తుది దశకు చేరుకుందని చెప్పారు. గడచిన ఏప్రిల్ నెల నుండి ఇప్పటివరకూ ఇంత చేరువగా ఒప్పందానికి ఇరుదేశాలూ రాలేదని, ఇదే మొదటిసారి అని చెప్పారు. ఏప్రిల్ ఎనిమిదో తేదీన మొదటిసారి కాల్పుల విరమణ ఒప్పందం అమలులోకి వచ్చినప్పుడు, ఇరాన్‌పై ప్రకటించిన యుద్ధంపై ఒక ఒప్పందానికి తాము చేరువలో ఉన్నామని అమెరికా–ఇజ్రాయెల్ రెండు దేశాలు ప్రకటించిన విషయాన్ని ఈ సందర్భంగా అబ్బాస్ అరాఘ్చీ గుర్తుచేశారు. ఈ యుద్ధాన్ని శాశ్వతంగా ముగించే ఒప్పందంకోసం చర్చల్లో పాకిస్థాన్ అధికారిక మధ్యవర్తిగా వ్యవహరిస్తోంది.



"ఇరాన్ ప్రజల విజయాన్ని సుస్థిరం చేసేదిశగా చర్చలు జరపడమే తమ లక్ష్యం.సాయుధ దళాలతో పూర్తి సమన్వయంతోనే ఈ చర్చలను ముందుకు తీసుకువెళ్ళాం,విదేశాంగ శాఖ–సాయుధ దళాల మధ్య కేవలం ఐక్యత మాత్రమే కాకుండా అంతకుమించిన బంధం ఉంది. ఒకవైపు శత్రువుకు వ్యతిరేకంగా దళాలు మోహరించినస్థానం లోంచిసైన్యం,చర్చల స్థానం నుండి ప్రతినిధులు ఒకే లక్ష్యంవైపు ప్రయాణం చేస్తున్నారు.ఈ ప్రక్రియ ఇప్పుడు తుది దశకు చేరుకుంది" అని అబ్బాస్ అరాఘ్చీ చెప్పారు. కాగా అగ్రశ్రేణి దౌత్యవేత్తలు చెప్పిన సమాచారం ప్రకారం, ఒప్పందం కుదిరిన తర్వాత అణు సమస్య, అమెరికా విధించిన దిగ్బంధనంపై ఒప్పందానికి చర్చలు ప్రారంభమై 60 రోజుల్లో ముగుస్తాయి. అవి సాగే విధానాన్ని బట్టి చర్చలు ఆగిపోవచ్చు లేదా చర్చలకు విధించిన 60 రోజుల గడువును మరింత పొడిగించే అవకాశం కూడా ఉండవచ్చు. చర్చల్లో ఒక దేశానికి వందశాతం సంతృప్తి, మరో దేశానికి యాభైశాతం సంతృప్తి చెందడం అంటూ ఉండదు, చర్చల మార్గం ఎన్నుకున్నప్పుడు ఆ చర్చల ద్వారా ఇరుపక్షాలూ సంతృప్తి చెందాలి, అలా కానప్పుడు ఇరుపక్షాలు కొంత కొంత సంతృప్తి చెందే (అంటే చెరో యాభైశాతం సంతృప్తి) ఒప్పందమే సరైనదని అబ్బాస్ అరాఘ్చీ స్పష్టం చేశారు.

## జులై 4–9 తేదీల్లో ఖమేనీ అంత్యక్రియలు



**టెహ్రాన్:** ఇరాన్ పూర్వ సర్వాధినేత అయొతొల్లా అలీ ఖమేనీ, ఆయన కుటుంబ సభ్యులు, యుద్ధంలో అమరులైన ఇతర నాయకులకు అంతిమ వీడ్కోలు, అంత్యక్రియల కార్యక్రమం వివరాలను సంబంధిత పర్యవేక్షణా కమిటీ శనివారం ప్రకటించింది. జులై 4,5 తేదీలలో టెహ్రాన్‌లోని ఇమామ్ ఖొమేనీ గ్రాండ్ మోసల్లాలో ప్రజల అంతిమ వీడ్కోలు కార్యక్రమం జరుగుతుంది. జులై ఆరో తేదీన టెహ్రాన్‌లో అంతిమ ఊరేగింపు, జులై ఏడో తేదీన పవిత్ర నగరం కోమ్‌లో రెండవసారి అంతిమ ఊరేగింపు నిర్వహిస్తారు. చిట్టచివరిగా ఖననం కార్యక్రమం జులై 9వ తేదీన పవిత్ర నగరం మషద్‌లో పూర్తిచేస్తారు. అలీ ఖమేనీతోపాటు ఆయన భార్య, కుమార్తె, అల్లుడు, మనుమరాలు, అనేక మంది ముఖ్యమైన కమాండర్లు ఫిబ్రవరి 28వ దీన జరిగిన అమెరికా–ఇజ్రాయెల్ ఉమ్మడి దాడిలో మరణించారు. మహ్మద్‌ప్రవక్త మునిమనుమడు, ఇరాన్ నాలుగవ షియా ఇమామ్ సజ్జాద్ వర్ధంతి సందర్భంగా మషద్ నగరంలో అలీ ఖమేనీ, ఆయన కుటుంబ సభ్యుల అంతిమ ఖనన కార్యక్రమాలు జరుగుతాయి.

అమెరికా–వెనిజులా ఉమ్మడి ఆపరేషన్

# అంతర్జాతీయ నేరముఠా నాయకుడు గెర్రారో హతం

**కారకస్:** వెనిజులాకు చెందిన పేరుమోసిన "ట్రెన్ డీ అరాగ్వా"అంతర్జాతీయ వ్యవస్థీకృత నేరముఠా నాయకుడు నీనో గెర్రారో హతుదయ్యాడు. ఈ ఆపరేషన్‌లో మాదక ద్రవ్యాలను రవాణా చేసే మరో తొమ్మిదిమంది అంతర్జాతీయస్థాయి కిందిస్థాయి నాయకులను కూడా హతమార్చారు. పేరుమోసిన డ్రగ్ ముఠా నాయకుడు గెర్రారో స్థావరాలపై తన ఆదేశాల మేరకు అమెరికా సదరన్ కమాండ్ గగనతల మార్గంలో ప్రాణాంతకమైన "కైనటిక్ దాడి" చేసిందని, గెర్రారో హతుడయ్యాడని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సోషల్ మీడియా వేదికగా ఒక ప్రకటన చేశారు. దాడికి సంబంధించిన ఫుటేజీ వీడియోను పోస్టు చేశారు. ఒక ఆకుపచ్చ భవనం ధ్వంసంకావడం,షెడ్డు పేలిపోవడం, శిథిలాలు గాలిలోకి ఎగరడం ఈ వీడియోలో కనిపిస్తున్నాయి. వెనిజులా కూడా ఒక ప్రకటనలో సంయుక్త ఆపరేషన్ చేసినట్లు పేర్కొంది. అతడి పూర్తిపేరు హెక్టర్ రస్టెన్ ఫోర్డ్ గెర్రారో ఫ్లోర్స్. అమెరికా అంతటా విస్తరించిన ఈ ముఠాను ట్రంప్ విదేశీ ఉగ్రవాద సంస్థగా ప్రకటించారు. వలస ప్రజల నుండి డబ్బు వసూలు చేయడం, కాంట్రాక్టు హత్యలు, స్త్రీల అక్రమ రవాణా, కిడ్నాపులు వంటి చర్యలకు ఈ అంతర్జాతీయ ముఠా పాల్పడుతోందని ప్రస్తుతం అమెరికా జైలులో ఉన్న వెనిజులా మాజీ అధ్యక్షుడు నికొలస్ మదురో ఈ ట్రెన్ డీ అరాగ్వా ముఠాకు సహాయ సహకారాలు అందిస్తున్నారని ఆరోపణలు చేశారు. డ్రగ్ ముఠాలను ప్రోత్సహిస్తున్నారనే పేరుతో ఆయనను, ఆయన సతీమణిని ఈ ఏడాది జనవరి మొదటివారంలో బంధించి అమెరికాకు తీసుకువెళ్ళారు. శరణార్థుల సంక్షోభ సమయంలో ఈ నేరముఠా లాటిన్ అమెరికా ప్రాంతంలో తన కార్యకలాపాలను ఉధృతం చేసింది. వలస ప్రజల బహిష్కరణ, డ్రగ్ ముఠాల నిర్మూలనలో భాగంగా వెనిజులాతో కలిసి ఈ ముఠా నిర్మూలనకు అమెరికాఒక ఉమ్మడి ఆపరేషన్ నిర్వహించింది.



ట్రెన్ డీ అరాగ్వా సహా వివిధ డ్రగ్ కార్టెల్ ముఠాలు, వలస నేర ముఠాలను నిర్మూలించేందుకు వాటిని విదేశీ ఉగ్రవాద సంస్థలుగా ప్రకటిస్తూ, 1798 ఏలియన్ ఎనిమీస్ చట్టం ప్రకారం 2025 జనవరి 20వ తేదీన ట్రంప్ ఒక ఉత్తర్వుపై సంతకాలు చేశారు. ఆ మేరకు లాటిన్ అమెరికా సముద్ర జలాలలో ఇతర ప్రాంతాలలో ముఠాల నిర్మూలన చేపట్టారు. గెర్రారోకు చెందిన ట్రెన్ డీ అరాగ్వా ముఠాను ట్రంప్ అల్–ఖైదా ఉగ్రవాద సంస్థతో పోల్చారు. అరాగ్వా పెనిటెన్షియరీ సెంటర్‌గా పిలిచే టోకోరోన్ జైలుపై కూడా మూడేళ్ళక్రితం దాడులు జరిగాయి. ఈ జైలును కేంద్రంగా చేసుకుని అరాగ్వా కార్యకలాపాలు నిర్వహిస్తుంది. టోకోరోన్ జైలును వెనిజులా సైనిక బలగాలు 2023లో స్వాధీనం చేసుకున్నప్పటికీ ఆనాడు అరాగ్వా ముఠా కీలక నాయకులు అక్కడినుండి పారిపోయి మరోచోట నుండి కార్యక్రమాలు నిర్వహిస్తూ వచ్చారు. అర్జెంటైనా,చిలీ,పెరూ దేశాలలో గతంలో ఈ ముఠా నాయకులు,సభ్యులపై దాడులు జరిగాయి.

# ఉత్తర నైజీరియాలో 17 మంది రైతులు కాల్చివేత

39 మంది గ్రామ పెద్దలు కిడ్నాప్

**కానో:** ఉత్తర నైజీరియాలో సాయుధ దుండగులు 17 మంది రైతులను కాల్చి చంపారు. వ్యవసాయ సీజన్ ప్రారంభమైన తర్వాత నైజీరియాలో గడచిన శుక్రవారం రైతులపై మళ్ళీ హింసాకాండ మొదలైంది. కొన్ని వారాల క్రితం గ్రామంపై ముఠాలు దాడి చేసినప్పుడు గ్రామ సంరక్షణ బృందాలు ఈ ముఠాకు చెందిన 13 మందిని హతమార్చారు. దీనికి ప్రతీకారంగానే ఈ దాడులు జరిగాయని భావిస్తున్నారు. నేరాలకు పాల్పడే ముఠాలు రైతులపై దాడులు చేయకుండా ఒక ఒప్పందం చేసుకోవడానికి కీలక నాయకుణ్ణి కలుసుకునేందుకు 39 మంది గ్రామ పెద్దలు వెళ్ళినప్పుడు వారంతా తిరిగి రాలేదు. వారంతా అపహరణకు గురయ్యారు. డబ్బులకోసం కిడ్నాపులు చేయడం, పశువుల దొంగతనాల్లో నిపుణులైన ముఠాలు, బందిపోటు ముఠాలు ఉత్తర నైజీరియాలో ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తూ ఆ ప్రాంతాన్ని అతలాకుతలం చేస్తున్నాయి. మరాడూ జిల్లా రాజకీయ పాలనా నిర్వాహకుడు ససుసి దోసరా చెప్పిన సమాచారం ప్రకారం, జూన్ 12వ తేదీ ఒక్కరోజులోనే ఈ ముఠాలు 17 మంది రైతులను కాల్చి చంపాయి. కాల్పుల్లో మరో ఐదుగురు గాయపడ్డారు. "గోరోన్ సమాయే కమ్యూనిటీలో 17 మంది రైతులు సాయుధుల దాడుల్లో హత్యకు గురైనట్లు ఈ ఉదయమే నాకు సమాచారం అందింది" అని దోసరా చెప్పారు. అరాచక పద్ధతులలో రైతులపై పన్నులు విధించి వాటిని చెల్లించమని ఒత్తిడి చేస్తున్నారు. చెల్లించకపోతే హత్యలు చేస్తున్నారు. జంఫారా రాష్ట్రవ్యాప్తంగా రైతులపై పదే పదే దాడులు జరుగుతున్నాయని, వ్యవసాయ కార్యకలాపాలను అడ్డుకునే నీచమైన ఉద్దేశంతోనే ఈ దాడులు చేస్తున్నారని అన్నారు.గ్రామంలో మరణించిన 17 మంది రైతులకు అంత్యక్రియలు నిర్వహించినట్లు గ్రామ కమ్యూనిటీ నాయకుడు అబూ బకర్ జబ్రా చెప్పారు. ఈ దాడిలో గాయపడిన ఐదుగురు రైతులలో ముగ్గురి పరిస్థితి ప్రమాదకరంగా ఉందని చెప్పారు. తమ గ్రామంలో రైతులకు భద్రతను మరింతగా పెంచాలని అధికారులను కోరామని చెప్పారు. గోరోన్ సమాయే గ్రామ నివాసి మన్సిర్ మహ్మద్ కూడా ఈ దాడులను ధృవీకరించారు. దుండగులు తమ ఆయుధాలను దాచిపెట్టి సందర్శకుల పేరుతో తిరిగారని, ఆ తర్వాత ఆయుధాలను బయటకు తీసి దాడులు చేశారని చెప్పారు. దక్షిణ ఆఫ్రికాలో అత్యధిక జనాభాగల ఈ దేశంలో వ్యవసాయ సీజన్‌లో వర్షాలు కురవడం ప్రారంభమైన తర్వాత కూడా సాయుధ ముఠాల భయం వల్ల రైతులు తమ భూములను వదలి పారిపోతున్నారు.

# బిజెపి, బిఆర్ఎస్ నాటకాలు

(మొదటి పేజీ తరువాయి)


వారందరికీ ఇదే విధంగా బహిరంగ సభ ఏర్పాటు చేసి నియామక పత్రాలు అందిస్తామని ప్రకటించారు. సింగరేణి యాజమాన్యాన్ని ఈ దిశగా సిద్ధంగా ఉండాలని ఇప్పటికే ఆదేశించామని అన్నారు. సింగరేణిని ఏ శక్తుల చేతుల్లోకీ వెళ్లనివ్వం!ప్రజా ప్రభుత్వం అధికారాన్ని అడ్డం పెట్టుకొని సింగరేణిని దోపిడీ చేసే ప్రభుత్వం కాదని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. సింగరేణి సంస్థను గత పదేళ్లుగా దోపిడీ చేసిన బీఆర్ఎస్ నాయకులు, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వంపై అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తీవ్రంగా ధ్వజమెత్తారు. పొద్దున లేస్తే సాయంత్రం వరకు రోజుకో కట్టుకథ అల్లుతూ, సొంత మీడియా సంస్థల ద్వారా అసత్యాలను ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. సింగరేణిని కాంగ్రెస్ ప్రభుత్వం దోపిడీ చేస్తోంది' అంటూ బిఆర్ఎస్ నేత హరీశ్ రావు చేస్తున్న ఆరోపణలను డిప్యూటీ సిఎం తీవ్రంగా ఖండించారు. దొంగే దొంగ అన్నట్లుగా బీఆర్ఎస్, బీజేపీ నాటకాలు ఆడుతున్నాయని అన్నారు. సింగరేణిలో బొగ్గు కదలాలన్నా అత్యంత పటిష్టమైన నిఘా వ్యవస్థ ఉందని, అలాంటి సంస్థపై అబండాలు వేస్తూ నిర్వీర్యం చేయాలని చూస్తున్నారని, సింగరేణి పరిధిలోని కోల్ బ్లాకులను తమకు అనుకూలమైన ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టాలనే దుర్మార్గపు కుట్రతోనే బిఆర్ఎస్‌నేతలు మాట్లాడుతున్నారు. హరీశ్ రావు ఒక లేఖ రాస్తారు. మరో వైపు ఢిల్లీ నుంచి కిషన్‌రెడ్డి స్పందిస్తారు. వీరిద్దరి మధ్య ఉన్న అంతర్గత బంధాన్ని ఎండగట్టారు. పదేళ్లు మంత్రిగా చేసిన హరీష్ రావు తన మంత్రి హోదాను మరిచిపోయి రోజుకో అబద్ధాన్ని ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. గత ప్రభుత్వాల నిర్వాకం, కొందరు నేతల స్వార్థ ప్రయోజనాల వల్ల తెలంగాణకు తలమానికమైన సింగరేణి సంస్థకు వేల కోట్ల రూపాయల నష్టం వాటిల్లిందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క విమర్శించారు. సింగరేణి సింగరేణి పరిధిలోని బొగ్గు బ్లాకుల వేలంలో పాల్గొనకపోవడం వల్ల సంస్థకు జరిగిన నష్టాన్ని గణాంకాలతో ఆయన లెక్కలతో సహా వివరించారు. ఆ బ్లాకులను తిరిగి సింగరేణికే కేటాయించాలని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రిగా ఉన్న కిషన్ రెడ్డిని నేను రాతపూర్వకంగా కోరాను. తెలంగాణ ప్రతినిధిగా ఉన్నా.. ఆ బ్లాకులను సింగరేణికి ఎందుకు ఇప్పించలేకపోతున్నారు?' అని ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్క తీవ్ర స్వరంతో ప్రశ్నించారు. గత బీఆర్ఎస్ నాయకత్వం, బీజేపీ ఇద్దరూ కలిసి సింగరేణిపై కుట్రలు చేస్తూ, ఇప్పుడు దొంగే దొంగ అన్నట్టుగా నాటకాలు ఆడుతున్నారని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఈ కుట్రలను చూస్తూ ఊరుకోదని, సింగరేణి ఆస్తులను, వనరులను నిటారుగా నిలబడి కాపాడుతామని నిండు సభలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రకటించారుసింగరేణి సంస్థను కాపాడుకోవడమే కాకుండా, కార్మికుల న్యాయబద్ధమైన హక్కులన్నింటినీ ఈ ప్రజా ప్రభుత్వం నిలబెడుతుందని ఉప ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

**సింగరేణిలో మెడికల్ ఇన్వాలిడేషన్ అనేది కార్మికుల హక్కు**

డిపెండెంట్ ఉద్యోగాలకు సంబంధించిన సమస్యలపై తక్షణమే నిర్ణయం తీసుకుని, ఈరోజు 335 మందికి ఉద్యోగ నియామక పత్రాలను అందించామని చెప్పారు. భవిష్యత్తులోనూ ఈ ప్రక్రియ కొనసాగుతుందని పేర్కొన్నారు.సింగరేణిలో మెడికల్ ఇన్వాలిడేషన్ అనేది కార్మికుల హక్కు అని, దాన్ని కాదనడానికి ఎవరికీ వీల్లేదని స్పష్టం చేశారు. దీనిపై జరుగుతున్న తప్పుడు ప్రచారాలను అరికట్టడానికి, ఈ ప్రాంత మంత్రులు, శాసనసభ్యులతో సమావేశం ఏర్పాటు చేసి, కార్మికుల అసలు సమస్యలను చర్చించినట్లు తెలిపారు. తక్షణమే న్యాయబద్ధంగా మెడికల్ ఇన్వాలిడేషన్ బోర్డును ప్రారంభించి, చర్యలు తీసుకోవాలని యాజమాన్యానికి ఆదేశాలు జారీ చేసినట్లు డిప్యూటీ సీఎం ప్రకటించారు.సింగరేణిలో దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న 'మారు పేర్ల' సమస్యపై లోతుగా అధ్యయనం చేసి, భవిష్యత్తులో ఎలాంటి లీగల్ ఇష్యూస్ రాకుండా ఉండేందుకు ఒక ఉన్నత స్థాయి కమిటీని నియమిస్తున్నట్లు ఉప ముఖ్యమంత్రి తెలిపారు. ఈ కమిటీలో కేవలం అధికారులే కాకుండా, కార్మిక యూనియన్లకు సంబంధించిన ప్రతినిధులను కూడా భాగస్వామ్యం చేయాలని నిర్ణయించినట్లు డిప్యూటీ సీఎం ప్రకటించారు. ఈ కమిటీ కూలంకషంగా అధ్యయనం చేసి నివేదిక సమర్పించిన తర్వాత, రాష్ట్ర ప్రభుత్వం దీనిపై ఖచ్చితంగా ఒక న్యాయబద్ధమైన నిర్ణయం తీసుకుంటుందని స్పష్టం చేశారు. రాష్ట్ర ఐటి, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్స్, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు మాట్లాడుతూ సింగరేణి సంస్థను, తెలంగాణ నల్ల బంగారాన్ని కాపాడటానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. మెడికల్ అన్ ఫిట్ విషయంలో పారదర్శకంగా ముందుకు వెళతామని, ఒప్పంద, పొరుగు సేవల సిబ్బందికి 40 లక్షల రూపాయల బీమా సౌకర్యం కల్పించడం జరుగుతుందని వివరించారు. సింగరేణి సంస్థ లాభాలలో ఒప్పంద కార్మికులకు కూడా వాటా అందించినట్లు తెలిపారు. మంచిర్యాల శాసనసభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు మాట్లాడుతూ నియామక పత్రాలు అందుకున్న 335 మందిలో 117 మంది మంచిర్యాల జిల్లాకు చెందిన వారు కావడం సంతోషకరమన్నారు. సింగరేణిలో మారుపేరు సమస్య పరిష్కారానికి ఒక కమిటీని నియమించి బాధితులకు న్యాయం చేస్తామని, పదవీ విరమణ పొందిన కార్మికులకు తెల్ల రేషన్ కార్డులు అందించామని చెప్పారు. ఖాళీగా ఉన్న క్వార్టర్లను రిటైర్డ్ కార్మికులకు అందించి ఇందిరమ్మ ఇండ్ల పథకం వర్తింపజేయాలని, ఆదాయపు పన్ను వెసులుబాటు కల్పించాలని, శ్రీరాంపూర్ ప్రాంతంలో అర్హులకు పట్టాలు ఇప్పించాలని కోరారు. బెల్లంపల్లి శాసనసభ్యులు గడ్డం వినోద్ మాట్లాడుతూ 1992లో సింగరేణి సంస్థను 450 కోట్ల రూపాయలకు బిఐఎఫ్ఆర్ క్రిందకు పంపించడాన్ని ఆనాడు గడ్డం వెంకటస్వామి అడ్డుకొని కాపాడారని గుర్తు చేశారు. అనంతరం అర్హులైన సింగరేణి కార్మిక కుటుంబ సభ్యులకు నియామక పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర షెడ్యూల్ తెగలు, గిరిజన, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, రాష్ట్ర రవాణా, వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, పెద్దపల్లి పార్లమెంట్ సభ్యులు గడ్డం వంశీకృష్ణ, శాసనమండలి సభ్యులు దండే విఠల్, జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, శాసనసభ్యులు సత్యనారాయణ, మలోత్ రాందాస్ నాయక్, సింగరేణి కార్మిక సంఘాల ప్రతినిధులు వాసిరెడ్డి సీతారామయ్య, జనక్ ప్రసాద్, ఇతర అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు

# పరీక్షలు సక్సెస్

(మొదటి పేజీ తరువాయి)



వీటికి ఉంది. అత్యాధునిక రక్షణ సాంకేతికతలో భారత్ సాధించిన పురోగతిని ప్రపంచానికి చాటిచెప్పాయి. ఈ పరీక్షల్లో ప్రధానంగా బహుళ స్థాయి బాలిస్టిక్ మిసైల్ డిఫెన్స్ (బిఎండి) వ్యవస్థను విజయవంతంగా ప్రదర్శించారు. శత్రు క్షిపణులను గుర్తించి, వాటిని గమ్యానికి చేరకముందే అడ్డుకునే సామర్థ్యాన్ని ఈ వ్యవస్థ చూపించింది. పరీక్ష సమయంలో ఇంటర్‌సెప్టర్ క్షిపణులు తమ లక్ష్యాలను అత్యంత ఖచ్చితత్వంతో గుర్తించి విజయవంతంగా ధ్వంసం చేశాయి. ఆధునిక సాంకేతికతతో అభివృద్ధి చేసిన ఈ వ్యవస్థ, మారుతున్న భద్రతా సవాళ్లను ఎదుర్కొనేలా రూపుదిద్దుకుంది.

**నావల్ యాంటీ–షిప్ మిసైల్ తొలి ప్రయోగం సక్సెస్**

మరో కీలక ఘట్టంగా, నావల్ యాంటీషిప్ మిస్సైల్‌మీడియం రేంజ్ (ఎన్ఎఎస్ఎం–ఎంఆర్) తొలి ఫ్లైట్ టెస్ట్‌ను కూడా డిఆర్‌డిఒ విజయవంతంగా నిర్వహించింది. ఈ క్షిపణి మధ్యస్థాయి దూరంలో శత్రు నౌకలను లక్ష్యంగా చేసుకుని సమర్థవంతంగా దాడి చేయగల సామర్థ్యాన్ని కలిగి ఉంటుంది. భారత నౌకాదళానికి ఇది అత్యాధునిక దాడి సామర్థ్యాన్ని అందించనుందని రక్షణ నిపుణులు భావిస్తున్నారు. సముద్ర భద్రతను మరింత బలపరచడంలో ఈ మిసైల్ కీలక పాత్ర పోషించనుంది. దేశ సాంకేతికతకు పెద్ద పీట వేసిన ఈ రక్షణ వ్యవస్థలన్నింటినీ స్వదేశీ సాంకేతికతతోనే తయారు చేశారు. ఈ విజయవంతమైన పరీక్షల ద్వారా భారత్ తన వ్యూహాత్మక రక్షణ సామర్థ్యాన్ని మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లిందని రక్షణ శాఖ స్పష్టం చేసింది. రెండు రోజుల్లో మూడు వరుస పరీక్షలు నిర్వహించడం ద్వారా డిఆర్‌డిఒ తన సాంకేతిక సామర్థ్యాన్ని నిరూపించిందని తెలిపింది. బహుళ స్థాయి రక్షణ వ్యవస్థలతో పాటు సముద్ర లక్ష్యాలను ఎదుర్కొనే సామర్థ్యాన్ని కూడా ఒకేసారి పరీక్షించడం విశేషంగా నిలిచిందని పేర్కొంది. భారత్ ఇప్పుడు ఇంటర్‌కాంటినెంటల్ బాలిస్టిక్ మిసైల్ (ఐసిబిఎం) స్థాయి ముప్పులను ఎదుర్కొనే సామర్థ్యం ఉన్న దేశాల సరసన చేరిందని తెలిపింది. ఈ విజయాలపై కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ డిఆర్‌డిఒ బృందాన్ని అభినందించారు. దేశ భద్రతను మరింత బలోపేతం చేసే దిశగా ఈ పరీక్షలు కీలక మైలురాయిగా నిలిచాయని ఆయన పేర్కొన్నారు. అత్యాధునిక సాంకేతికతతో అభివృద్ధి చేసిన వ్యవస్థలు భవిష్యత్ ముప్పులను ఎదుర్కొనేందుకు భారత్‌ను మరింత సిద్ధంగా ఉంచుతాయని ఆయన అన్నారు. బహుళ స్థాయి బాలిస్టిక్ మిసైల్ డిఫెన్స్ సామర్థ్యం విజయవంతంగా ప్రదర్శించినట్లు ఆయన వివరించారు.

# పోరుకు మద్దతు

(మొదటి పేజీ తరువాయి)

ఈ ఉమ్మడి రాజకీయ పోరాటాన్ని ముందుకు తీసుకెళ్లే విషయంలో వారితో సహకారం అవసరమని సిపిఐ(ఎం) భావిస్తోంది' అని ఆయన పేర్కొన్నారు. అదే సమయంలో, కేవలం రాజకీయ పోరాటం మాత్రమే సరిపోదని, సాంస్కృతిక, సైద్ధాంతిక రంగాలతో పాటు ఆర్ఎస్ఎస్ తన ఎజెండాను ముందుకు తీసుకెళ్లే అన్ని రంగాల్లోనూ పోరాటం సాగించాలని ఆయన సూచించారు. అందువల్ల, ఈ విస్తృత రాజకీయ, సైద్ధాంతిక పోరాటాన్ని కొనసాగిస్తూనే, 'ఇండియా' కూటమికి సంబంధించిన పోరాటాలు, కార్యక్రమాలతో ముందుకు సాగడానికి సిపిఐ(ఎం) కట్టుబడి ఉందని చెప్పారు. ఇటీవల జరిగిన కూటమి సమావేశంలో డిఎంకె 'ఇండియా' కూటమికి దూరమవుతుందన్న అంశంపై చర్చ జరిగిందా అని అడిగినప్పుడు, రాహుల్ గాంధీ వైఖరి అంత స్పష్టంగా లేదని బేబీ అన్నారు. డిఎంకె నేతృత్వంలోని కూటమిలో భాగంగా తమిళనాడులో కాంగ్రెస్ ఐదు అసెంబ్లీ స్థానాలను దక్కించుకుందని ఆయన గుర్తుచేశారు. అదేవిధంగా, అసెంబ్లీ ఎన్నికలకు ముందే రాజ్యసభ స్థానం విషయంలో కాంగ్రెస్ నాయకత్వం డిఎంకెతో చర్చలు జరిపిందని ఆయన పేర్కొన్నారు. 'రాజ్యసభ సభ్యుడిని ఎన్నుకోవడానికి కాంగ్రెస్‌కు అసెంబ్లీలో సొంతంగా తగినంత బలం లేదు. అందులో ఎలాంటి సందేహం లేదు. అయినప్పటికీ, డిఎంకెతో కలిసి ఉండటం ద్వారా అది ఒక రాజ్యసభ స్థానాన్ని దక్కించుకుంది. డిఎంకె నేతృత్వంలోని కూటమిలో భాగంగా పోటీ చేయడం వల్ల అసెంబ్లీ స్థానాలను కూడా గెలుచుకుంది అని ఆయన అన్నారు. అసెంబ్లీ ఎన్నికల తదనంతర రాజకీయ పరిణామాలను ప్రస్తావిస్తూ, టివికె ప్రభుత్వం ఏర్పాటు చేసే అవకాశం వచ్చినప్పుడు, అత్యధిక స్థానాలు గెలుచుకున్న పార్టీగా టివికెను ప్రభుత్వం ఏర్పాటు చేయడానికి ఆహ్వానించాలనే వైఖరిని సిపిఐ(ఎం), సిపిఐ తీసుకున్నాయని ఆయన చెప్పారు. డిఎంకె నాయకత్వానికి సమాచారం అందించిన తర్వాతే సిపిఐ(ఎం), సిపిఐ, విసికె ఆ వైఖరిని తీసుకున్నాయని, అయితే, కాంగ్రెస్ మాత్రం డిఎంకెకు ఏమాత్రం చెప్పకుండా భిన్నంగా వ్యవహరించిందన్నారు. మంత్రి పదవులను ఆశించడమే దీనికి కారణమని, కాంగ్రెస్ నుంచి ఇద్దరు మంత్రులు ఉన్నారన్నారు. డిఎంకె కూటమిలో భాగంగా సాధించిన ఓట్లతో ఎన్నికవడం వల్లే వారు మంత్రులు కాగలిగారన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారం పట్ల అత్యాస ప్రదర్శిస్తోందని ఆయన ఆరోపించారు. 'ఓవీ విజయన్ రాసిన 'ధర్మపురాణం' నవలలో కనిపించే తరహా దురాశే ఇప్పుడు కాంగ్రెస్‌లో కనిపిస్తోంది. అటువంటి వైఖరి ప్రజాస్వామ్య సంస్కృతికి తగదు. నేను చెప్పదలచుకున్నది ఇంతే' అని బేబీ అన్నారు.

# రోడ్డా... చెరువా?

(మొదటి పేజీ తరువాయి)

నుంచి సాయంత్రం వరకు నగరంలోని అనేక ప్రాంతాల్లో భారీ నుంచి అతి భారీ వర్షం కురిసింది. మణికొండ, నార్సింగి, లంగర్‌హౌస్, అత్తాపూర్, మియాపూర్, చందానగర్, లింగంపల్లి, గచ్చిబౌలి, మాదాపూర్, కొండాపూర్, రాయదుర్గం, మహేశ్వరం, తుక్కుగూడ, పహాడీషరీఫ్, జూబ్లీ హిల్స్, బంజారాహిల్స్, అమీర్‌పేట్, యూసుఫ్‌గూడ, సనత్ నగర్, ఎర్రగడ్డ, బోరబండ, కూకట్‌పల్లి, కెపిహెచ్‌బి, బాచుపల్లి, ప్రగతినగర్ తదితర ప్రాంతాల్లో వర్షం జోరుగా కురిసింది. ముషీరాబాద్, ఆర్‌టిసి క్రాస్‌రోడ్, చిక్కడపల్లి, బాగ్‌లింగంపల్లి, కవాడిగూడ, గాంధీనగర్, అంబర్‌పేట్, బర్కత్‌పుర, కాచిగూడ ప్రాంతాల్లోనూ మోస్తరు నుంచి భారీ వర్షం నమోదైంది.

**శంషాబాద్‌లో చెరువును తలపించిన రహదారి**

భారీ వర్షానికి శంషాబాద్ ప్రధాన రహదారిపై పెద్ద ఎత్తున వర్షపు నీరు చేరి చెరువును తలపించింది. రహదారిపై నీరు నిలవడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. పలుచోట్ల ట్రాఫిక్ రద్దీ ఏర్పడి వాహనదారులు గంటల తరబడి ఇబ్బందులు పడ్డారు. కొన్ని వ్యాపార సముదాయాలు, షాపులు, సెల్లార్లలోకి వరద నీరు చేరడంతో వ్యాపారులు ఆందోళన చెందారు. సమాచారం అందుకున్న శంషాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ బృందం ఘటనాస్థలికి చేరుకుని మోటార్ల సహాయంతో దాదాపు మూడు గంటల పాటు శ్రమించి నిల్వ నీటిని తొలగించింది. షాపుల్లోకి నీరు చేరకుండా చర్యలు చేపట్టారు. షాద్‌నగర్ వద్ద బెంగళూరుహైదరాబాద్ జాతీయ రహదారిపై కూడా భారీగా నీరు నిలవడంతో వాహనాల రాకపోకలు నెమ్మదిగా సాగాయి.

**క్షేత్రస్థాయిలో డిజిపి, సిఎంసి కమిషనర్లు..**

రాష్ట్ర డిజిపి సి.వి.ఆనంద్, సిఎంసి కమిషనర్ డాక్టర్ జి.సృజనతో కలిసి నగరంలోని వర్ష ప్రభావిత ప్రాంతాలను సందర్శించి పరిస్థితిని సమీక్షించారు. మల్కంపేట చెరువు, టోలిచౌకి ప్రాంతాల్లో పర్యటించి సహాయక చర్యలను పరిశీలించారు. సైబరాబాద్ పోలీసు కమిషనర్ డాక్టర్ రమేష్ తరఫున స్థానిక అధికారులతో సమన్వయం కొనసాగిస్తూ ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టాలని సూచనలు జారీ చేశారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అవసరమైతే మాత్రమే బయటకు రావాలని అధికారులు సూచించారు. నగరంలో వర్షాలు కొనసాగుతున్న నేపథ్యంలో ప్రజలు విద్యుత్ తీగలు, నీటిమునిగిన ప్రాంతాల పట్ల అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు.

**సంబంధిత శాఖలు సమన్వయంతో పని చేయాలి: సిఎం**

భారీ వర్షాల సూచన నేపథ్యంలో హైదరాబాద్ కోర్ అర్బన్ రీజియన్ (క్యూర్) పరిధిలోని అధికార యంత్రాంగం హైఅలర్ట్‌గా ఉండాలని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఉన్నతాధికారులను ఆదేశించారు. భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ సూచించినందున పోలీస్, ట్రాఫిక్ పోలీస్, మున్సిపల్, హైడ్రా, విద్యుత్, వాటర్ బోర్డ్, ఇతర సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని సిఎం సూచించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డిజిపి, కోర్ అర్బన్ రీజియన్ ప్రత్యేక కార్యదర్శితో సహా సీనియర్ అధికారులు యుద్ధ ప్రాతిపదికన పరిస్థితిని సమీక్షించి అవసరమైన చర్యలు చేపట్టాలని రేవంత్ రెడ్డి ఆదేశించారు. వర్షాలు కురిసిన సందర్భాల్లో నగరవాసులకు ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన చర్యలు సత్వరం తీసుకోవాలని చెప్పారు. వర్షాలపై వాతావరణ శాఖ సూచనల ఆధారంగా ముందస్తు ప్రణాళికతో రోడ్లపై నీరు నిలిచే ప్రాంతాలు, సమస్యాత్మక ప్రాంతాల్లో ప్రత్యేకంగా బృందాలను మోహరించి అవసరమైన చర్యలు చేపట్టాలని సిఎం ఆదేశించారు.

**రాబోయే వారం రోజులు రాష్ట్రంలో భారీ వర్షాలు**

రాష్ట్రంలో రానున్న వారం రోజుల పాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. కొన్ని జిల్లాల్లో భారీ వర్షాలు, ఉరుములు, మెరుపులతో కూడిన ఈదురుగాలులు వీచే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మూడు రోజుల అనంతరం ఉష్ణోగ్రతలు 2 నుంచి 3 డిగ్రీల సెల్సియస్ వరకు తగ్గే అవకాశముందన్నారు. ఆదివారం ఉదయం వరకు నల్లగొండ, సూర్యాపేట, రంగారెడ్డి, వనపర్తి, నారాయణపేట జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. అలాగే కోమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, జనగాం, సిద్ధిపేట, యాదాద్రి భువనగిరి, హైదరాబాద్, మేడ్చల్‌మల్కాజిగిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్, జోగులాంబ గద్వాల జిల్లాల్లో గంటకు 4050 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని హెచ్చరించారు. ఆదివారం, సోమవారం, మంగళవారం వరకు మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట జిల్లాల్లో కూడా ఇదే పరిస్థితి కొనసాతుందన్నారు. మంగళవారం నుంచి గురువారం వరకు రాష్ట్రంలోని అనేక జిల్లాల్లో గంటకు 30 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందన్నారు. బుధవారం, గురువారం రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు జాగ్రత్తలు పాటించాలని అధికారులు సూచించారు. గురువారం నుంచి శనివారం వరకు రాష్ట్రంలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కొన్ని ప్రాంతాల్లో కురుస్తాయన్నారు.

# అందుకే కుల్దీప్ యాదవ్‌ను పక్కనపెట్టాం

## శుభ్‌మన్ గిల్

మూడు వన్డేల సిరీస్‌లో భాగంగా అఫ్గానిస్థాన్‌తో జరుగుతున్న తొలి వన్డేలో టీమిండియా టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకుంది. ధర్మశాల వేదికగా జరుగుతున్న ఈ మ్యాచ్ వర్షం కారణంగా 4 గంటలు ఆలస్యంగా ప్రారంభమైంది. దాంతో అంపైర్లు మ్యాచ్‌ను 25 ఓవర్లకు కుదించారు.

**ప్రయోగాలు చేస్తాం..**

ఇక వాతావరణ పరిస్థితులతోనే బౌలింగ్ ఎంచుకున్నట్లు టీమిండియా వన్డే కెప్టెన్ శుభ్‌మన్ గిల్ తెలిపాడు. 'మేం ముందుగా బౌలింగ్ చేస్తాం. వాతావరణం కొద్దిగా మేఘావృతమై ఉంది. కాబట్టి బౌలర్లకు కొంతవరకు సహకారం లభించవచ్చు. పిచ్ చూడటానికి బాగుంది. బ్యాటింగ్‌కు అనుకూలించే వికెట్‌లా కనిపిస్తోంది. అయితే ప్రారంభంలో పేసర్లకు కాస్త స్వింగ్ లభించే అవకాశం ఉంది. రాబోయే వరల్డ్ కప్‌కు ముందు మేం దాదాపు 15–20 వన్డేలు ఆడబోతున్నాం. మాకు ఏ కాంబినేషన్ సరిగ్గా సరిపోతుందో చూసేందుకు విభిన్న ప్రయత్నాలు చేస్తున్నాం. ఈ మ్యాచ్‌లో ఇద్దరు ఆటగాళ్లు అరంగేట్రం చేస్తున్నారు. గుర్నూర్ బ్రార్, హర్ష్ దూబె కెరీర్‌లో తమ ఫస్ట్ మ్యాచ్ ఆడుతున్నారు. టీమ్ కాంబినేషన్‌లో భాగంగా యశస్వి జైస్వాల్, ప్రిన్స్ యాదవ్, కుల్దీప్ యాదవ్‌లకు ఈ మ్యాచ్ ఆడే అవకాశం దక్కలేదు.'అని శుభ్‌మన్ గిల్ చెప్పుకొచ్చాడు. కుల్దీప్ యాదవ్‌ను పక్కనపెట్టి గుర్నూర్ బ్రార్‌కు అవకాశం కల్పించారు.



**బౌలింగ్ ఎంచుకునేవాళ్లం..**

మరోవైపు టాస్ గెలిస్తే తాము కూడా బౌలింగ్ ఎంచుకునేవాళ్లమని అఫ్గానిస్థాన్ కెప్టెన్ హష్మతుల్లా షాహిదీ అన్నాడు. 'టాస్ గెలిస్తే ముందుగా బౌలింగ్ చేయాలనుకున్నాం. కానీ, టాస్ మన చేతుల్లో ఉండదు కదా.. మ్యాచ్ ప్రారంభం నుంచే మేం మంచి ప్రదర్శన చేయాల్సిన అవసరం ఉంది. గత కొద్దికాలంగా మేం చాలా బాగా రాణిస్తున్నాం. అయితే భారత్‌ను వారి సొంత గడ్డపై ఎదుర్కోవడం మాకు ఇదే తొలిసారి. కాబట్టి ఇది ఇరు జట్లకు గట్టి పోటీనిచ్చే పోరు అవుతుంది. మేం ఈ సవాలుకు సిద్ధంగా ఉన్నాం. ఎంతో ఉత్సాహంగా ఉన్నాం. ఇక్కడ బాగా రాణిస్తామని ఆశిస్తున్నాం. మేం ముగ్గురు సీమర్లు, ముగ్గురు స్పిన్నర్ల కాంబినేషన్‌తో బరిలోకి దిగుతున్నాం.' హష్మతుల్లా షాహిదీ చెప్పుకొచ్చాడు.

**తుది జట్లు:**

**అఫ్గనిస్తాన్:** ఇబ్రహీం జద్రాన్, రహ్మానుల్లా గుర్బాజ్ (వికెట్ కీపర్), సెదిఖుల్లా అటల్, రహ్మత్ షా, హష్మతుల్లా షాహిదీ (కెప్టెన్), అజ్మతుల్లా ఒమర్జాయ్, మహ్మద్ నబీ, రషీద్ ఖాన్, మహ్మద్ సలీమ్ సఫీ, ఏఎమ్ గజన్ఫర్, జియా ఉర్ రహ్మాన్ షరీఫీ.

**భారత్:** శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), రోహిత్ శర్మ, కేఎల్ రాహుల్, శ్రేయస్ అయ్యర్, ఇషాన్ కిషన్ (వికెట్ కీపర్), వాషింగ్టన్ సుందర్, నితీష్ కుమార్ రెడ్డి, హర్ష్ దూబే, గుర్నూర్ బ్రార్, అర్ష్‌దీప్ సింగ్, ప్రసిద్ధ్ కృష్ణ.

## భారత్ టార్గెట్ 195

భారత్‌తో ధర్మశాలలో జరుగుతున్న తొలి వన్డేలో అఫ్గానిస్థాన్ బ్యాటింగ్ ముగిసింది. వర్షం కారణంగా ఆటను 25 ఓవర్లకు కుదించిన సంగతి తెలిసిందే. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన అఫ్గాన్.. 24.5 ఓవర్లలో 194 పరుగులకు ఆలౌటైంది. భారత్‌కు 195 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది. ఒక దశలో 26 పరుగులకే అఫ్గాన్ మూడు వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఈ క్రమంలో ఓపెనర్ రహ్మానుల్లా గుర్బాజ్ (102; 51 బంతుల్లో 8 ఫోర్లు, 8 సిక్సులు) సూపర్ సెంచరీతో జట్టును ఆదుకున్నాడు.

గుర్బాజ్ మినహా ఇతర బ్యాటర్లు ఎవరూ రాణించలేదు. హష్మతుల్లా షాహిది(27), అజ్మతుల్లా ఒమర్జాయ్(26) మినహా మిగతా బ్యాటర్లంతా సింగిల్ డిజిట్‌కే ఔటయ్యారు. భారత బౌలర్ల ధాటికి వరుసగా పెవిలియన్ బాట పట్టారు. అరంగేట్రంలోనే హర్ష్ దూబె, గుర్నూర్ బ్రార్ తలో 3 వికెట్లతో చెలరేగారు. అర్షదీప్ సింగ్ 2, నితీశ్ కుమార్ రెడ్డి 2 వికెట్లు తీశారు.

# ఆస్ట్రేలియన్ ఓపెన్ సెమీస్‌లో పివి సింధు ఓటమి

**సిడ్నీ:** ఆస్ట్రేలియన్ బ్యాడ్మింటన్ ఓపెన్ టోర్నీలో హైదరాబాదీ ప్లేయర్ పీవీ సింధు శనివారం సెమీఫైనల్లో ఓటమి చవి చూసింది. జపాన్కు చెందిన మేటి ప్లేయర్ అకేన్ యమగుచి చేతిలో ఆమె వరుస గేమ్స్‌లో పరాజయాన్ని ఎదుర్కొన్నది. 20–22, 12–21 స్కోరుతో యమగుచి విజయం సాధించింది. మూడో నెంబర్ ర్యాంక్‌తో జపనీస్ ప్లేయర్ ఈ టోర్నీలో ఆడారు. కేవలం 43 నిమిషాల్లోనే ఈ మ్యాచ్ ముగిసిపోయింది. సింధు ఓటమితో బీడబ్ల్యూఎఫ్ వరల్ టూర్ సూపర్ 500 టోర్నమెంట్‌లో భారతీయ క్రీడాకారుల ప్రాతినిధ్యం ముగిసింది.




ఫస్ట్ గేమ్‌లో జపాన్ ప్లేయర్‌కు ధీటుగా సింధు ఆడింది. షాట్‌కు షాట్ కొట్టింది. ఇద్దరు ఆటగాళ్లు ఓ దశలో ఆరు వరుస పాయింట్లను సాధించుకున్నారు. కానీ గేమ్ పాయింట్ వద్ద సింధు తడబడింది. ఓపెనింగ్ గేమ్‌ను యమగుచి చేజిక్కించుకున్నది. ఇక సెకండ్ గేమ్‌లో సింధు ఆటతీరు పూర్తిగా మారిపోయింది. యమగుచి చాలా ఈజీగా దూసుకెళ్లింది. ఓ దశలో 13–6 పాయింట్లు సాధించింది. ఎటువంటి ఇబ్బందులు లేకుండానే యమగుచి మ్యాచ్‌ను సొంతం చేసుకున్నది. ఇక సింగిల్స్ ఫైనల్లో థాయ్‌లాండ్ క్రీడాకారిణి పోర్న్‌పావీ చోచువాంగ్‌తో యమగుచి తలపడనున్నది. ఇటీవల కాలం యమగుచి చేతిలో సింధు వరుసగా ఓటమి ఎదుర్కొన్నది. ఆరు మ్యాచుల్లో అయిదు సార్లు ఓడంది. కానీ ఓవరాల్‌గా 1513 తేడాతో సింధు లీడింగ్‌లో ఉంది.




## బులియన్ మార్కెట్

# దిగివస్తున్న బంగారం ధర

భారతదేశంలో పండుగలు, పెళ్లిళ్ల సీజన్ కారణంగా కొంత సానుకూలత ఉన్నప్పటికీ, ప్రపంచ వ్యాప్తంగా బులియన్ మార్కెట్ నష్టాలను చవిచూస్తున్నది. యుద్ధం ముగిసినట్టు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన ప్రకటన అటు షేర్ మార్కెట్‌పై, ఇటు బులియన్ మార్కెట్‌పై సమానంగా ప్రభావం చూపింది. అదే సమయంలో వడ్డీ రేట్లపై అమెరికా కేంద్ర బ్యాంక్ 'ఫెడరల్ రిజర్వ్' ఆచితూచి వ్యవహరించడంతో, వడ్డీ రేట్లను మరింత కాలం పాటు గరిష్ట స్థాయిలోనే ఉంచుతుందనే అంచనాలు వెలువడుతున్నాయి. దీనితో మధ్య, నాన్‌యీల్డింగ్ అసెట్ అయిన పసిడి ధరలు వరుసగా



రెండో వారం కూడా నష్టాల బాట పట్టాయి. వచ్చే వారం జరగబోయే కీలకమైన ఫెడ్ పాలసీ సమావేశానికి ముందు ఇన్వెస్టర్లు అప్రమత్తంగా వ్యవహరిస్తుండటమే ఇందుకు ప్రధాన కారణం. వారంతంలో స్పాట్ గోల్డ్ స్వల్పంగా 0.3 శాతం కోలుకుని ఔన్సుకు 4,227.17 డాలర్ల వద్ద ట్రేడైనప్పటికీ, వారం పరంగా చూస్తే ఏకంగా 2.3 శాతం నష్టాన్ని నమోదు చేసింది. అలాగే యూఎస్ గోల్డ్ ఫ్యూచర్స్ 3 శాతం పెరిగి 4,238.80 డాలర్ల వద్ద ముగిశాయి. సాధారణంగా మార్కెట్లో ద్రవ్యోల్బణం పెరిగినప్పుడు దానికి రక్షణగా ఇన్వెస్టర్లు బంగారంపై పెట్టుబడులు పెడుతుంటారు. కానీ, ద్రవ్యోల్బణాన్ని అదుపు చేయడానికి కేంద్ర బ్యాంకులు వడ్డీ రేట్లను పెంచినప్పుడు లేదా వాటిని గరిష్ట స్థాయిలోనే ఉంచినప్పుడు.. ఎటువంటి వడ్డీ లేదా లాభం ఇవ్వని బంగారంపై పెట్టుబడులు పెట్టడానికి పెద్దగా ఆసక్తి చూపరు. మే నెలలో అమెరికా ప్రొడ్యూసర్ ధరలు అంచనాల కంటే ఎక్కువగా పెరగడం, కన్జూమర్ ఇన్‌ఫ్లేషన్ 4 శాతానికిపైగా చేరడంతో.. రాబోయే డిసెంబర్ నాటికి ఫెడ్ వడ్డీ రేట్లు పెంచే అవకాశం 57 శాతం ఉందంటూ సిఎంఇ ఫెడ్‌వాచ్ టూల్ అంచనా వేస్తోంది. ఇలావుంటే, ప్రముఖ గ్లోబల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ సంస్థ 'యుబిఎస్' బంగారం ధరలపై తన అంచనాలను తగ్గించింది. ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్ల కోతను మరింత ఆలస్యం చేసే అవకాశం ఉన్నందున, స్వల్ప కాలంలో పసిడి ధరలు మరింత ఒత్తిడికి లోనై 3,850 డాలర్ల నుండి 4,000 డాలర్ల శ్రేణికి పడిపోవచ్చని హెచ్చరించింది. ఈనెల 16, 17 తేదీల్లో జరగబోయే ఫెడరల్ రిజర్వ్ పాలసీ సమావేశంపైనే ఇప్పుడు మార్కెట్ వర్గాల దృష్టంతా ఉంది. కొత్త చైర్మన్ కెవిన్ వార్ష్ నేతృత్వంలో జరగబోయే ఈ మొదటి సమావేశంలో ప్రస్తుతానికి వడ్డీ రేట్లను స్థిరంగా ఉంచవచ్చని మార్కెట్ భావిస్తోంది. లగ్జరీ వాచీల ధరల పెంపు ఇదిలా ఉంటే, ప్రముఖ లగ్జరీ బ్రాండ్ 'రోలెక్స్' ఈ నెలలో తమ గోల్డ్ వాచీల ధరలను ప్రపంచవ్యాప్తంగా సగటున 5 శాతం మేర పెంచింది. బ్రిటన్, హాంకాంగ్, అమెరికా వంటి ప్రధాన మార్కెట్లలో రోలెక్స్ సంస్థ ఒకే ఏడాదిలో ఇలా రెండోసారి ధరలను పెంచడం చాలా అరుదని మార్కెట్ విశ్లేషకులు చెబుతున్నారు. ఇతర లోహాల ధరలు బంగారం నష్టాల్లో ఉన్నప్పటికీ, ఇతర విలువైన లోహాలైన స్పాట్ సిల్వర్ (వెండి) 1.2 శాతం పెరిగి ఔన్సుకు 68.14 డాలర్ల వద్ద, పల్లాడియం 0.7 శాతం పెరిగి 1,281.04 డాలర్ల వద్ద ముగిసి వారంతపు లాభాలను సాధించాయి. అయితే ప్లాటినం మాత్రం 0.8 శాతం క్షీణించి 1,706.90 డాలర్ల వద్ద ముగిసి వారపు నష్టాన్ని చవిచూసింది.

# తగ్గుతున్న చమురు ధరలు

## ట్రంప్ ప్రకటన ప్రభావం

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన ప్రకటన అంతర్జాతీయ క్రూడ్ ఆయిల్ ధరలపై తీవ్ర ప్రభావం చూపాయి. ఇరాన్‌తో యుద్ధం ముగిసిందని ట్రంప్ అధికారికంగా చేసిన ప్రకటనతో గ్లోబల్ మార్కెట్లలో ముడి చమురు ధరలు బ్యారెల్‌కు 90 డాలర్ల కంటే కిందకు పడిపోయాయి. ఇది మన ఆసియా మార్కెట్లకు, ముఖ్యంగా భారత్‌కు సానుకూలంగా మారింది. మార్కెట్లో ఒడిదుడుకులు తగ్గాయని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. ఇరాన్‌తో జరుగుతున్న అంతర్గత చర్చలు అత్యున్నత స్థాయికి చేరుకున్నాయని, దానికి ఆమోదం కూడా లభించిందని ట్రంప్ ప్రకటించారు. అమెరికా సైనిక చర్యల ముప్పు ప్రస్తుతానికి తప్పడంతో ప్రపంచవ్యాప్తంగా ఇన్వెస్టర్లలో నమ్మకం పెరిగింది. అమెరికా మార్కెట్లు అయిన డౌ జోన్స్, ఎస్ అండ్ పి 500, నాస్‌డాక్ గత రెండు నెలల్లోనే అత్యుత్తమ సింగిల్‌డే పర్ఫార్మెన్స్‌ను నమోదు చేశాయి. దీని




ప్రభావం ఆసియా దేశాలపై గట్టిగా పడింది. కొరియా మార్కెట్ 7 శాతానికి పైగా జంప్ చేయగా, జపాన్ నిక్కీ 3.77 శాతం పెరిగింది. చైనా, హాంకాంగ్ మార్కెట్లు కూడా మంచి లాభాలను చూశాయి. అయితే, ఈ డీల్‌పై ఇరాన్ విదేశాంగ శాఖ ప్రతినిధి ఇస్మాయిల్ బఘేయ్ స్పందిస్తూ.. చర్చలు నిజమే అయినప్పటికీ, తాము ఇంకా తుది నిర్ణయానికి రాలేదని చెప్పారు. అమెరికా కొన్ని అదనపు డిమాండ్లు పెడుతోందని ఆరోపించారు. ఎలాంటి ఒత్తిళ్లకు ఇరాన్ లొంగబోదని ఆయన స్పష్టం చేశారు. ఈ ప్రకటన కొంత ఆందోళనకరంగానే ఉన్నప్పటికీ, అణు చర్చలకు 60 రోజులు గడువు ఉన్నట్టు టెహ్రాన్ నుంచి వెలువడిన అధికారిక ప్రకటన ప్రపంచ మార్కెట్లకు ఊరటనిచ్చింది ప్రస్తుతానికి యుద్ధ వాతావరణం చల్లబడటంతో ప్రపంచవ్యాప్తంగా షేర్ మార్కెట్‌లో కొత్త ఉత్సాహం కనిపిస్తున్నది. క్రూడ్ ఆయిల్ ధరలు తగ్గితే, దాని ప్రభావం ఇతరత్రా అన్ని రంగాలపై ఉంటుంది. స్టాక్ మార్కెట్లు మరింత పుంజుకుంటాయి.

### స్టాక్ మార్కెట్లు..

బాంబే స్టాక్ ఎక్ఛ్సేంజ్ (బిఎస్ఇ)లో సెన్సెక్స్ ఈవారం కోలుకుంది. గతవారం చివరిలో చోటు చేసుకున్న విపరీత ధోరణులు, తీవ్రమైన ఆటుపోట్లను తట్టుకొని, తిరిగి లాభాల బాట పట్టింది. ఈనెల 8వ తేదీ సోమవారం 74,243.34 పాయింట్లతో ప్రారంభమైన సెన్సెక్స్, ట్రేడింగ్‌కు చివరి రోజైన 12వ తేదీ శుక్రవారం 75,527.95 పాయింట్ల వద్ద ముగిసింది. తద్వారా, 1,284.61 పాయింట్లు లాభపడింది. అదేవిధంగా జాతీయ స్టాక్ ఎక్ఛ్సేంజ్ (ఎన్ఎస్ఇ)లో నిఫ్టీ 23,366.70 పాయింట్లతో మొదలై, 23,622.90 పాయింట్లతో ముగియడంతో 256.20 పాయింట్లు మెరుగుపడింది.

## అన్ని రంగాల్లో బిసిల వాటా బిసిలకు

# వచ్చేదాకా కేంద్రంపై ఒత్తిడి

బిసి హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు




**ప్రజాపక్షం/ఖిలా వరంగల్ :** అన్నిరంగాల్లో బిసిల వాటా బిసిలకు వచ్చేదాకా కేంద్రంపై ఒత్తిడి పెంచాలని బిసి హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు అన్నారు. శనివారం శివనగర్ తమ్మెర భవన్‌లో ఓర్సు రాజు అధ్యక్షతన జరిగిన బిసి హక్కుల సాధన సమితి వరంగల్ జిల్లా విస్తృత స్థాయి సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న బిసి హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు మాట్లాడుతూ దశాబ్దాల తరబడి బిసిలకు విద్యా ఉద్యోగ చట్ట సభల్లో రిజర్వేషన్లు లేకుండా అగ్ర వర్ణాల పెట్టుబడిదారీ పాలకులు మోసం చేస్తూనే ఉన్నారన్నారు. ఎస్‌సి, ఎస్‌టిలకు వారి జనాభా నిష్పత్తి ప్రకారం రాజ్యాంగబద్ధంగా రిజర్వేషన్లు అందుతుండగా బిసిలకు రిజర్వేషన్ ఇవ్వడానికి కేంద్రంలో అధికారంలో ఉన్న ప్రభుత్వాలు సుముఖంగా లేవన్నారు. 1992లో బిపి సింగ్ ప్రభుత్వం మండల కమిషన్ సిఫారసులను అమలు చేయడానికి ముందుకు రాగానే ప్రత్యక్షంగా బిజెపి పరోక్షంగా కాంగ్రెస్ పార్టీలు బిసి రిజర్వేషన్లను వ్యతిరేకిస్తూ తెగబడ్డారన్నారు. మండల కమిషన్ సిఫారసులకు వ్యతిరేకంగా బిజెపి కమాండల్ ఉద్యమాన్ని ముందుకు తెచ్చి బిసిలను ఐక్యం కాకుండా గందరగోళ పరిచిందన్నారు. పైగా 2019లో అగ్రవర్ణాల పేదల పేరుతో అగ్రవర్ణాలు అడగకుండానే ఎలాంటి గణన చేయకుండానే పది శాతం ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు తీసుకొచ్చి బిజెపి మోడీ ప్రభుత్వం బిసిల వ్యతిరేకతను అగ్రవర్ణాల పక్షపాతిగా రుజువు చేసుకొన్నదన్నారు. అందుకు రాబోయే జనరల్ ఎన్నికలకు ముందుగానే పార్లమెంట్‌లో బిసిలకు బిల్లు తీసుకురావాలని అందుకోసం బిసిలంతా రాజకీయాలకు అతీతంగా ఐక్యంగా బిసి హక్కుల సాధనకు ఉద్యమించాలని అన్నారు. అనంతరం వరంగల్ జిల్లా సిపిఐ పార్టీ కార్యదర్శి, సహాయ కార్యదర్శి షేక్ బాష్మియా, పనాస ప్రసాదులు మాట్లాడుతూ బిసిల హక్కుల సాధన కోసం బిసిలు చేసే ఉద్యమాలకు భారత కమ్యూనిస్టు పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని రాబోయే రోజుల్లో బిసిలు అన్ని రంగాలలో కీలకం కానున్నారని అన్నారు. నూటికి 60 శాతంగా ఉన్న బిసిలు అన్ని రంగాలలో ఇంకా వెనుకబాటుతనానికి గురవుతున్నారు. సకల రంగాలలో బిసిల వాటా బిసిలకు దక్కినప్పుడే సామాజిక న్యాయం లభిస్తుందని అందుకోసం సిపిఐ కట్టుబడి ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సమితి నాయకులు ఆరెల్లి ప్రభాకర్, చంద్రశేఖర్, జగదీష్, బొడ్డుపల్లి సాయిలు, మౌటమ్ కుమారస్వామి, ఓదెల రవి, కొనకటి రమేష్, నూటెంకి మొగిలి, భూస కుమారస్వామి, శైలజ, అడ్డగట్ల యువరాజు, కమ్మల వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

## బూర్జువా రాజకీయాలకు ప్రత్యామ్నాయం

# కమ్యూనిస్టు ఉద్యమమే

ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం

మునుగోడు నియోజకవర్గం నాంపల్లి మండలం రేవెల్లి సర్పంచ్, ఉపసర్పంచ్‌తో సిపిఐలో భారీగా చేరికలు

**ప్రజాపక్షం/నాంపల్లి :** ప్రస్తుత బూర్జువా రాజకీయాలకు వ్యతిరేకంగా ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడుతున్న కమ్యూనిస్టు ఉద్యమాల ద్వారానే పేద, బడుగు, బలహీన వర్గాలకు న్యాయం జరుగుతుందని సిపిఐ జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అన్నారు. మునుగోడు నియోజకవర్గం నాంపల్లి మండలంలోని రేవెల్లి గ్రామంలో శనివారం గ్రామ సర్పంచ్ బట్టు శ్రీనివాస్ యాదవ్, ఉపసర్పంచ్ వంగూరి సాయిలు, ఎనిమిది మంది వార్డు సభ్యులు,గ్రామ ముఖ్య నాయకులు ప్రజా సమస్యలపై సిపిఐ చేస్తున్న పోరాటాలకు ఆకర్షితులై సిపిఐలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి రాజకీయ వ్యవస్థలో అధిక భాగం పార్టీలు ప్రజల కంటే అధికారాన్ని, కార్పొరేట్ ప్రయోజనాలను కాపాడే దిశగా పనిచేస్తున్నాయని విమర్శించారు. ప్రజల జీవన సమస్యలు, రైతాంగ సంక్షేమం, కార్మికుల హక్కులు, నిరుద్యోగం, ధరల పెరుగుదల వంటి అంశాలపై నిరంతరం పోరాటాలు నిర్వహిస్తున్న పార్టీ భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) అని పేర్కొన్నారు. సామాన్య ప్రజల హక్కుల కోసం, సామాజిక న్యాయం కోసం,



సమానత్వ సమాజ నిర్మాణం కోసం కమ్యూనిస్టు ఉద్యమం నిరంతరం పోరాడుతుందని అన్నారు. జిల్లాలో సాగునీటి ప్రాజెక్టుల సాధన కోసం జిల్లాలో సిపిఐ ఆధ్వర్యంలో ఇప్పటికే పలు దఫాలుగా ఆందోళనలు, ధర్నాలు, రాస్తారోకోలు, కలెక్టరేట్ ముట్టడులు నిర్వహించినట్లు గుర్తుచేశారు. ఇప్పటికైన ప్రభుత్వం స్పందించి ఎస్ఎల్‌బిసి సొరంగ మార్గం, డిండి ఎత్తిపోతల, ఉదయసముద్రం ప్రాజెక్టులను నిర్ణీత కాలవ్యవధి పెట్టుకొని ప్రాజెక్టులను వెంటనే పూర్తి చేయాలని, డిండి ఎత్తిపోతల ప్రాజెక్టు నిర్వాసితులకు వెంటనే నష్టపరిహారం చెల్లించాలని, బ్రాహ్మణవెల్లంల ప్రాజెక్టు నుంచి కృష్ణాపురం వరకు కాల్వల ద్వారా చెరువులను నింపి సాగునీటి అవసరాలు తీర్చాలన్నారు. ప్రభుత్వం స్పందించకుంటే భవిష్యత్తులో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఆర్.అంజా చారి, మండల కార్యదర్శి సుదనబోయిన రమేష్, మండల సహాయ కార్యదర్శి నేతాళ్ల రాజు, ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షుడు బి.జగన్, మండల నాయకులు ఊరుపాక వెంకటయ్య, పల్లె సైదులు, బుషిపాక యాదయ్య, శ్రీకాంత్, కొండ్రెడ్డి లింగయ్య, వంగూరి వెంకటయ్య, గంట యాదయ్య, ఎడవెల్లి వెంకటయ్య, మద్ది రమేష్, జయపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా వ్యతిరేక విధానాలను వ్యతిరేకించాలి

సిపిఐ జిల్లా కార్యదర్శి విజయసారధి




**ప్రజాపక్షం/తొర్రూరు :** కేంద్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను వ్యతిరేకించాలని సిపిఐ మహబూబాబాద్ జిల్లా కార్యదర్శి బి.విజయసారధి అన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ తొర్రూరు మండల కౌన్సిల్ సమావేశాన్ని గణపురం లక్ష్మణ్ అధ్యక్షతన లయన్స్ భవనంలో నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన సిపిఐ జిల్లా కార్యదర్శి బి.విజయసారధి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పన్నెండేళ్లుగా కేంద్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి ఈరోజు నెహ్రూ గతంలో ప్రధానమంత్రిగా చేసిన పనిదినాలను, మోడీ ప్రభుత్వం దాటిపోయిందని చెబుతూ సంబరాలు చేసుకుంటున్నారని అన్నారు. నిత్యావసర సరుకులు, గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలు ఆకాశాన్ని అందుకోవడంతో సామాన్య ప్రజల నానా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. తెలంగాణ రాష్ట్రానికి రావాల్సిన కేంద్ర ప్రభుత్వ నిధులను రాకుండా చేస్తూ కేంద్రం వివక్షతకు పాల్పడుతుందని అన్నారు. మోడీ ప్రభుత్వం నాలుగు లెబర్ చట్టాలను తీసుకువచ్చి కార్మిక వర్గాన్ని ఇబ్బందులకు గురి చేస్తుందని అన్నారు. రానున్న రోజుల్లో మండలంలో పార్టీ విస్తృత పరిచి నూతన శాఖలు ఏర్పాటు చేయాలన్నారు. మోడీ ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ జాతాలు నిర్వహించి గ్రామాల్లో ప్రజలను చైతన్యవంతం చేయాలన్నారు. ఈ సమావేశంలో సీపీఐ సీనియర్ నాయకులు తమ్మెర లక్ష్మి నర్సింహారావు, ఏఐటీయూసీ గౌరవ అధ్యక్షులు ఓమ బిక్షపతి, మండల కార్యదర్శి బంధు మహేందర్, మండల సహాయ కార్యదర్శి పేరబోయిన కిరణ్, బూర్గు యాదగిరి, మంగళపల్లి మల్లయ్య, చంద్రయ్య, బొల్లు వెంకన్న, కాసాని వెంకన్న, కోటగిరి కృష్ణ, వెంకన్న, కృష్ణమూర్తి, పసుల యాకయ్య, బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

# హక్కు పత్రాలు ఎప్పటిలోగా ఇస్తారు?

లేదంటే ప్రత్యక్ష పోరాటాలకు సిద్ధం

తెలంగాణ గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమావత్ అంజయ్య నాయక్ డిమాండ్

**ఖానాపూర్ :** దశాబ్దాల కాలంగా పోడు రైతులకు హక్కు కల్పించాలని 2006 అటవీ హక్కుల చట్టం అమలు చేయాలని తెలంగాణ గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమావత్ అంజయ్య నాయక్ డిమాండ్ చేశారు. తెలంగాణ గిరిజన సమాఖ్య నిర్మల్ జిల్లా మూడవ మహాసభ ఖానాపూర్ నియోజకవర్గంలోని పెంబి మండలం నాగపూర్ గ్రామంలో శనివారం భూమన అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ముఖ్యఅతిథిగా రమావత్ అంజయ్య నాయక్ పాల్గొని ప్రసంగిస్తూ గిరిజన సమాఖ్య ఆధ్వర్యంలో దశాబ్దాల కాలంగా పోడు రైతులకు హక్కు కల్పించాలని 2006 అటవీ హక్కుల చట్టం అమలు చేయాలని, చేసిన పోరాట ఫలితంగా గత ప్రభుత్వాలు కొంతమందికి హక్కు పత్రాలు ఇచ్చి ఇంకా అనేక మందికి హక్కుపత్రాలు నేటికీ రాకుండా మిగిలిపోయిన వారికి వెంటనే పత్రాలు ఇచ్చి బేషరతుగా రైతుబంధు బ్యాంకు రుణాలు అందించాలని అంజయ్య నాయక్ డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టో ఇచ్చినటువంటి హామీలను అమలు పరచాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గిరిజనుల




సంస్కృతి, సాంప్రదాయాలు వారి అస్తిత్వాలను ధ్వంసం చేసే పరిస్థితి దాపురించిందని ఆవేదన వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో గిరిజన సమస్యల పైన మిలిటెంట్ ఉద్యమాలకు ప్రత్యక్ష పోరాటాలు సాగించాలని పిలుపునిచ్చారు. ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి విలాస్ మాట్లాడుతూ జిల్లాలో ఉన్న స్థానిక సమస్యలపై, హక్కుల పరిరక్షణ కోసం ఉద్యమాలు కొనసాగించాలని ఈ వర్గాల అభివృద్ధి కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూనుకోవాలని వారు అన్నారు. స్థానికంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అంగన్వాడీ సెంటర్లు ఆశ వర్కర్లను నియమించి గిరిజన ప్రజలను ఆదుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి భూక్య రమేష్, సీనియర్ నాయకులు ఎస్ఎన్ రెడ్డి, కోట్ల నారాయణ భీమేష్, నరేష్ పోశెట్టి, లక్ష్మి, మమత పుష్పలత తదితరులు పాల్గొన్నారు.



# ఎడ్ల గురువారెడ్డి సేవలు మరిచిపోలేనివి

కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత నందిని సిధారెడ్డి

**ప్రజాపక్షం/సిద్దిపేట :** తెలంగాణ రైతాంగ పోరాట యోధుడు, సిద్దిపేట తొలి ఎమ్మెల్యే కామ్రేడ్ ఎడ్ల గురువారెడ్డి 15వ వర్ధంతి సందర్భంగా సిద్దిపేట జిల్లా కేంద్రంలోని విక్టరీ చౌరస్తాలో ఆయన విగ్రహానికి సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నివాళులను అర్పించారు. ఈ సందర్భంగా కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత నందిని సిధారెడ్డి, సిపిఐ పార్టీ సిద్దిపేట జిల్లా కార్యదర్శి మంద పవన్‌లు మాట్లాడుతూ, ఎడ్ల గురువారెడ్డి తెలంగాణ రైతాంగ పోరాట చరిత్రలో చిరస్థాయిగా నిలిచే ప్రజా నాయకుడని అన్నారు. ప్రజల హక్కుల కోసం జీవితాంతం పోరాడిన గురువారెడ్డి సేవలు యువతకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. గురువారెడ్డి జీవిత చరిత్రను పాఠ్యపుస్తకాలలో చేర్చి విద్యార్థులకు పరిచయం చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని నందిని సిధారెడ్డి కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ విద్యావంతుల వేదిక జిల్లా అధ్యక్షులు డాక్టర్ పాపయ్య, సీనియర్ పాత్రికేయులు అంజయ్య, టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షులు రంగాచారి, మాజీ మున్సిపల్ చైర్మన్ కడవేరుగు రాజనర్సు, సిపిఐ సీనియర్ నాయకులు ఎడ్ల వెంకటరామిరెడ్డి, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కిష్టపురం లక్ష్మన్, నాయకులు గజాభీమకర్, బన్సీలాల్, హరిఫ్, చంద్రం, మల్లేశం, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.



## కొనుగోళ్లలో జాప్యంపై రైతుల ఆందోళన

**ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం :** యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలం గుడిమల్కాపురంలో వడ్ల కొనుగోలు ఆలస్యం కావడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. కొనుగోలు కేంద్రాల్లో రోజులు గడుస్తున్న ధాన్యం తూకం వేయకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఎండలో ధాన్యాన్ని కాపాడుకోవడం కష్టంగా మారిందని, వర్షాభావంతో ఇబ్బందిగా మారిందని రైతులు వాపోతున్నారు. కొనుగోలు కేంద్రాల్లో తగిన సిబ్బంది లేకపోవడం లారీల కొరత సాంకేతిక సమస్యల కారణంగా ధాన్యం కొనుగోలు మందగించిందని అధికారులు చెబుతున్నప్పటికీ వెంటనే సమస్యను పరిష్కరించాలని రైతులు డిమాండ్ చేశారు. అధికారుల నిర్లక్ష్యానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అకాల వర్షాలు భయం వెంటాడుతున్న నేపథ్యంలో ప్రభుత్వం వెంటనే స్పందించి ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలని రైతు సంఘాల నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో మన్నే భీమారెడ్డి, సిద్ధగోని శ్రీను, నరేష్, రైతులు పాల్గొన్నారు.

## పెండింగ్ పనులు వేగవంతం చేయండి

సింగన్నగూడెం డబుల్ బెడ్‌రూమ్ పెండింగ్ పనులను పరిశీలించిన భువనగిరి ఎమ్మెల్యే కుంభం



**ప్రజాపక్షం/భువనగిరి రూరల్ :** భువనగిరి మండలంలోని సింగన్నగూడెం డబుల్ బెడ్‌రూమ్ కాలనీలో కొనసాగుతున్న పెండింగ్ పనులను భువనగిరి ఎమ్మెల్యే, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు పరిశీలించారు. ఈ సందర్భంగా కాలనీలో చేపట్టాల్సిన మౌలిక వసతుల పనులు, తాగునీటి సరఫరా, విద్యుత్ సౌకర్యాలు, అంతర్గత రహదారులు తదితర అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి సంబంధిత అధికారులకు అవసరమైన సూచనలు చేశారు. పెండింగ్‌లో ఉన్న పనులను వేగవంతం చేసి, నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. లబ్ధిదారులకు అన్ని మౌలిక సదుపాయాలు అందుబాటులోకి వచ్చేలా సంబంధిత అధికారులు పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ శ్రీవాణి రవికుమార్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అందరి ఓట్లు కాపాడేలా పకడ్బందీగా పని చేయాలి

మాజీ మంత్రి గుంతకండ్ల జగదీష్‌రెడ్డి



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** గ్రామాల్లో బిఆర్ఎస్ బూత్ ఏజెంట్‌లు ప్రతి రోజు బిఎల్ఓతో పాటే ఇల్లులు తిరుగుతూ అన్ని పరిశీలించి అందరి ఓట్లు కాపాడేలా పకడ్బందీగా పని చేయాలని మాజీమంత్రి,సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకల్ జగదీశ్ రెడ్డి పిలుపునిచ్చారు.శనివారం బిఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో ప్రత్యేక ఓటర్ జాబితా పరిశీలన,పార్టీ డిజిటల్ సభ్యత్వ నమోదుపై నల్లగొండ నియోజకవర్గ స్థాయి కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశానికి మాజీ మంత్రి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ అందరి ఓట్లు కాపాడేలా పకడ్బందీగా పని చేయాలని కార్యకర్తలు ఎక్కడ గొడవలు పెట్టుకోవద్దని అనుమానం వస్తే వెంటనే ఆర్డీవో కు లిఖితపూర్వకంగా ఫిర్యాదులు చేయాల న్నారు. ఈ నెల 17న పెద్ద స్కామ్ చేసేందుకు సీఎం రేవంత్ రెడ్డి నల్లగొండకు వస్తున్నాడని హ్యాం రోడ్లు అన్ని వట్టి దే హంభాక్ కమిషన్‌లు కొరకే హంగామా అన్నారు. ఈ సమావేశంలో పార్టీ సభ్యత్వాల జిల్లా ఇంఛార్జి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, ఎమ్మెల్సీ మంకెన కోటిరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు భూపాల్ రెడ్డి, గాదరి కిషోర్ కుమార్, మాజీ జెడ్పి చైర్మన్ బండ నరేందర్ రెడ్డి,మాజీ మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డి పాల్గొన్నారు.

## నామినేషన్‌ను తిరస్కరించడం ఎన్నికల అధికారుల కక్ష సాధింపు చర్య

డిసిసి అధ్యక్షుడు గుడిపాటి నర్సయ్య



**ప్రజాపక్షం/అర్వపల్లి :** మధ్యప్రదేశ్ నుంచి రాజ్యసభ సభ్యురాలిగా తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జి, ఏఐసిసి నాయకురాలు మీనాక్షి నటరాజన్ వేసిన నామినేషన్‌ను ఎన్నికల అధికారులు తిరస్కరించడం బిజెపి ఎన్నికల అధికారుల కక్ష సాధింపు చర్య అని సూర్యాపేట జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు గుడిపాటి నర్సయ్య తీవ్రంగా ఖండించారు. శనివారం మండల కేంద్రంలోని గ్రామ సర్పంచ్ చిల్లంచర్ల విద్యాసాగర్ నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాష్ట్ర నాయకులు దరూరి యోగానందా చార్యులు, పలువురు పార్టీ నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. మధ్యప్రదేశ్ నుంచి రాజ్యసభలో మూడో సీటు గెలవడం కోసం బిజెపి ఎన్నికల సంఘాన్ని అడ్డుపెట్టుకుని అప్రజాస్వామికంగా వ్యవహరించిందని ఆయన విమర్శించారు. దేశంలో జరిగిన వివిధ రాష్ట్రాల ఎన్నికల్లో సర్ పేరుతో ప్రతిపక్షాలకు చెందిన లక్షలాది ఓటర్లను తొలగించి బిజెపి అక్రమ మార్గాల్లో గెలుస్తుందని ఎద్దేవా చేశారు. ఈ సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు అనిరెడ్డి రాజేందర్ రెడ్డి, మండల అధ్యక్షుడు మోరపాక సత్యం, సర్పంచ్ చిల్లంచర్ల విద్యాసాగర్, బింగి కృష్ణమూర్తి, మంచాల లలితా రాంమూర్తి, నాయకులు శిగ నసీర్ పాల్గొన్నారు.

## ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** రాబోయే ఐదు రోజులపాటు సూర్యాపేట జిల్లాలో వర్షాలు, పిడుగులు పడే అవకాశాలు ఉన్నందున ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్యంగా జిల్లాలో భారీ వర్షాలు, బలమైన ఈదురు గాలులతో కూడిన ఉరుములు, మెరుపులు సంభవించే అవకాశం ఉన్నందున ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. అంతేకాకుండా గంటకు 40 నుండి 50 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడవచ్చని పొలాల్లో పనిచేసే రైతులు, కూలీలు ఉరుములు వస్తున్నప్పుడు చెట్లకింద, విద్యుత్ స్తంభాల కింద ఉండవద్దని సూచించారు. శిథిలావస్థ ఇండ్లలో ఉండేవారు అప్రమత్తంగా ఉండాలని వీలైతే పక్కా భవనాలలో ఆశ్రయం పొందాలని తెలిపారు. వర్షం పడే సమయంలో అత్యవసరమైతే తప్ప ప్రయాణాలు చేయవద్దన్నారు. అధికారులందరూ క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉంటూ పరిస్థితిని సమీక్షించాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు చేపట్టాలని ఆదేశాలు జారీ చేశారు.

# నల్లగొండను బత్తాయి సాగులో దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దుతాం

రైతుల ఐక్యత, ప్రభుత్వ సహకారంతో బత్తాయికి పూర్వవైభవం తీసుకొస్తాం: మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

రాష్ట్రస్థాయి సిట్రస్ సెమినార్‌లో రైతులకు పంట మార్పిడిపై పిలుపు

బత్తాయి సాగు విస్తరణకు ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తామని వెల్లడి



**ప్రజాపక్షం/నల్లగొండ:** రైతుల ఐక్యత, పరస్పర సహకారం, ప్రభుత్వ మద్దతుతో నల్లగొండ జిల్లాను బత్తాయి సాగులో దేశానికే ఆదర్శంగా నిలిపేందుకు కృషి చేస్తామని రాష్ట్ర రోడ్లు, భవనాలు,సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు.శనివారం జిల్లా కేంద్రంలోని ఎలిమినేటి మాధవరెడ్డి ఆడిటోరియంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి సిట్రస్ సెమినార్‌కు ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతు సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు.నల్లగొండ పేరు వినగానే బత్తాయి గుర్తుకు వస్తుందని,ఒకప్పుడు జిల్లాలో సుమారు 4 లక్షల ఎకరాల్లో బత్తాయి సాగు జరిగేదని, అయితే కాలక్రమేణా వివిధ కారణాలతో అది 40 వేల ఎకరాలకు తగ్గిపోవడం బాధాకరమన్నారు. మారుతున్న వ్యవసాయ పరిస్థితులకు అనుగుణంగా రైతులు కూడా మారాలని,వరి పంటపైనే ఆధారపడకుండా బత్తాయి సహా ఇతర ఉద్యాన పంటలను సాగు చేయాలని సూచించారు.పంట మార్పిడిపై రైతులు ప్రత్యేక దృష్టి సారించాలని, ఈ విషయంలో ప్రభుత్వ సహకారం ఎల్లప్పుడూ ఉంటుందన్నారు. అవసరమైతే హైదరాబాద్‌లో మరోసారి సమావేశం నిర్వహించి సిట్రస్ రైతుల సమస్యలు,భవిష్యత్ అవకాశాలు, ఆధునిక సాగు పద్ధతులు, మార్కెటింగ్, ఎగుమతులు తదితర అంశాలపై సమగ్రంగా చర్చిస్తామని మంత్రి వెల్లడించారు. అనంతరం కోదండ రెడ్డి,బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి,గుత్తా అమిత్ రెడ్డి ప్రసంగించారు.ఈ కార్యక్రమంలో కొండా లక్ష్మణ్ బాపూజీ ఉద్యాన విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ డి. రాజిరెడ్డి, రైతు కమిషన్ సభ్యులు,ఉద్యాన శాఖ అధికారులు, అభ్యుదయ రైతులు, బత్తాయి రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.అనంతరం ఆడిటోరియం ఆవరణలో ఏర్పాటు చేసిన వివిధ రకాల వ్యవసాయ, ఉద్యాన ప్రదర్శన స్టాళ్లను మంత్రి ప్రారంభించి పరిశీలించారు.

### 17న నల్గొండకు సిఎం రేవంత్ రెడ్డి రాక

ఈనెల 17న రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి జిల్లాలోని కనగల్ మండలానికి రానున్నారని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు.శనివారం కనగల్ మండల కేంద్రంలో ముఖ్యమంత్రి హాజరుకానున్న బహిరంగ సభ స్థలం, హ్యాం రోడ్ల పైలాన్, హెలిప్యాడ్ స్థలాలను మంత్రి పరిశీలించారు.ఈసందర్భంగా మంత్రి మీడియాతో మాట్లాడుతూ, రాష్ట్ర చరిత్రలో కని విని ఎరుగని రీతిలో ఒకే రోజున ఆర్‌బి శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని అన్ని రహదారులను డబుల్ రోడ్లుగా మార్చే మొదటి ప్యాకేజీలో భాగంగా,కనగల్ మండలం ధర్వేశిపురం నుంచి డిండి వరకు నిర్మించే రహదారితో రాష్ట్రవ్యాప్తంగా రూ. 14,000 కోట్లతో హ్యాం పద్ధతిలో నిర్మించనున్న డబుల్ రోడ్ల పనులకు సీఎం రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేస్తారని వెల్లడించారు. జిల్లాను సస్యశ్యామలం చేసే ఎస్ఎల్‌బీసీ సొరంగం కూడా 2028 ఆగస్టు నాటికి పూర్తి చేస్తామని, దీని ద్వారా జిల్లాలో రెండు పంటలకు సాగునీరు అందుతుందన్నారు. ఏఆర్పీ కాలువల లైనింగ్‌కు రూ.450 కోట్లు మంజూరయ్యాయన్నారు.ముఖ్యమంత్రి హాజరయ్యే సభకు సుమారు లక్ష మంది ప్రజలు హాజరవుతారని, సభను విజయవంతం చేయాలని అధికారులను ఆదేశించారు.ట్రాఫిక్ సమస్యలు లేకుండా,తాగునీరు,టెంట్లు, వాహనాలు,పార్కింగ్,లైటింగ్, లైవ్ టెలికాస్ట్ తదితర అన్ని సౌకర్యాలు సమకూర్చాలని, పైలాన్ నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, స్థానిక సంస్థల ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ వై. అశోక్ రెడ్డి, అడిషనల్ ఎస్పీ రమేష్, జెడ్పీ సీఈవో ప్రేమ్ కరణ్ రెడ్డి, డీపీఓ శంకర్ నాయక్, డీఎస్పీ శివరాం రెడ్డి, ఆర్ బీ డీఈ గణేష్ పాల్గొన్నారు.



## బాధితులకు భరోసా, భద్రత కల్పించడమే పోలీసుల ప్రథమ కర్తవ్యం

సూర్యాపేట జిల్లా ఎస్‌పి కె. నరసింహా



**ప్రజాపక్షం/సూర్యాపేట :** బాధితులకు భరోసా, భద్రత కల్పించడమే పోలీసుల ప్రథమ కర్తవ్యమని జిల్లా ఎస్‌పి కె. నరసింహ సూచించారు. శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా పోలీసు అధికారుల నెలవారీ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని శాంతిభద్రతలు, కేసుల ధర్యాప్తు పురోగతిపై సుధీర్ఘంగా సమీక్షించారు. గత నెలలో నమోదైన కేసుల పూర్వాపరాలను నిశితంగా పరిశీలించి, వాటిని త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అక్రమ రవాణా, అసాంఘీక కార్యకలాపాలపై పటిష్ట నిఘా ఉంచి నివారించాలని ఆదేశించారు. బాధితుల ఇంటి వద్ద నుండి కేసు నమోదు చేసే విషయంలో అలసత్వం వహించకూడదని డోర్ స్టెప్ ఎఫ్ఐఆర్ పటిష్టంగా అమలు చేయాలని సూచించారు. కేసుల ఛేదనలో శాస్త్ర సాంకేతిక నైపుణ్యాలతో పనిచేయాలన్నారు. సాక్ష్యాధారాలను పక్కాగా నమోదు చేయాలన్నారు. సాక్షులను చైతన్యపరిచి, నేరస్థులకు త్వరితగతిన శిక్షలు పడేలా కోర్టు అధికారులతో నిరంతరం సమన్వయం చేసుకోవాలన్నారు. ప్రజలు, బాధితుల నుంచి వచ్చే ఫిర్యాదులను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని తెలిపారు. కేసుల సంఖ్యను తగ్గించేలా పనిచేయాలన్నారు. అక్రమ రవాణా, అసాంఘీక కార్యకలాపాలు జరగకుండా క్షేత్రస్థాయిలో పటిష్టమైన చర్యలు చేపట్టాలన్నారు. గ్రామాల్లో భద్రతా వలయాలు ఏర్పాటు చేయాలని సూచించారు. నేరాలు జరిగినప్పుడు పక్కా ఆధారాలు లభించేలా సీసీ కెమెరాల వ్యవస్థను బలోపేతం చేయాలని తెలిపారు. స్థానిక ప్రజలు, వ్యాపారులు తమ పరిసరాల్లో సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకునేలా ప్రోత్సహించాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణ, సైబర్ మోసాలపై జాగ్రత్తలు, మహిళల భద్రత వంటి ముఖ్య అంశాలపై ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. ఈ సమావేశంలో అదనపు ఎస్‌పి రవీందర్ రెడ్డి, కోదాడ డిఎస్‌పి శ్రీనివాస్‌రెడ్డి, డిసిఆర్‌బి డిఎస్‌పి రవి, ఏఆర్ డిఎస్‌పి నరసింహాచారి, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ రామారావు, డిసిఆర్‌బి ఇన్‌స్పెక్టర్ మగ్ధూం అలీ, సిఐలు రాజశేఖర్, వెంకటయ్య, నాగేశ్వరరావు, శివశంకర్, చరమందరాజు, రామకృష్ణారెడ్డి, సిసిఎస్ ఇన్‌స్పెక్టర్ శివకుమార్, సైబర్ సెక్యూరిటి ఇన్‌స్పెక్టర్ లక్ష్మినారాయణ, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

## దళిత క్రైస్తవులకు ఎస్‌సి హోదా సాధించే వరకూ పోరాడుతా

ఎంఆర్‌పిఎస్ జాతీయ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** దళిత క్రైస్తవులకు ఎస్‌సి హోదా కల్పించే వరకు వారికి అండగా నిలిచి పోరాటం కొనసాగిస్తానని ఎంఆర్‌పిఎస్ జాతీయ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ అన్నారు. శనివారం పట్టణంలోని లక్ష్మీ గార్డెన్స్‌లో ఏఐసిఎఫ్ ఉమ్మడి నల్లగొండ జిల్లా కోఆర్డినేటర్ పి. డేవిడ్ రాజ్ అధ్యక్షతన నిర్వహించిన దళిత క్రైస్తవుల మహాసభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు.ఈ సందర్భంగా మందకృష్ణ మాదిగ మాట్లాడుతూ 1950 నుంచి దళిత క్రైస్తవులు వివక్షకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.మతం మారినప్పటికీ సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన దళిత క్రైస్తవుల పరిస్థితిలో పెద్దగా మార్పు రాలేదని పేర్కొన్నారు. వారికి రాజ్యాంగబద్ధంగా లభించాల్సిన హక్కులు, అవకాశాలు అందేలా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు.దళిత క్రైస్తవుల సమస్యలను రాజకీయ కోణంలో కాకుండా సామాజిక న్యాయం దృష్టితో చూడాలని ఆయన సూచించారు.దశాబ్దాలుగా కొనసాగుతున్న ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ముందుకు రావాలని కోరారు.దళిత క్రైస్తవులకు న్యాయం జరగాలంటే పాస్టర్లు, బిషప్‌లు,క్రైస్తవ సంఘాలు, సామాజిక సంస్థలు, ప్రజాస్వామ్యవాద శక్తులు ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. వారి హక్కుల సాధన కోసం చేపట్టే ప్రజాస్వామ్యబద్ధమైన పోరాటాలకు తాను పూర్తి మద్దతు ఇస్తానని స్పష్టం చేశారు.దళిత క్రైస్తవుల విద్య,ఉపాధి, సామాజిక భద్రత,సంక్షేమ అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. సమాన హక్కులు, సమాన అవకాశాలు కల్పించడమే నిజమైన సామాజిక న్యాయమని అన్నారు. ఈ మహాసభలో వివిధ క్రైస్తవ సంఘాల నాయకులు,పాస్టర్లు, మత పెద్దలు, సామాజిక కార్యకర్తలు, క్రైస్తవ యువజన ప్రతినిధులు, మహిళలు పాల్గొన్నారు. సభలో దళిత క్రైస్తవుల హక్కుల సాధనకు సంబంధించి పలు తీర్మానాలు ఆమోదించినట్లు నిర్వాహకులు తెలిపారు.

## ప్రతిపక్షాలు లేకుండా చేయడమే లక్ష్యంగా మోదీ పాలన

రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి



**ప్రజాపక్షం/సూర్యాపేట :** ప్రధానమంత్రి మోదీ దేశ ప్రధానిగా 12 ఏండ్ల పాలనలో ఓటు చోరీ ప్రతిపక్షాలను లేకుండా చేయడమే లక్ష్యంగా సాగిందని తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మాజీ ప్రధానులు జవహర్ లాల్ నెహ్రు, ఇందిరాగాంధీ, రాజీవ్ గాంధీ చేసిన సేవలను గుర్తు చేస్తూ నాగార్జునసాగర్, భోజంపాడు ప్రాజెక్టులు, బిహెచ్ఈఎల్, ఐఐటి వంటి అనేక కీలక సంస్థలను కాంగ్రెస్ ప్రభుత్వాలే ఏర్పాటు చేశాయని గుర్తు చేశారు. బిజెపి ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందన్నారు. సంవత్సరానికి కోటి ఉద్యోగాలు ఇస్తామని చెప్పి యువతను మోసం చేసిందని ఆరోపించారు. కేంద్రంలోని బిజెపి తెలంగాణ రాష్ట్రంపట్ల వివక్ష చూపుతూ వస్తుందన్నారు. తెలంగాణ ఏర్పడిన తరువాత రాష్ట్రానికి కేంద్రం నుంచి ఒక్క ప్రధాన ప్రాజెక్టు కూడా రాలేదని, మెట్రో రెండో దశ, ఆర్ఆర్ఆర్ వంటి ప్రాజెక్టుల విషయంలో కూడా కేంద్రం సహకరించలేదన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పలుమార్లు ప్రధానమంత్రి, కేంద్ర మంత్రులను కలిసి రాష్ట్ర అవసరాలను వివరించినప్పటికి సరైన స్పందన రాలేదని చెప్పారు. రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీ, రాహుల్ గాంధీ నాయకత్వంలో కేంద్రంలో అధికారంలోకి వస్తుందనే పూర్తి విశ్వాసం ఉందన్నారు. తాను రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్‌గా దాదాపు రెండు సంవత్సరాలు (23 నెలలు) పూర్తి చేసుకున్నానని తెలిపారు. సూర్యాపేట అభివృద్ధికి పర్యాటక శాఖ ద్వారా పలు కార్యక్రమాలు చేపట్టినట్లు చెప్పారు. ట్యాంక్‌బండ్ డెవలప్‌మెంట్ కోసం రూ.5కోట్లు, ఉర్లుగొండ డెవలప్‌మెంట్ కోసం రూ.2.5కోట్లు, సద్దల చెరువు ప్రాంత అభివృద్ధికి సుమారు రూ.15 కోట్లతో పార్కు అభివృద్ధి పనులు చేపడుతున్నామని, దండు మైసమ్మ దేవాలయ అభివృద్ధి కోసం రూ.2.5కోట్లు, గిరిజనుల ఆరాధ్య దైవమైన చాంపులాల్ ఆలయ ఫంక్షన్ హాల్ కోసం రూ.1కోటి 50లక్షలు, అర్వపల్లి శ్రీలక్ష్మి నృసింహ స్వామి దేవాలంయ కోసం రూ.60లక్షలు, ఆత్మకూర్(ఎస్) పురాతన దేవాలయం కోసం త్వరలో రూ.60లక్షల నిధులు రాబోతున్నాయని వెల్లడించారు. రాబోయే రోజుల్లో మరిన్ని నిధులు తెచ్చి సూర్యాపేట అభివృద్ధి చేస్తామన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ షఫీఉల్లా, వ్యవసాయ మార్కెట్ కమిటి వైస్ చైర్మన్ గట్టు శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు వల్దాస్ దేవేందర్, మధు, మెగ్యతండ సర్పంచ్ భూక్య రాజు నాయక్ పాల్గొన్నారు.

## ప్రభుత్వాసుపత్రిలో మందుల కొరత

**ప్రజాపక్షం/తుర్కపల్లి :** తుర్కపల్లి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో,రోగులకు సరైన మందులు లేక ఇబ్బందులు పడుతున్నారని, చిన్న పిల్లలకు జ్వరానికి వాడే పారాసెటమాల్ సిరప్ లేదని, నెల రోజుల నుండి స్టాక్ రావడం లేదని, వచ్చిన వారికి ప్రైవేట్ మెడికల్ షాపుల్లో తీసుకోండి అని నిర్లక్ష్యంగా చెప్పి సిబ్బంది పంపిస్తున్నారని ప్రజలు మండిపడుతున్నారు. వాతావరణ మార్పుల ప్రభావంగా సీజనల్ గా వచ్చే వ్యాధులను అరికట్టే విధంగా మందులు లేకపోవడంతో,ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేసే సిబ్బంది, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, తక్షణమే ప్రభుత్వ హాస్పిటల్ లో ప్రజలకు మందులు సమకూర్చాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయంపై స్పందిస్తూ హాస్పిటల్ లో ఫార్మసీస్ట్ లీవ్‌లో ఉన్న కారణంగా మందులు సరఫరా జాప్యం జరుగుతోందని, సిరప్‌లు ఇతర మందులు సోమవారం నుంచి నిత్యం అందుబాటులో ఉంచేలా చూస్తామని మండల వైద్యాధికారులు తెలిపారు.

## మునుగోడును ముంచెత్తిన భారీ వర్షం

**ప్రజాపక్షం/మునుగోడు :** మండలంలో శనివారం మధ్యాహ్నం కురిసిన ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం జనజీవనాన్ని అస్తవ్యస్తం చేసింది. మధ్యాహ్నం ఒంటి గంట తర్వాత ఒక్కసారిగా కుండపోత వర్షం కురవడంతో మండలంలోని పలు వాగులు,వంకలు పొంగిపొర్లాయి. కోతులారం, కలకుంట్ల, చెల్లేడు, పలివెల గ్రామాల పరిసర ప్రాంతాల్లోని వాగులతో పాటు మునుగోడు మర్రివాగు,పెద్దవాగు ఉధృతంగా ప్రవహించాయి.దీంతో లోతట్టు ప్రాంతాలు నీటమునిగాయి.మండల కేంద్రంలోని మునుగోడు, చండూరు ప్రధాన రహదారిపై ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం సమీపంలో రెండు వరుసల రోడ్డు నిర్మాణ పనులు కొనసాగుతుండటంతో వర్షపు నీరు భారీగా రోడ్డుపైకి చేరింది. అదేవిధంగా మర్రివాగు సమీపంలోని బుడగ జంగాల కుటుంబాల నివాస ప్రాంతాల్లోకి వరద నీరు చేరింది. వారు జీవనోపాధి కోసం సేకరించి నిల్వ ఉంచుకున్న పాత ప్లాస్టిక్ సీసాలు,ఇతర వ్యర్థ వస్తువులు వరద ప్రవాహంలో కొట్టుకుపోయాయి. అలాగే సుమారు రూ.2 లక్షల విలువ చేసే పాత ఇనుప సామగ్రి కూడా నీటిలో కొట్టుకుపోవడంతో బాధిత కుటుంబాలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశాయి. మునుగోడు తహసీల్దార్ నేలపట్ల నరేష్ వెంటనే ఘటనాస్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు.



## దైవ దర్శనం కోసం వెళ్తూ అనంత లోకాలకు...

సాగర్ వద్ద రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి





**ప్రజాపక్షం/నందికొండ:** నాగార్జునసాగర్ పాత పోలీస్ గ్రౌండ్ సమీపంలోని సమాధుల మూలమలుపు వద్ద శనివారం ఉదయం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఒక మహిళ ప్రాణాలు కోల్పోగా,మరో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డారు. మారుతి స్విఫ్ట్ డిజైర్ కారు,మహీంద్రా థార్ జీపు ఎదురెదురుగా ఢీకొనడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది.ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న పాలపర్తి కాత్యాయని (55) తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందారు.కారు నడుపుతున్న ఆమె భర్త పాలపర్తి శ్రీనివాసరావు తీవ్రంగా గాయపడగా, స్థానికులు వెంటనే 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. అనంతరం ఆయనను చికిత్స నిమిత్తం నాగార్జునసాగర్‌లోని కమలా నెహ్రూ ఏరియా ఆసుపత్రికి తరలించారు.మృతురాలి కుమారుడు పాలపర్తి శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం, హైదరాబాద్‌లోని సనత్‌నగర్‌కు చెందిన కాత్యాయని, శ్రీనివాసరావు దంపతులు దైవదర్శనాల కోసం ప్రయాణం ప్రారంభించారు. ముందుగా ప్రకాశం జిల్లా త్రిపురాంతకంలోని దేవాలయాన్ని దర్శించుకున్న అనంతరం శ్రీశైలం వెళ్లాలని భావించారు. అయితే నాగార్జునసాగర్ వద్దకు చేరుకున్న సమయంలో ఎదురెదురుగా రెండు వాహనాలు ఢీకొనడంతో ఈ విషాద ఘటన చోటుచేసుకుంది.థార్ జీపును ఫయాజ్ అనే వ్యక్తి నడుపుతున్నట్లు సమాచారం. మృతురాలి కుమారుడు శ్రీకాంత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు ప్రారంభించారు.

### 'ప్రజాపక్షం' ముందే హెచ్చరించింది

నాగార్జునసాగర్ పరిసర ప్రాంతాల్లో పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలపై 'ప్రజాపక్షం' దినపత్రిక కొద్ది రోజుల క్రితమే ప్రత్యేక కథనాన్ని ప్రచురించింది. సాగర్‌లో మృత్యు మలుపులు..పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలుసాగర్ రోడ్లపై సైలెంట్ కిల్లర్స్ రంబుల్ స్ట్రిప్స్? అనే శీర్షికతో ప్రచురించిన ఆ కథనంలో రహదారులపై ఏర్పాటు చేసిన రంబుల్ స్ట్రిప్స్ కారణంగా వాహనాలు అదుపు తప్పి అనేకమంది ప్రాణాలు కోల్పోతున్నారని హెచ్చరించింది.

## పరిశుభ్రంగా స్టేషన్ పరిసరాలు

సిపి అంబర్ కిషోర్ ఝూ



**ప్రజాపక్షం/దండేపల్లి :** పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితులకు ప్రశాంతమైన, ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేలా పరిసరాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ ఆదేశించారు. దండేపల్లి పోలీస్ స్టేషన్‌ను శనివారం ఆయన ఆకస్మికంగా సందర్శించి, క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టారు.దండేపల్లి ఎస్‌ఐ రాజవర్ధన్‌తో మాట్లాడి స్టేషన్ నిర్వహణ రికార్డులను, పెండింగ్ కేసుల వివరాలను పరిశీలించారు.రికార్డులను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని, పెండింగ్ కేసులు లేకుండా త్వరితగతిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. స్టేషన్‌ను వర్టికల్ వారీగా విభజించి సిబ్బందికి ప్రత్యేక బాధ్యతలు అప్పగించాలన్నారు. వివిధ కేసుల్లో సీజ్ చేసిన వాహనాలు, ప్రాపర్టీ విషయంలో అత్యంత అప్రమత్తంగా ఉంటూ భద్రతపై ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై ప్రత్యేక నిఘా ఉంచాలని, శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠినంగా వ్యవహరించాలని అధికారులకు దిశా నిర్దేశం చేశారు. స్టేషన్‌కు వచ్చే ప్రతి బాధితుడి పట్ల మర్యాదగా ప్రవర్తించి త్వరితగతిన న్యాయం చేయాలన్నారు.దండేపల్లి ఎస్‌ఐ రాజవర్ధన్, పోలీస్ అధికారులు, పాల్గొన్నారు.

## సమస్యలు పరిష్కరించకుంటే సమ్మె



**ప్రజాపక్షం/కాసిపేట:** యాజమాన్యంతో ఎన్నిసార్లు చర్చించినా కాసిపేట రెండో గనిలోని సమస్యలు పరిష్కారం కావడం లేదని, వీటిని వెంటనే పరిష్కరించకుంటే ఈ నెల 22 నుండి పెద్ద ఎత్తున సమ్మె నిర్వహిస్తామని ఎఐటియుసి బెల్లంపల్లి బ్రాంచ్ సెక్రటరీ దాగం మల్లేష్ హెచ్చరించారు. శనివారం గనిపై నిర్వహించిన గేట్ మీటింగ్, ధర్నాలో ఆయన మాట్లాడారు. అనంతరం స్థానిక సమస్యలతో కూడిన మెమొరండంను గని మేనేజర్ బి. రమేష్‌కు అందజేశారు. అధికారుల నిర్లక్ష్యం, రాజకీయ జోక్యం, రాష్ట్ర ప్రభుత్వం నుండి రావాల్సిన సుమారు 56 వేల కోట్ల బకాయిల వల్ల సింగరేణిలో ఆర్థిక సంక్షోభం ఏర్పడుతోందన్నారు. సమస్యలపై నిర్లక్ష్యం వల్ల కార్మికులపై పనిభారం పెరిగి రక్షణపై ప్రభావం చూపుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఉత్పత్తి, రక్షణకు అవసరమైన పనిముట్లతో పాటు కొత్త ఎస్డీఎల్ యంత్రాలను వెంటనే తెప్పించాలని, యాక్టింగ్ ఆపరేటర్లకు ప్రమోషన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లీవుల నిబంధనలు పాత పద్ధతిలోనే కొనసాగించాలని, మెడికల్ బోర్డు, ఇన్కమ్ టాక్స్, మారుపేర్లు, డిస్మిస్ అయిన కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. నరసయ్య, శ్రీనివాస్, నరసయ్య, వెంకటేష్, కార్మికులు పాల్గొన్నారు.

## పేదలకు అండగా : ఎమ్మెల్యే ధన్‌పాల్



**ప్రజాపక్షం / నిజామాబాద్ అర్బన్ :** పేదల ఆరోగ్యానికి అండగా నిలవాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నానని ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా అన్నారు. శనివారం అర్బన్ ఎమ్మెల్యే క్యాంపు కా ర్యాలయం లో గౌతంనగర్‌కు చెందిన హేమగ్న మూత్ర పిండాల వ్యాధితో తీవ్ర ఇ బ్బందులు పడుతున్నారన్న వీరికి రూ.2.40 లక్షల ఎల్‌వోసి అందజేశారు.

## గుండెపోటుతో ఉపాధి హామీ కూలీ మృతి

**ప్రజాపక్షం/ఎడపల్లి:** ఉపాధి హామీ పనికి వెళ్లిన ఓ కూలి గుండెపోటుతో అకాల మరణం చెందిన విషాద ఘటన నిజామాబాద్ జిల్లా ఎడపల్లి బాపునగర్ గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికులు కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం బాపునగర్ గ్రామానికి చెందిన గట్టు కృష్ణమూర్తి అనే వ్యక్తి శనివారం ఉదయం గ్రామ శివారులో జరుగుతున్న ఉపాధి హామీ పనులకు వెళ్లాడు. పనిలో ఉండగానే అతనికి ఆకస్మాత్తుగా గుండెలో నొప్పి ప్రారంభమైంది. దీంతో నొప్పితోనే ఎలాగోలా పని స్థలం నుంచి ఇంటికి చేరుకున్నాడు. ఇంటికి వచ్చిన తరువాత నొప్పి మరింత అధికం కావడంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు వెంటనే అతడిని ఆస్పత్రికి తరలించేందుకు ఏర్పాట్లు చేశారు. ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే కృష్ణమూర్తికి తీవ్రమైన గుండెపోటు వచ్చింది. గమనించిన అతని కుమారుడు వెంటనే స్పందించి సిపిఆర్ చేసి కాపాడే ప్రయత్నం చేసినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. ఆస్పత్రికి చేరుకునే లోపే కృష్ణమూర్తి ప్రాణాలు విడిచాడు. పరీక్షించిన వైద్యులు అతను అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. కృష్ణమూర్తి మరణంతో కుటుంబానికి పెద్ద దిక్కు కోల్పోయామని, అతని భార్య పిల్లలు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

## మోదీ 12 ఏళ్ల పాలనతో దేశాభివృద్ధి

ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు

**ప్రజాపక్షం/కాగజ్ నగర్:** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 12 ఏళ్ల పాలనా కాలం దేశ అభివృద్ధి, సంక్షేమానికి అంకితమైన పుష్కర సేవా కాలమని ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు అన్నారు. శనివారం కాగజ్‌నగర్ పట్టణంలోని ఎంఎల్‌ఏ నివాసంలో మోదీ ప్రభుత్వ 12 ఏళ్ల పరిపాలనా విజయాలపై నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో, రాష్ట్రంలో ప్రజలకు అందుతున్న అభివృద్ధి, సంక్షేమ ఫలాలు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల ద్వారానే సాధ్యమయ్యాయని పేర్కొన్నారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన, కిసాన్ సమ్మాన్ నిధి, ఉజ్వల యోజన, గరీబ్ కళ్యాణ్ అన్న యోజన వంటి పథకాలతో సమాజంలోని చిట్టచివరి వ్యక్తికి కూడా సంక్షేమ ఫలాలు చేరాలన్నదే మోదీ సంకల్పమని చెప్పారు. గ్రామపంచాయతీ నిధులు, ఉపాధి హామీ పనులు, గ్రామీణ సడక్ యోజన, జాతీయ రహదారుల నిర్మాణం ద్వారా గత 12 ఏళ్లలో దేశవ్యాప్తంగా విస్తృత అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. బిజెపి రాష్ట్ర మీడియా ప్యానలిస్టు నామని మహేష్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పథకాల ద్వారా జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. గజ్జల లావణ్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వీరభద్ర చారి, సర్పంచులు ఓడేటి నానయ్య, తేలి బాపు, మండల బిజెపి అధ్యక్షులు పుల్లా అశోక్, కుంచాల విజయ్, జాడి తిరుపతి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# రూ. 2,216 కోట్లతో...
# దేవాలయాల అభివృద్ధి

- రూ.70 కోట్లతో గూడెంగుట్ట సత్యనారాయణ స్వామి ఆలయ పు:నర్నిర్మాణం
- గోదావరి పుష్కరాలకు రూ. వెయ్యి కోట్లు..బాసర నుంచి భద్రాచలం ఆధ్యాత్మిక కారిడార్‌కు రూ. 802 కోట్లు

డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క



**ప్రజాపక్షం/దండేపల్లి/ మంచిర్యాల :** ఆధ్యాత్మికతతో పాటు విద్య, వైద్య రంగాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. మంచిర్యాల నియోజకవర్గ పరిధిలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన గూడెంగుట్ట శ్రీ సత్యనారాయణ స్వామి దేవాలయ అభివృద్ధి పనులకు శనివారం ఆయన భూమిపూజ చేశారు. మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎమ్మెల్యేలు కొక్కిరాల ప్రేమ్‌సాగర్ రావు, రాజ్ ఠాకూర్, గండ్ర సత్యనారాయణ రావు, పార్లమెంటు సభ్యుడు గడ్డం వంశీ కృష్ణతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు హాజరయ్యారు.పీపుల్స్ మార్చ్ పాదయాత్ర పూర్తయిన మూడేళ్ల పిప్పిరిలో నిర్వహించిన సభలో గూడెంగుట్ట ఆలయ అభివృద్ధి ప్రస్తావన వచ్చిందన్నారు. ఆ సభ జరిగిన 37 రోజుల్లోనే నిధులు మంజూరు చేసి, ఈరోజు భూమిపూజ నిర్వహించడం ప్రజాప్రభుత్వ పనితీరుకు నిదర్శనమన్నారు. దాదాపు రూ. 70 కోట్ల భారీ నిధులతో గూడెంగుట్ట సత్యనారాయణ స్వామి ఆలయాన్ని అద్భుతంగా అభివృద్ధి చేయబోతున్నామని ప్రకటించారు. రెండున్నర ఏళ్ల కాలంలోనే రాష్ట్రవ్యాప్తంగా ఉన్న దేవాలయాల అభివృద్ధి కోసం ప్రభుత్వం రూ. 2,216 కోట్లు మంజూరు చేసిందని ఆయన తెలిపారు. రాబోయే గోదావరి పుష్కరాలను పురస్కరించుకుని భక్తులకు అవసరమైన వసతులు, ఘాట్ల నిర్మాణం కోసం ప్రభుత్వం మరో రూ. 1,000 కోట్లను మం జూరు చేసిందన్నారు. బాసర నుంచి భద్రాచలం వరకు ఉన్న పుణ్యక్షేత్రాల అభివృద్ధి, సుందరీకరణ కోసం రూ. 802 కోట్లతో ఆధ్యాత్మిక కారిడార్ పనులను ముందుకు తీసుకెళ్తున్నట్లు చెప్పారు. ఆధ్యాత్మికతతో పాటు ఈ ప్రాంత ప్రజల జీవనాధారమైన వ్యవసాయ రంగానికి ప్రాధాన్యత ఇస్తూ, గూడెంగుట్ట పరిధిలోని ఎత్తిపోతల పథకం పనుల కోసం రూ. 74 కోట్లు కేటాయించి భూమిపూజ చేసుకోవడం శుభపరిణామన్నారు. మంచిర్యాల నియోజకవర్గంలో బహుముఖ వ్యూహంతో ప్రణాళికాబద్ధంగా పని చేస్తున్న స్థానిక ఎంఎల్‌ఏ ప్రేమ్‌సాగర్ రావును ఆయన మనస్ఫూర్తిగా అభినందించారు. గూడెంగుట్ట ఆలయ పునర్నిర్మాణ పనులను అత్యంత వేగంగా పూర్తి చేయాలని పిలుపునిచ్చారు.

## అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

మంత్రి జూపల్లి కృష్ణారావు



**ప్రజాపక్షం/మావల:** ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అర్హులైన ప్రతి కుటుంబానికి అందేలా చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. శనివారం సిరికొండ మండలం రిమ్మ గ్రామంలో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్‌తో కలిసి ఆయన పర్యటించా రు. గ్రామంలో నూతనంగా నిర్మించిన 69 ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించి లబ్ధిదారుల ఇళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రిమ్మ గ్రామాన్ని పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేశామని, మిగిలిన అర్హులకు కూడా ఇళ్లు మంజూరు చేస్తామన్నారు. గ్రామానికి బీటీ రోడ్డు నిర్మిస్తామని, విద్యాభివృద్ధి కోసం గ్రంథాలయ నిర్మాణానికి రూ. 10 లక్షలు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ మాట్లాడుతూ మారుమూల గ్రామాల అభివృద్ధికి, రోడ్లు, విద్యుత్, తాగునీరు వంటి మౌళిక వసతుల కల్పనకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాజర్షిషా, ఎస్పీ అఖిల్ మహాజన్, సర్పంచ్ పెందుర్ జంగుబాయి, అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## మంత్రి జూపల్లి కృష్ణారావుకు స్వాగతం పలికిన కలెక్టర్

**ప్రజాపక్షం నిర్మల్ టౌన్ :** జిల్లాలో శనివారం నిర్వహించిన పలు కార్యక్రమాలలో పాల్గొనేందుకు వచ్చిన రాష్ట్ర ఎక్సైజ్ ప్రొహిబిషన్ శాఖామంత్రి జూపల్లి కృష్ణారావుకు అటవీ శాఖ వసతి గృహంలో పూల మొక్కను అందజేసి స్వాగతం పలికారు.మంత్రి జూపల్లి కృష్ణారావు పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ దేవిదాస్, డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి తదితర అధికారులు మంత్రికి స్వాగతం పలికారు. అనంతరం మంత్రి జిల్లా కలెక్టర్ ఇతర అధికారులతో సమావేశమై జిల్లాకు సంబంధించిన పలు అంశాలపై చర్చించారు.



## వసతిగృహాలు, విద్యాసంస్థలలో నిర్లక్ష్యం వహించొద్దు

కలెక్టర్ ఇలా త్రిపాఠి




**ప్రజాపక్షం/నిజామాబాద్:** జిల్లాలో అన్ని ప్రభుత్వ వసతి గృహాలు, రెసిడెన్సియల్ పాఠశాలలు, కళాశాలలు, గురుకులాల నిర్వాహణలో ఎలాంటి లోటుపాట్లకు తావు లేకుండా విద్యార్థులకు అన్ని సదుపాయాలు అందుబాటులో ఉండేలా చూడాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు. బాధ్యతారాహిత్యంగా వ్యవహరించే అధికారులపై కఠిన చర్యలు తప్పవని స్పష చేశారు. నూతన విద్యా సంవత్సరం ప్రారంభం కానున్న నేపథ్యంలో శనివారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం కాన్ఫరెన్స్ హాల్‌లో ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ సంక్షేమ శాఖలు, విద్యాశాఖ ఆధ్వర్యంలోని వసతిగృహాలు, రెసిడెన్సియల్ విద్యా సంస్థల పనితీరుపై అదనపు కలెక్టర్ భుజంగరావుతో కలిసి సమీక్ష నిర్వహించి మాట్లాడారు. ఆరోగ్యకరమైన, ఆహ్లాదకర వాతావరణంలో విద్యార్థులు నాణ్యతతో కూడిన విద్యనభ్యసించేలా నిర్వాహకులు కృసి చేయాలన్నారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని అన్ని వసతిగృహాలు, పాఠశాలలు, కళాశాలల్లో పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యతనివ్వాలని ఆదేశించారు. పరిసరాలను శుభ్రంగా ఉంచటంతో పాటు దోమలు, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చ ర్యలు చేపట్టాలని సూచించారు. విద్యార్థులకు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు జరిపించాలన్నారు. ప్రభుత్వ వసతిగృహాలు, రెసిడెన్సియల్ పాఠశాలలు, కళాశాలల్లో వంద శాతం విద్యార్థుల నమోదు జరిగేలా కృషి చేయాలని హితవు పలికారు. బాలికల వసతిగృహాలు, పాఠశాలల్లో మరుగుదొడ్లు, మూత్రశాలలు అవసరం ఉన్నట్లయితే ఈనెల 20 లోగా వివరాలు సమర్పించాలని, అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు వెంటనే నిధులు మంజూరు చేస్తామన్నారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని శాఖల అధికారులు అందుబాటులో ఉండాలన్నారు. విద్యార్థుల భద్రత, సంక్షేమం విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే మాత్రం బాధ్యులను ఉపేక్షించబోమని కలెక్టర్ స్పష్టం చేశారు. సమావేశంలో అదనపు కలెక్టర్ వి.భుజంగరావు, డీఎస్‌సీడీఓ రజిత, జిల్లా విద్యాధికారి అశోక్, ఆర్‌సిఓ సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ స్కూళ్లను పటిష్ఠం చేయాలి

ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఫీజు నియంత్రణ చట్టాన్ని అమలు :ఎఐఎస్‌ఎఫ్ రౌండ్ టేబుల్ సమావేశంలో విద్యార్థి సంఘాల పిలుపు



**ప్రజాపక్షం/నిజామాబాద్:** ప్రభుత్వ స్కూళ్లను పటిష్టం చేయాలని ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఫీజు నియంత్రణ చట్టాన్ని అమలు చేయాలని ఎఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి రఘురాంనాయక్ అన్నారు. ఎఐఎస్‌ఎఫ్ జిల్లా సమితి ఆధ్వర్యంలో శనివారం జిల్లా సహాయ కార్యదర్శి కుషాల అధ్యక్షతన నిర్వహించిన రౌండ్ టేండ్ సమావేవం నిర్వహించగా ఎఐఎస్‌ఎఫ్, ఎస్‌ఎఫ్‌ఐ, ఎఐపిఎస్‌యు, పీడీఎస్‌యు, డీ ఎస్‌ఎఫ్‌ఐ, ఎఐవైఎఫ్, ఎస్‌ఐఓ సంఘాలు ప్రతినిధులు పాల్గొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నర సంవత్సరాలు అవుతున్న విద్యారంగ అభివృద్ధిపై దృష్టి పెట్టిన పరిస్థితి లేదు. ఇప్పటివరకు కూడా విద్యాశాఖ మంత్రిని పెట్టకుండా సిఎం రేవంత్‌రెడ్డి మంత్రి శాఖ తన వద్దే పెట్టుకోవటంతో విద్యారంగ అభివృద్ధి కుంటుపడుతుందన్నారు. రాష్ట్రంలో విద్యారంగం పరిస్థితి ఎక్కడ వేసిన గొంగలి అక్కడే ఉందన్నారు. విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, యూనిఫామ్స్‌లు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. అద్దె భవనంలో ఉన్న గురుకులాలకు స్వంత భవనాలు నిర్మాణం చేపట్టాలని, సంక్షేమ హాస్టళ్లకు కొత్త భవనాలు నిర్మించాల్సిన అవసరముందన్నారు. అనుమతి లేని ప్రైవేట్ విద్యా సంస్థలపై తక్షణమే విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.విద్యార్థి సంఘాల నాయకులు విద్యారంగాన్ని రేవంత్‌రెడ్డి ప్ర భుత్వం పట్టించుకోకపోతే మాత్రం భవిష్యత్తులో ఉమ్మడిగా కలిసి పోరాటాలకు సిద్ధమవుతామనిరాష్ట్రప్రభుత్వాన్ని హెచ్చరించారు. వి ద్యార్థి సంఘం నాయకులు అనిల్, విఘ్నేష్, గౌతమ్, జీవన్‌రాథోడ్, కుషాల్, చక్రి, గోపాల్, కిషోర్, నిరోజ్, నిఖిల్, సాయి పవన్, రాజ్‌పవన్ పాల్గొన్నారు.


## సిఎం సహాయ నిధి పేదలకు చేయూత

రూ. 28 లక్షల చెక్కుల పంపిణీ చేసిన ఎమ్మెల్యే

**ప్రజాపక్షం / భైంసా :** ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా అనారోగ్యం బారిన పడిన పేదలకు ప్రభుత్వం తరపున చేయూత నివ్వడం జరుగుతోందని ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ అన్నారు. శనివారం భైంసా లోని ఎస్ఎస్ జిన్నింగ్ మిల్ ఇండస్ట్రీలో 135 మంది లబ్దిదారులకు 28 లక్షల 29 వేల 600 రూపాయలను చెక్కుల రూపంలో అందించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. రాజకీయాలకు అతీతంగా పేద ప్రజలను ఆదుకోవడానికి తన క్యాంప్ కార్యాలయం లో సిఎం రిలీఫ్ ఫండ్ కోసం ప్రత్యేక సిబ్బందిని నియమించి త్వరితగతిన చెక్కులను పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఆయన ధన్యవాదములు తెలిపారు. విద్యా వైద్యం, సాగునీరు అందించడమే ధ్యేయంగా తాను ముందుకు సాగుతున్నానని చెప్పారు. సీనియర్ నాయకులు సర్పంచ్‌లు, బీజేపి నాకులు మాజీ ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.



## బివిఆర్‌ఐటిలో ముగిసిన వామ్స్..
## 2026 అంతర్జాతీయ సదస్సు




**ప్రజాపక్షం/నర్సాపూర్ :** నర్సాపూర్ పట్టణ సమీపంలోని బి.వి. రాజు ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ నందు నిర్వహించిన 5వ ఐఈఈఈ వైర్లెస్, యాంటెన్నా అండ్ మైక్రోవేవ్ అంతర్జాతీయ సదస్సు ఐదు రోజుల పాటు విజయవంతంగా కొనసాగి శనివారం ముగిసింది. ఈ అంతర్జాతీయ సదస్సులో శాస్త్రీయ పరిశోధనలు, పరిశ్రమవిద్యా సంస్థల పరస్పర సహకారం, వృత్తిపరమైన అభివృద్ధి మరియు అంతర్జాతీయ భాగస్వామ్యాలకు వేదికగా నిలిచింది. ఈ ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వామ్స్ సలహాదారు డా॥ సుధాకర్ రావు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ, ఇంతటి చక్కని సదుపాయాలు మంచి ఆరోగ్యకరంగా పచ్చని వాతావరణంలో ఈ అంతర్జాతీయ సదస్సు జరిగేందుకు ప్రోత్సాహం సహాయ సదుపాయాలు కల్పించిన శ్రీ విష్ణు ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్ శ్రీ కె వి విష్ణురాజుకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

### వామ్స్ ప్రతిష్ఠాత్మక అవార్డులు

వామ్స్ సదస్సులో అత్యున్నత గౌరవం గా భావించే డా॥ సుధాకర్ రావు స్పెషల్ రికగ్నిషన్ అవార్డు ను రూ.1,00,000 నగదు బహుమతితో ప్రొఫసర్ సమీర్ చక్రవర్తి వేదుల మరియు ప్రొఫసర్ పి.సతీష్ రామచౌదరిలకు సంయుక్తంగా అందజేశారు. వామ్స్ సదస్సు అభివృద్ధికి మరియు ఇంజనీరింగ్ సమాజానికి వారు అందించిన విశేష సేవలను గుర్తిస్తూ ఈ అవార్డును ప్రదానం చేశారు. అదే విధంగా, రూ.50,000 నగదు బహుమతితో కూడిన డా॥ సుధాకర్ రావు బెస్ట్ పేపర్ అవార్డు ను అహ్మదాబాద్ లోని ఇస్రోస్పేస్ అప్లికేషన్స్ సెంటర్ కు చెందిన శ్రీ రోహిత్ నంద్వానీ గారికి ఆయన అత్యుత్తమ పరిశోధన కృషికి గాను ప్రదానం చేశారు. ఈ సదస్సును విజయవంతం చేయడంలో డైరెక్టర్ డా॥ లక్ష్మీ ప్రసాద్, ప్రిన్సిపల్ డా॥ సంజయ్, దూబే, మేనేజర్ బాపిరాజు, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ సురేష్ కీలకపాత్ర పోషించారు. జాతీయ, అంతర్జాతీయ దేశాల ప్రతినిధులు, శాస్త్రవేత్తలు, పరిశ్రమ రంగ నిపుణులు, ప్రతిష్ఠాత్మకమైన విద్య సంస్థల అధ్యాపకులు విద్యార్థులు,ఇస్రో, సైన్స్ అండ్ టెక్నాలజీ శాస్త్రవేత్తలు పాల్గొని సదస్సును విజయవంతం చేశారు.

# ప్రైవేటు బడి వద్దు - ప్రభుత్వ బడి ముద్దు

విద్యా సంవత్సరం వేళ
కార్పొరేట్ దోపిడీని అరికట్టాలి

**ప్రజాపక్షం/ముథోల్ :** రాబోయే జూన్ 15 నుండి రాష్ట్ర వ్యాప్తంగా నేతన విద్యా సంవత్సరం ప్రారంభం కాన్ను నేపథ్యంలో, ముథోల్ నియోజకవర్గ వ్యాప్తంగా ప్రైవేటు బడి వద్దు ప్రభుత్వ బడి ముద్ద నినాదంతో ప్రభుత్వ విద్యా రంగాన్ని బలోపేతం చేయాలని కోరుతూ ఆల్ ఇండియా ప్రొగ్రెసివ్ స్టూడెంట్ యూనియన్ ఆధ్వర్యంలో శనివారం సమావేశాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని జిల్లా కార్యదర్శి గడ్‌పాలే పరమేష్ తెలిపారు. సెలవులు ముగిసే బడులు తెరుచుకుంటున్న తరుణంలో ప్రైవేటు కార్పొరేట్ వి ద్యా సంస్థలు అడ్మిషన్లు, బుక్స్, యూనిఫారాల పేరుతో పేద, మధ్యతరగతి తల్లిదండ్రుల రక్తాన్ని పిండుకుంటున్నాయని మండిపడ్డారు. ఏలాంటి ముదస్తు అనుమతులు లేని స్కూళ్ళు కూపెడా ఇష్టారాజ్యంగా పీజులు వసూలు చేస్తూ విద్యా చట్టాలను తుంగలో తొక్కుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యా హక్కు చట్టం ప్రకారం పేద విద్యార్థులకు కేటాయించాల్సిన 25 శాతం ఉచిత సీట్ల ఊసే ఎక్కడా కనిపిండం లేదని ఆయన విమర్శించారు. ప్రభుత్వాలు ఇప్పటికైనా కళ్ళు తెరిచి పేదలకు నాణ్యమైన విద్యను అందించే ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని పరమేష్ డిమాండ్ చేశారు. (ఎఐపిఎస్‌యు) ముథోల్ నియోజకవర్గ కమిటీ ప్రధాన డిమాండ్లను ప్రకటించారు. వీటిలో భాగంగా పీజుల నియంత్రణా, ప్రైవేటు పాఠశాలలో దోపిడీని అరికట్టేందుకు తక్షణమే ఫీజు నియంత్రణ చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని, ప్రభుత్వ పాఠశాలల బలోపేతం కొరకు ప్రభుత్వ బడుల్లో ఇంగ్లీ మీడియం బోధనతో పాటు మౌలిక సదుపాయాలు, లైబ్రరీ, ల్యాబ్స్, తాగునీరు, నాణ్యమైన భోజనం, యుద్ధప్రాతిపదికన కల్పించాలని పేర్కొన్నారు. అక్రమ బ్రాంచీల మూసివేత ఒకే పాఠశాల అనుమతితో నియోజకవర్గ వ్యాప్తంగా ఇష్టారాజ్యంగా నడుపుతున్న అక్రమ ప్రైవేటు బ్రాంచాలపై విద్యాశబూఖ అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. 25 శాతం ఉచిత సీట్లు ప్రైవేటు విద్యా సంస్థల్లో పేద విద్యార్థులకు విద్యా హక్కు చట్ట ప్రకారం 25 శాతం సీట్లు ఉచితంగా దక్కేలా పర్యవేక్షించిలని కోరారు, నూతన విద్యా సంవత్సరం మొదటి రోజు జూన్ 15 నుంచే ముథోల్ నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలు, హాస్టల్ళలో విద్యార్థులకు ఏలాంటి ఇ బ్బందులు ఎదురైనా, ప్రైవుటు స్కూళ్ళలో అడ్మిషన్ల పేరుతో దోపిడికి గురైన విద్యార్థులు, తల్లిదండ్రులు, (ఎఐపిఎస్‌యు) నాయకులను సంప్రదించవచ్చునని పిలుపునిచ్చారు. హక్కుల కోసం ప్రభుత్వ విద్యారంగ రక్షణ కోసం మా పోరాటం నిరంతరం కొనసాగుతుందని పరమేష్ తెలిపారు.(ఎఐపిఎస్‌యు) ముథోల్ నియోజకవర్గ నాయకులు, నితిన్, అఖిలేష్, నిఖిల్ పాల్గొన్నారు.

# ప్రతి కేసులో నాణ్యమైన దర్యాప్తు... బాధితులకు అండ

మంత్రి క్రైమ్ మీటింగ్‌లో ఎస్పి

**ప్రజాపక్షం /సంగారెడ్డి :** మంత్రి క్రైమ్ రివ్యూ మీటింగ్‌లో భాగంగా శనివారం సంగారెడ్డి జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో జిల్లా పోలీసు అధికారులతో నెలవారీ సమీక్షా సమావేశాన్ని జిల్లా ఎస్పీ పరితోష్ ఫంకజ్ నిర్వహించారు. ఈ సందర్భంగా అండర్ ఇన్వెస్టిగేషన్‌లో ఉన్న గ్రేవ్ ,నాన్ గ్రేవ్,మిస్సింగ్ ఎసిబీడబ్లూ, కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఇన్వెస్టిగేషన్‌లో వేగం పెంచాలని ప్రతి కేసులో నాణ్యమైన దర్యాప్తును త్వరితగతిన పూర్తి చేసిభాదితులకు అండగా నిలవాలని అధికారులకు సూచించారు. లాంగ్‌పెండింగ్ కేసు చేదనకు ప్రత్యేక ప్లాన్ ఆప్ యాక్షన్ ఉండాలని ,ఇన్వెస్టిగేషన్ లో సందేహాలు ఉంటే ఇన్వెస్టిగేషన్ సపోర్ట్ సెంటర్ సేవలను వినియోగించుకోవాలన్నారు. పోలీసు స్టేషన్ కు వచ్చిన పిర్యాదుదారులతో మర్యాదగా మాట్లాడి వారికి భరోసా కల్పించాలన్నారు. ఎస్ హెచ్‌ఓలు తమ పరిధిలోని ప్రతి గ్రామానికి విలేజ్ పోలీసు అధికారి నియమించాలని ఆయా గ్రామాలలో రౌడీ, షీటర్లు, సస్పెక్టనలను తరచు తనిఖీ చేస్తూ వారి కదిలికలపై నిఘా ఉంచాలన్నారు. విలేజ్ పోలీసు అధికారులు ఆయా గ్రామాలలో ముందస్తు సమాచారాన్ని సేకరించి శాంతి భద్రతలకు పరిరక్షణకు కృషి చేయాలని సూచించారు. మహిళల భద్రత రోడ్డు ప్రమాదాలు, ఆర్థిక నేరాలు, ఆన్‌లైన్ మోసాలు, గురించి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజలను




చైతన్య పరచాలన్నారు. బ్లూ కోల్ట్స్ ,నైట్ పెట్రోలింగ్ సిబ్బంది పాపిలాస్ డివైస్ లను వినియోగిస్తూ అనుమానస్పంద వ్యక్తుల పింగర్ ప్రింట్లు సేకరించాలన్నారు.ఏఆర్‌డిఎస్పీ నరేందర్, ఇన్‌స్పెకటు రమేష్, కిరణ్ కుమార్ నాగేశ్వరరావు, సదా నాగరాజు, ప్రవీణ్ రెడ్డి, పింగర్ ప్రింట్ ఇన్‌స్పెక్టర్ వినయ్ కుమార్, జిల్లా ఇన్‌స్పెక్టర్లు ఆర్‌ఐలు సబ్ ఇన్‌స్పెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

మహేష్ బాబు, నమ్రతా శిరోద్కర్ జీఎంబి ఎంటర్టైన్మెంట్, ప్రముఖ దర్శకుడు వెంకటేష్ మహా దర్శకత్వంలో, యాక్టర్ సత్యదేవ్ కథానాయకుడిగా నటిస్తున్న సైకాలజికల్ థ్రిల్లర్ 'రావు బహదూర్' . వెంకటేష్ మహా ఈ చిత్రానికి దర్శకత్వం వహించడమే కాకుండా కథ, ఎడిటింగ్ బాధ్యతలు కూడా నిర్వహిస్తున్నారు.

# రీల్



## 'రావు బహదూర్' తెలుగు ప్రేక్షకులు గర్వపడే సినిమా

**టీజర్' లాంచ్ ఈవెంట్ లో హీరో సత్యదేవ్**

మహేష్ బాబు, నమ్రతా శిరోద్కర్ జిఎంబి ఎంటర్టైన్మెంట్, ప్రముఖ దర్శకుడు వెంకటేష్ మహా దర్శకత్వంలో, యాక్టర్ సత్యదేవ్ కథానాయకుడిగా నటిస్తున్న సైకాలజికల్ థ్రిల్లర్ 'రావు బహదూర్' . వెంకటేష్ మహా ఈ చిత్రానికి దర్శకత్వం వహించడమే కాకుండా కథ, ఎడిటింగ్ బాధ్యతలు కూడా నిర్వహిస్తున్నారు. ఈ చిత్రాన్ని ఏ+ఎస్ మూవీస్, శ్రీచక్రాస్ ఎంటర్‌టెన్‌మెంట్స్ సంయుక్తంగా నిర్మించాయి. ఇప్పటికే విడుదలైన ఫస్ట్ గ్లింప్స్, అలాగే ప్రేక్షకుల ప్రశంసలు అందుకున్న 'ఓ సుందరి' పాట సినిమాపై ఆసక్తిని మరింత పెంచాయి. 'ఇంటు ది వరల్ ఆఫ్ రావు బహదూర్' వీడియోకు అద్భుతమైన స్పందన లభించింది. చిత్ర నిర్మాతలు 'నాట్ ఎ టీజర్'ను తాజాగా లాంచ్ చేశారు. ఈ సందర్భంగా హీరో సత్యదేవ్ మాట్లాడుతూ. ఏ ఇండస్ట్రీలోనైనా ఒక మంచి, క్రేజీ సినిమా వస్తే తెలుగు ప్రేక్షకులు దాన్ని సపోర్ట్ చేస్తారు. జూలై 3న మా రావు బహదూర్ సినిమా కూడా విడుదల తోంఈ చిత్రాన్ని మిగతా ఇండస్ట్రీల ప్రేక్షకులు కూడా అంతే స్థాయిలో ఆదరిస్తారని నమ్ముతున్నాను. తెలుగు ప్రేక్షకులందరూ గర్వపడేలా ఈ సినిమాను చేశాము. వెంకటేష్ మహా తన ప్రాణం పెట్టి ఈ సినిమా కోసం పనిచేశాడు. మాకు సినిమా అంటే పిచ్చి ఈ సినిమా కోసం ప్రతి రోజూ ఐదు గంటల పాటు మేకప్ వేసుకునేవాడు. ఈ ఈవెంట్ లో హీరోయిన్ దీపా థామస్, నిర్మాత శరత్ చంద్ర , నిర్మాత అనురాగ్ రెడ్డి , నిర్మాత గోపాలకృష్ణ రెడ్డి పాల్గొన్నారు.

## వైవిధ్యమైన ప్రేమకథ... 'ఒక్క చూపుతో మెదలైన'



శివ చౌదరి, జశ్విక హీరో హీరోయిన్‌లుగా చెంచయ్య నూతలపాటి దర్శకత్వంలో శ్రీ ఆంజనేయ క్రియేషన్స్ పతాకంపై పోలూరి బిందు సారధి నిర్మిస్తున్న చిత్రం 'ఒక్క చూపుతో మెదలైన..' ఈ చిత్రానికి సంబంధించిన ట్రైలర్ విడుదలయింది. ఈ ట్రైలర్ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా హీరో శ్రీకాంత్ , నటుడు శివాజీ రాజా పాల్గొన్నారు. ఈ సందర్భంగా 'ఒక్క చూపుతో మెదలైన..' ట్రైలర్ ను విడుదల చేసిన హీరో శ్రీకాంత్ మాట్లాడుతూ ..'' చెంచయ్య నూతలపాటి దర్శకత్వంలో తెరకెక్కిన 'ఒక్క చూపుతో మెదలైన..' చిత్రం అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకునేలా ఉంటుందని సినిమా ట్రైలర్ చూస్తే అర్థమవుతుంది. పోలూరి బిందుసారధి నిర్మిస్తున్న ఈ చిత్రం ఇప్పుడొస్తున్న చిత్రాలకు భిన్నంగా ఉండి అందరి మనసుల్ని గెలుచుకుంటుందన్న నమ్మకాన్ని వ్యక్తం చేశారు. నటుడు శివాజీ రాజా మాట్లాడుతూ ప్రస్తుతం టాలీవుడ్ లో వస్తున్న చిత్రాలను మనం గమనిస్తూనే ఉన్నాం. మంచి కంటెంట్ తో వస్తున్న చిత్రాలను ప్రేక్షకులు ఎంతగానో ఆదరించి అక్కున చేర్చుకుంటున్నారు. మంచి విజయాల్ని అందిస్తూ నటీనటులను, సాంకేతిక నిపుణులను ప్రోత్సహిస్తున్నారు. ఇటీవల వచ్చిన 'రాజు వెడ్స్ రాంబాయి'లాగే ఈ చిత్రం కూడా మంచి విజయాన్ని అందుకోవాలని అకక్షశించారు. దర్శకుడు చెంచయ్య నూతలపాటి మాట్లాడుతూ .మంచి కంటెంట్ తో ఈ సినిమాను తెరకెక్కించాం. అన్ని వర్గాల ప్రేక్షకులు మెచ్చే విధంగా సినిమా సాగుతుంది. నిర్మాత పోలూరి బిందుసారధి సినిమా చక్కగా రూపొందడానికి పూర్తి సహకారాన్ని అందించారు. ఎక్కడా రాజీ పడకుండా మాకు ఏం కావాలంటే అది వెంటనే సమకూర్చి సినిమా బాగా రావడానికి తోడ్పడ్డారు'' అని చెప్పారు. నిర్మాత పోలూరి బిందుసారధి మాట్లాడుతూ.. ఈ కార్యక్రమానికి సహకరించిన ఆటో కిషోర్, లింగం గూడు అందరికీ ధన్యవాదాలు తెలిపారు. ఈ సినిమాకు కెమెరా: అనం వెంకట్, ఎడిటర్: మహేంద్రనాథ్, సంగీత: చైతన్య రాజ, కో డైరెక్టర్ చందు, పి.ఆర్.ఒ : బాబునాయక్ (సినీసందడి, సినీలోకం), నిర్మాత పోలూరి బిందుసారధి, కథ, మాటలు, స్క్రీన్ ప్లే, దర్శకత్వం : చెంచయ్య నూతలపాటి.

## కారవ్యాన్‌లో కూర్చోవడం ఇష్టముండదు

– ఐశ్వర్య రాజేష్

సంక్రాంతికి వస్తున్నాం' సినిమాతో తెలుగు తెరపై తనకంటూ ఓ ప్రత్యేకతను సంపాదించుకున్న నటి ఐశ్వర్య రాజేష్. మాతృభాషా తెలుగే అయినా చెన్నై లో స్థిరపడింది. బికాం చదువుకున్న ఐశ్వర్య రాజేష్ సినిమాకు చెందిన కుటుంబం నుంచి తెరపైకి వచ్చారు.తనదైన శైలిలో ప్రేక్షకులను అలరిస్తోంది. తమిళ, తెలుగు, మలయాళ భాషల్లో బిజీగా ఉంది.ఈ సినిమాతో తెలుగు బిజీ అయింది.తాజాగా 'ఓ .సుకుమారి'' సినిమా ప్రమోషన్ కు హైదరాబాద్ కు వచ్చిన ఐశ్వర్య రాజేష్ ప్రజాపక్షం ప్రతినిధితో ప్రత్యేకంగా మాట్లాడారు.

**మీరు తెలుగు స్పష్టంగా మాట్లాడుతున్నారు ? మీ కుటుంబ నేపథ్యం ఎక్కడ ?**



**ఐశ్వర్య :** నేను తెలుగు అమ్మాయినే సార్ . నా మాతృ భాషా తెలుగు. మేము ఇంట్లో తెలుగులోనే మాట్లాడుకుంటాము. తెలుగు రాయడం అంత స్పష్టంగా రాదు కానీ తెలుగు వాళ్ళమే. అయితే మా ఫ్యామిలీ చెన్నై లో సెట్టిల్ అయ్యారు. నేను చిన్నప్పటి నుంచి అక్కడే చదువుకున్నాను. యతిరాజ్ మహిళా కళాశాలలో బికాం పూర్తి చేశాను. రెగ్యులర్ గా కాలేజీ వెళ్లి చదువుకున్నాను.

**సంక్రాంతికి వస్తున్నాం తరువాత చాల గ్యాప్ వచ్చినట్టు ఉంది ? కారణం ?**

**ఐశ్వర్య :** నేను ఇప్పటివరకు దాదాపు నలభై సినిమాల వరకు చేశాను. సుమారు ముఫై సినిమాలు హిట్ అయ్యాయి. సంక్రాంతికి వస్తున్నాం సినిమా కంటే ముందు ఎక్కువగా లేడి ఓరియంటెడ్ సినిమాలు చేశాను. అప్పుడు ప్రతి ఒక్కరు నను లేడి ఓరియంటెడ్ రోల్స్ కోసమే అడిగేవారు. సంక్రాంతికి వస్తున్నాం సినిమాలోనే కామెడీ రోల్ చేయడం వల్ల అప్పటి నుంచి అలాంటి పాత్రలు వస్తున్నాయి. అందుకే చాలా సెలెక్టివ్ గా కథ నచ్చితేనే చేస్తున్నాను. రెగ్యులర్ గా కథలు వింటూనే ఉంటాను.ఫీమేల్ సెంట్రిక్ సినిమాలు చెయ్యడం అంత ఈజీ కాదు. సినిమా మొత్తాన్ని తమ భుజస్కందాలపై మోయాల్సి వస్తుంది. చాలా పెద్ద బాధ్యత అది. నిజం చెప్పాలంట కొన్ని కథలు నచ్చక సుమారు ఏడెనిమిది నెలలు ఖాళీగా ఉన్న. ఆ సమయంలో సంక్రాంతికి వస్తున్నాం సినిమా ఆఫర్ వచ్చింది.

**ఓ సుకుమారి సినిమా కథలో మీకు నచ్చిన అంశమేంటి?**

**ఐశ్వర్య :** నిజానికి ఓ సుకుమారి సినిమా దర్శకుడు భరత్ దర్శన్ చెన్నైకి వచ్చి నాకు తమిళంలో కథ చెప్పాడు. నాకు తెలుగు రాదనుకుని తమిళంలో కథ చెప్తే నాకు కథ నచ్చలేదు. దర్శకుడు తమిళంలో సరిగ్గా కథను ప్రెజెంట్ చేయలేకపోవడంతో నాకు నచ్చలేదు. ఈ సినిమా బ్రహ్మాండం బద్దలు కొడతది అలా ఎం చెప్పను కానీ ఒక క్లిన్ ఫ్యామిలీ ఎంటర్టైనర్ సినిమా ఓ సుకుమారి. ఈ సినిమా కథంతా తన చుట్టే తిరుగుతుంది. అమ్మాయిని ముట్టుకుంటే కరెంట్ షాక్ కొడుతుంది అనే కథతో ఈ సినిమా నడుస్తుంది. నాకు తెలిసి ఇప్పటిరవకు ఇలాంటి కథతో సౌత్ లోనే సినిమా రాలేదు.

**స్టార్ హీరోల పక్కన నటిస్తున్న మీరు తిరువీర్ తో నటించడం ఎలా ఫీలవుతారు ?**

**ఐశ్వర్య :** తిరువీర్ చాలా గొప్ప నటుడు. నటన మీద తప్ప వేరే ద్యాస ఉండదు ఆయనకు. నిజం చెప్పాలనే తిరువీర్ ని చూస్తే మా నాన్నను చూసిన ఫీలింగ్ కలుగుతుంది. ఎందుకంటే మా నాన్న ఇలాగే ఉండేవారట. నా చిన్నప్పుడే ఆయన చనిపోయారు కాబట్టి నాకు గుర్తులేదు కానీ సరిగ్గా ఇలాగే ఉండేవారట. అల్ రెడీ తిరువీర్ నేను కలిసి నటించాం. మేమిద్దరం కలసి నటించడం ఇది రెండో సినిమా. ఇంతకు ముందు ఇద్దరు కలసి 'టక్ జగదీష్' అనే సినిమాలో నటించాం. ఈ సినిమాలో ఇద్దరి క్యారెక్టర్స్ చాలా సరదాగా ఉంటాయి.

**భవిష్యత్తులో డైరెక్షన్ చేసే ఆలోచన ఏమైనా ఉందా ?**

**ఐశ్వర్య :** లేదండి ...డైరెక్షన్ సైడ్ వెళ్లే ఆలోచన లేదు. మంచి కథలు, మంచి సినిమాలు చెయ్యాలి. నటిగా మంచి గుర్తింపు తెచ్చుకోవాలి. అదేనా ఇంట్రెస్ట్.

**కొత్త సినిమాలు ఏం చేస్తున్నారు ?**

**ఐశ్వర్య :** నాలుగైదు సినిమాలు చేస్తున్నాను. వెబ్ సిరీస్ చేస్తున్నాను. బిజీగానే ఉన్నానండి. పాకశాల పంతం అనే సినిమాతో పాటు నాగార్జున గారి వందో సినిమాలో నటిస్తున్నాను. అయితే నాగార్జున సినిమాలో హీరోయిన్ గా కాదు కానీ చాలా మంచి రోల్ చేస్తున్నాను. ఇసకపట్నం అనే సీరీస్ ఒకటి చేశాను. ఇది కూడా చాలా మంచి స్టోరీ. ఇలా నాలుగైదు సినిమాలతో బిజిగా ఉన్నాను.

## వెంకటేష్ సినిమాకు సంగీత దర్శకుడిగా దర్శకుడు జి.వి. ప్రకాష్



విక్టరీ వెంకటేష్, నందమూరి కళ్యాణ్ రామ్, అనిల్ రావిపూడి దర్శకత్వంలో ఓ సినిమా షైన్ స్క్రీన్స్ బ్యానర్‌పై సాహు గారపాటి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. సురేష్ ప్రొడక్షన్స్, శ్రీమతి అర్చన సమర్పణలో, జీ స్టూడియోస్ సహనిర్మాణంలో తెరకెక్కుతున్న ఈ చిత్రం 2027 సంక్రాంతికి గ్రాండ్ రిలీజెకు సిద్ధమవుతోంది. దక్షిణ భారత సినీ పరిశ్రమలో అగ్ర సంగీత దర్శకుల్లో ఒకరైన జీవీ ప్రకాష్ కుమార్ ఈ చిత్రానికి సంగీతం అందించనున్నారు. సంగీత దర్శకుడిగా, నటుడిగా బహుముఖ ప్రజ్ఞతో రాణిస్తున్న జీవీ ప్రకాష్ ప్రస్తుతం ఇండస్ట్రీలో అత్యంత బిజీ టాలెంటర్స్‌లో ఒకరు. ఆయన ఈ ప్రాజెక్ట్లో భాగమైన విషయాన్ని ప్రత్యేకంగా, వినోదాత్మకంగా ప్రకటిస్తూ మేకర్స్ అనిల్ రావిపూడి స్టైల్లో ఓ పవర్‌ఫుల్ వీడియోను విడుదల చేశారు.ఈ ప్రమోలో దిగ్గజ దర్శకుడు జంధ్యాల క్లాసిక్ చిత్రం 'ఆహా నా పెళ్లంట'లోని ఐకానిక్ సన్నివేశానికి నివాళిగా, పాత్రలను మెడ వరకు ఇసుకలో పాతిపెట్టిన సన్నివేశాన్ని రీక్రియేట్ చేశారు. సరదా ట్విస్ట్గా జీవీ ప్రకాష్ కుమార్ కూడా అదే పరిస్థితిలో కనిపిస్తారు. అప్పుడు అనిల్ రావిపూడి వచ్చి, సినిమా పండుగ వాతావరణానికి తగ్గట్టుగా చార్ట్బస్టర్ ట్యూన్స్ కావాలని అడగడం నవ్వులు పూయిస్తుంది. ఈ వీడియో ద్వారా ప్రముఖ గేయరచయిత అనంత శ్రీరామ్ కూడా ఈ చిత్ర బృందంలో భాగమని అధికారికంగా ప్రకటించారు. ఫ్యామిలీ ఆడియన్స్ను అలరించే వినోదాత్మక చిత్రాలనునవ్వులు,ఈ చిత్రం యువత, కుటుంబ ప్రేక్షకులు,అద్భుతమైన ఉండటంతో ఈ సినిమాపై ఆసక్తి రోజురోజుకూ పెరుగుతోంది.

## 'ట్రాన్స్ఫర్ త్రిమూర్తులు' ట్రైలర్ లాంచ్ చేసిన వినాయక్



వడ్డే జిష్ణు సమర్పణలో వడ్డే క్రియేషన్స్ బ్యానర్ మీద వడ్డే నవీన్ హీరోగా, నిర్మాతగా రూపొందించిన చిత్రం 'ట్రాన్స్ఫర్ త్రిమూర్తులు'. కమల్ తేజ నార్ల దర్శకుడిగా పరిచయమవుతున్నారు. ఈ సినిమాలో వడ్డే నవీన్, రాశి సింగ్, శిల్పా తులస్కర్, హీరోయిన్లుగా నటించారు. ఈ మూవీని 19న విడుదల చేయనున్నారు. ఈ క్రమంలో మూవీ ట్రైలర్‌ను రిలీజ్ చేశారు. ఈవెంట్కు ప్రముఖ దర్శకుడు వి.వి. వినాయక్ ముఖ్య అతిథిగా విచ్చేసి ట్రైలర్‌ను లాంచ్ చేశారు. అనంతరం వి.వి. వినాయక్ మాట్లాడుతూ 'వడ్డే నవీన్ ఈ కార్యక్రమానికి నన్ను పిలిచినందుకు థాంక్స్. నేను ఆయన చిత్రానికి అసిస్టెంట్, కో డైరెక్టర్‌గా పని చేశాను. నఆయన కెరీర్‌లోని 90 శాతం సినిమాలు మనస్ఫూర్తిగా ఇష్టంతో చేయలేదు. ఆ విషయం నాకు తెలుసు. సినిమాల పట్ల ఆయనెప్పుడూ తృప్తిగా ఉండరు. ఓ సందర్భంలో ఆయన పరపతి చూసి షాక్ అయ్యాను. 'ట్రాన్స్ఫర్ త్రిమూర్తులు' చిత్రం పెద్ద హిట్ అవ్వాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను' అని అన్నారు.వడ్డే నవీన్ మాట్లాడుతూ వినయ్ అప్పుడూ, ఇప్పుడూ వినయంగానే ఉన్నారు. . ఈ పదేళ్లలో టెక్నికల్ పరంగా ఎన్నో మార్పులు వచ్చాయి. ఈ మూవీలో కోర్ట్ డ్రామాతో పాటు సస్పెన్స్ బాగుంటుంది. తప్పకుండా ఎంజాయ్ చేస్తారు' అని అన్నారు.ఈ కార్యక్రమంలో రాశీ సింగ్ , సంగీత దర్శకుడు కళ్యాణ్ నాయక్ , విజయ్ పోలకి , కెమెరామెన్ కార్తీక్ సుజాత సాయికుమార్ ,ఆర్ట్ డైరెక్టర్ భిక్షపతి కందకట్ల పాల్గొన్నారు.

## 'వనమంచు పల్లె'.. మట్టి వాసనల గుండె చప్పుడు !

**రవీంద్రభారతిలో ఘనంగా కల్వకోలు మద్దిలేటి పాటల పుస్తక ఆవిష్కరణ**

**ముఖ్య అతిథులుగా పాల్గొన్న ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, ఎమ్మెల్సీ గోరటి వెంకన్న**

**కళాకారుల ఆటపాటలతో సాంస్కృతిక జాతరను తలపించిన సభ**



ప్రజాపక్షం/హైదరాబాద్ : ప్రముఖ అభ్యుదయ రచయిత, ప్రజాకవి కల్వకోలు మద్దిలేటి రచించిన 'వనమంచు పల్లె' పాటల పుస్తక ఆవిష్కరణ శుక్రవారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతి మినీ కాన్ఫరెన్స్ హాల్లో ఘనంగా జరిగింది. అభ్యుదయ రచయితల సంఘం (అరసం) తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి రాష్ట్ర నలుమూలల నుంచి కవులు, రచయితలు, కళాకారులు, మేధావులు, సాహిత్యాభిమానులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ పెబ్బేటి మల్లిఖార్జున్ అధ్యక్షతన జరిగిన సభలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, సిపిఐ శాసనసభ పక్ష నేత కూనంనేని సాంబశివ రావు, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత, ఎమ్మెల్సీ డాక్టర్ గోరేటి వెంకన్న, ముఖ్య అతిథులుగా పాల్గొని పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటం నుంచి నేటి వరకు ప్రజా ఉద్యమాల్లో పాటలు కీలక పాత్ర పోషించాయని గుర్తు చేశారు. పీడిత ప్రజల పక్షాన నిలిచే అభ్యుదయ సాహిత్యాన్ని అరసం ఎప్పటికప్పుడు ప్రోత్సహిస్తోందని, అదే స్ఫూర్తితో మద్దిలేటి ఈ పుస్తకాన్ని తీసుకురావడం అభినందనీయమన్నారు. గోరటి వెంకన్న మాట్లాడుతూ పాట అనేది కేవలం అక్షరాల సమాహారం కాదని, సమాజ అంతరంగాన్ని ప్రతిబింబించే శక్తివంతమైన సాధనమన్నారు. పల్లెటూరి జీవన విధానం, శ్రమజీవుల కష్టసుఖాలు, సామాజిక చైతన్యాన్ని కల్వకోలు మద్దిలేటి తన పాటల్లో అద్భుతంగా ఆవిష్కరించారని ప్రశంసించారు. ప్రతి పాటలోనూ పల్లె సంస్కృతిపై మక్కువతో పాటు సామాజిక దృక్పథం స్పష్టంగా కనిపిస్తోందన్నారు. సభలో ప్రముఖ కవి, విశ్లేషకుడు డాక్టర్ కోయి కోటేశ్వర రావు మాట్లాడుతూ జాతి, వర్గ, వర్ణ రహిత సమాజ నిర్మాణాన్ని ఆకాంక్షించే గీతాలు ఈ గ్రంథంలో ఉన్నాయని తెలిపారు. అరసం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పల్లేరు వీరస్వామి మాట్లాడుతూ సమాజ హితాన్ని కాంక్షించే ప్రగతిశీల సాహిత్యాన్ని ఈ గ్రంథం అందిస్తోందన్నారు. సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎం. బాలనర్సింహ, రాజ్యాంగ రక్షణ దళ్ తెలంగాణ అధ్యక్షుడు షాన్ రెంజర్ల రాజేష్ మాట్లాడుతూ రాజ్యాంగ హక్కుల పరిరక్షణ, సామాజిక సమానత్వం కోసం ఇలాంటి సాహిత్యం అవసరమని అభిప్రాయపడ్డారు. పుస్తక సమీక్షకుడు ఎదిరేపల్లి కాశన్న గ్రంథంలోని సాహిత్య విలువలు, పల్లె పదాల సొగసును విశ్లేషించారు. పుస్తక రచయిత కల్వకోలు మద్దిలేటి మాట్లాడుతూ నాగర్ కర్నూల్ ప్రాంతంలోని పల్లె జీవనం, ప్రకృతి, కష్టజీవుల ఆవేదనలే తనకు స్ఫూర్తిగా నిలిచాయని తెలిపారు. రాష్ట్రస్థాయి ప్రముఖుల సమక్షంలో తన పుస్తకం ఆవిష్కృతం కావడం జీవితంలో మరపురాని ఘట్టమని ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షుడు కె. శ్రీను, రాష్ట్ర కార్యదర్శి పల్లె నరసింహ తదితరులు 'వనమంచు పల్లె' గ్రంథంలోని పాటలను ఆలపించి సభను అలరించారు. సాంస్కృతిక ప్రదర్శనలతో కార్యక్రమం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ కార్యక్రమంలో తెలంగాణ వికాస సమితి రాష్ట్ర అధ్యక్షుడు వనపట్ల సుబ్బయ్య, నెలపొడుపు సాహిత్య సాంస్కృతిక వేదిక గౌరవ అధ్యక్షులు కందికొండ మోహన్, కవులు కాశన్న, వహీద్ ఖాన్, దినకర్, గుడిపల్లి నిరంజన్, అరసం రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి శ్రీ తిరిపాలు, అసిస్టెంట్ ప్రొఫెసర్ యేకుల రాజారావు, రిటైర్డ్ ఇండస్ట్రియల్ జెడి యేకుల వెంకయ్య, అడ్వకేట్ విభూది వెంకటేశ్, యేకుల సురేష్, వెంకట్ పవార్, తిరిపాల్, నూనె క్రాంతి కుమార్ తదితరులు రచయితను అభినందించారు. తెలంగాణ రాష్ట్ర ంలోని వివిధ జిల్లాల నుంచి వచ్చిన వందలాది మంది సాహిత్యాభిమానులు, కవులు, కళాకారులు కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## అమెరికా విదేశీమంత్రికి జైశంకర్ నిరసన

**వాషింగ్టన్:** భారత నౌకలపై దాడులు చేయడం పట్ల అమెరికా విదేశీ వ్యవహారాల మంత్రి మార్కో రుబియోకు భారత విదేశీ వ్యవహారాల మంత్రి ఎస్.జైశంకర్ నిరసన తెలియజేశారు. అమెరికా పర్యటన సందర్భంగా శనివారం వాషింగ్టన్‌లో మార్కో రుబియోను జైశంకర్ కలిశారు. ఈ సందర్భంగా ఒమన్ తీరంలో భారత్‌కు చెందిన ముగ్గురు నావికులు మరణించిన విషయం, హోర్ముజ్‌లో వరుసగా మూడు భారత నౌకలపై దాడుల ఘటనలను ఆయన దృష్టికి తెచ్చారు. ఆయనకు తీవ్ర నిరసన తెలియజేశారు. వాణిజ్య నౌకలపై దాడులు చేయడం ఎంత మాత్రం క్షంతవ్యం కాదని, ఇది సమర్థించరాని విషయమని చర్చలసందర్భంగా తాను మార్కో రుబియోకు తెలియజేసినట్లు ఎక్స్ వేదికగా జైశంకర్ పోస్టింగ్ పెట్టారు.భారతదేశం ఇప్పటికే న్యూఢిల్లీలో ఉన్న అమెరికా దౌత్యవేత్తలను తన సమక్షానికి పిలిపించి రెండుసార్లు నిరసన తెలియజేసింది.

''అమెరికా నావికాదళం గల్ఫ్‌లో భారత నావికులపై దాడులను ఎంత మాత్రం సహించలేం,అవి ఎంతమాత్రం సమర్థనీయం కాదని పదే పదే నొక్కి చెబుతున్నాం, ఈ దాడుల్లో ముగ్గురు భారతీయ నావికులు మరణించారు'' అని మార్కో రుబియోకు జైశంకర్ తెలియజేశారు.

## వాంగ్మూలం నమోదు

(మొదటి పేజీ తరువాయి)

ఎన్నికల సమయంలో అక్రమంగా ఫోన్ ట్యాపింగ్ జరిగినట్లు ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో సిట్ విస్తృత స్థాయిలో దర్యాప్తు చేపడుతోంది. ప్రాథమిక విచారణలో అప్పట్లో ఖమ్మం రాజకీయాల్లో కీలక పాత్ర పోషించిన తుమ్మల నాగేశ్వరరావు కూడా ట్యాపింగ్కు గురైన వారిలో ఒకరని గుర్తించినట్లు సమాచారం. కొందరు ఇంటెలిజెన్స్ అధికారులు ఆయన ఫోన్ను అక్రమంగా ట్యాప్ చేయడంతో పాటు, ఆయన కదలికలను ట్రాక్ చేసి వ్యక్తిగత సంభాషణలను పర్యవేక్షించినట్లు దర్యాప్తులో వెలుగులోకి వచ్చినట్లు తెలుస్తోంది. మంత్రి నివాసంలో జరిగిన విచారణ సందర్భంగా ఆయన ఫోన్ కాల్స్, లొకేషన్ డేటా, వ్యక్తిగత కమ్యూనికేషన్లపై జరిగిన నిఘాకు సంబంధించి సిట్ అధికారులు పలు వివరాలు సేకరించారు. బాధితుడిగా తుమ్మల ఇచ్చిన వాంగ్మూలం కేసు దర్యాప్తులో కీలక ఆధారంగా మారే అవకాశముందని అధికారులు భావిస్తున్నారు. ఇప్పటికే ఈ కేసులో గత ప్రభుత్వానికి చెందిన పలువురు సీనియర్ అధికారులు న్యాయపరమైన కస్టడీలో ఉన్నారు. తాజాగా మంత్రి తుమ్మల వాంగ్మూలం నమోదు కావడంతో ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం మరోసారి రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. సిట్ దర్యాప్తు వేగవంతం కావడంతో రానున్న రోజుల్లో మరికొంత మంది రాజకీయ నాయకులు, అధికారులకు నోటీసులు జారీ అయ్యే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది.

## ఆకట్టుకుంటున్న సవిత ఆనంద్ బెనగి సోలో పెయింటింగ్ ప్రదర్శన

ప్రజాపక్షం/హైదరాబాద్ : కన్నడ సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో ప్రముఖ కళాకారిణి సవిత ఆనంద్ బెనగి సోలో పెయింటింగ్ ప్రదర్శన శనివారం ప్రారంభమైంది. ఈ ప్రదర్శనను అఖిల భారత శాంతి, సంఘీభావ సంఘం అధ్యక్షులు డాక్టర్ దిడ్డి సుధాకర్ ప్రారంభించారు. మహిళల జీవనశైలి, భావోద్వేగాలను ప్రతిబింబించే విభిన్న థీమ్స్‌తో రూపొందించిన సుమారు60 చిత్రాలు సందర్శకులను ఆకట్టుకుంటున్నాయి. డాక్టర్ దిడ్డి సుధాకర్ మాట్లాడుతూ, కళాకారుడి సృజనాత్మకతను ప్రతిభింబించే సోలో పెయింటింగ్ ప్రదర్శనలు కళాభిమానులకు ప్రత్యేక అనుభూతిని ఇస్తాయని తెలిపారు. కళాకారుడి ఊహాశక్తి, నైపుణ్యాన్ని లోతుగా అర్థం చేసుకునేందుకు మంచి వేదికగా నిలుస్తాయనిఅన్నారు. సవిత ఆనంద్ బెనగి అనేక సామూహిక, రాష్ట్ర మరియు జాతీయ స్థాయి కళా ప్రదర్శనల్లో పాల్గొని అనేక అవార్డు లు, గౌరవాలు అందుకున్నారని నిర్వాహకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రముఖ చిత్రకారు లు గణేష్ దోదామని, సు హాసిని కలఘాట్కి, రమేష్ కలఘాట్కి పాల్గొన్నారు..

## 24 గంటల్లో ఒప్పందం !


(మొదటి పేజీ తరువాయి)

తుది ఒప్పందంపై తాము దృష్టి సారించామని సోషల్ మీడియాలో పోస్టు చేశారు. ఒప్పందం కుదురుతుందని ట్రంప్,జె.డి.వాన్స్,మార్కో రుబియోతో పపాటు ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియన్,విదేశీమంత్రి అబ్బాస్ అరాఘ్చీలు చేసిన సానుకూల పోస్టింగులను కూడా ఆయన టాగ్ చేశారు. అదేవిధంగా ట్రంప్ కూడా తన సోషల్ మీడియా ద్వారా, యుద్ధం ముగుస్తుందని అబ్బాస్ అరాఘ్చీ చేసిన సానుకూల ప్రకటనను షేర్ చేశారు.

అమెరికా–ఇరాన్ మధ్య ఒక అధికారిక మధ్యవర్తిగా పాకిస్థాన్ గడచిన ఏప్రిల్ నెల నుండి ఇస్లాం ప్రపంచంలో తన కీర్తిప్రతిష్టలను ఇనుమడింపజేసుకుంది. ఎంత తీవ్ర ఉద్రిక్తత కొనసాగుతున్నప్పటికీ ఇరు దేశాలూ పాకిస్థాన్‌విషయంలో ఒకే మాటమీద నిలబడ్డాయి. తమ మధ్య పాకిస్థాన్ మాత్రమే ఏకైక అధికారిక మధ్యవర్తిదేశమని గతంలో అమెరికా–ఇరాన్ కొద్ది గంటల తేడాతో ఏకకాలంలో ప్రకటనలు చేశాయి. పాకిస్థాన్‌ను యాచకుల దేశంగా భారత్ విదేశీవ్యవహారాల మంత్రి అభివర్ణించడాన్ని ముస్లిం మీడియా ప్రపంచం తీవ్రంగా తప్పుపడుతోంది. విదేశాంగ విధానంలో భారత్ విఫలమైందని, ఫిబ్రవరి 28వ తేదీన ఇరాన్‌పై అమెరికా దాడి చేయడానికి మూడు రోజుల ముందుగా భారత ప్రధాన మంత్రి ఇజ్రాయెల్‌లో పర్యటించడాన్ని ప్రముఖంగా ఇస్లామిక్ మీడియా ప్రస్తావిస్తోంది.

భారత్ నౌకలపై దాడులు ఇరాన్ పనే:ట్రంప్

అమెరికా–ఇరాన్ మధ్య ఒప్పందం కుదిరిందని శుక్రవారం ప్రకటించిన డోనాల్డ్ ట్రంప్, ఒమన్ తీరంలో భారత్ నౌకలపై దాడులకు ఇరాన్ డ్రోన్లే కారణమని ప్లేటు ఫిరాయించారు. ఆయన మాటలు అందరినీ తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేశాయి. ఒమన్ తీరంలో 'పలావ్' జెండాతో వెళుతున్న ట్యాంకర్ హోర్ముజ్ జలసంధిలో తాము విధించిన నిబంధనలను ఉల్లంఘించిందని, అందువల్లనే తాము దాడిచేశామన అమెరికా సైనిక దళం సెంట్‌కామ్ అధికారులు ప్రకటించగా, ట్రంప్ అందుకు విరుద్ధ ప్రకటన చేశారు. ముగ్గురు నావికులు మరణించిన ఘటనపై భారత ప్రభుత్వం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. రెండుసార్లు అమెరికా దౌత్యవేత్త అధికారులను తమ సమక్షానికి పిలిపించి తీవ్ర నిరసన తెలియజేసింది.







Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Plot No 302, Venkata Sai Towers, Nehrunagar, KHAMMAM 507 002 Telangana State. RNI TELTEL /2018/76759, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com